
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50



'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

నగరాల్లోని వారికీ తెలియక..



ఇతర దేశాల్లో వినియోగదారుల హక్కులకు ప్రాధాన్యత ఎక్కువ. మన దేశంలో అంతంత మాత్రమే. చట్టాలున్నా వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం ఉంది. గ్రామీణ ప్రజలే కాదు.. నగరాల్లోని వారికి కూడా వినియోగదారుల కమిషన్లను ఎలా ఆశ్రయించాలో తెలియదు. చెప్పుకోవడానికే చట్టాలు అన్నట్టుగా వ్యవస్థ తయారైంది. ప్రభుత్వం ఇతర కోర్టులతోపాటు ఈ కమిషన్లనూ అభివృద్ధి చేసి, ప్రజల చెంతకు చేర్చాలి. చట్టప్రకారం జిల్లాకో కమిషన్ ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కొత్త జిల్లాల్లో ఏర్పాటు చేస్తే దగ్గరలో సత్వర న్యాయం అందే అవకాశం ఉంటుంది.

\- ఆకాశ్ బాగ్లేకర్, న్యాయవాది, వినియోగదారుల చట్టాల పుస్తక రచయిత



పెట్టిన ఖర్చుకు సరైన సేవలు పొందడం మన హక్కు

నష్టమొస్తే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి పరిహారం పొందే వీలు

లాయర్ల ఖర్చు లేదు.. కేసు మనమే వాదించుకునే చాన్స్

పిటిషన్ల పరిష్కారం కోసం నగరంలోనే 3 కమిషన్లు

కానీ వినియోగదారుల చట్టంపై సిటీజనుల్లో అవగాహన అంతంతే..



నీ రైట్ కోసం ఫైట్!

సాక్షి, హైదరాబాద్

→ దుర్గాభాయ్ దేశముఖ్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి బేగంపేట్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షాపులో రూ.66 వేలు వెచ్చించి ఓ టీవీ కొనుగోలు చేశారు. కొన్ని రోజులకే టీవీ పనిచేయడం మానేసింది. కస్టమర్ కేర్‌ను సంప్రదించి మరమ్మతులు చేయించినా లాభం లేకపోయింది. దీంతో ఆ వ్యక్తి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పరిశీలించిన కమిషన్.. రూ.66 వేలు రీఫండ్ చేయాలని, అదనంగా రూ.13 వేలు పరిహారం, రూ.5 వేలు కేసు ఖర్చుల కింద వినియోగదారుడికి ఇవ్వాలని ఆదేశించింది. మరో రూ.5 వేలు కన్స్యూమర్ లీగల్ ఎయిడ్ ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది.

→ అధిక బరువుతో బాధపడుతున్న ఓ వ్యక్తి బరువు తగ్గించే చికిత్స కోసం ఒక ప్రముఖ హెల్త్‌కేర్ సంస్థను సంప్రదించారు. ఈ మేరకు చికిత్స అందిస్తామని హామీ ఇచ్చిన సంస్థ.. రూ.1,30,000 ఫీజును ఈఎంఐ రూపంలో వసూలు చేసింది. కానీ ఆయన ఎంతకీ బరువు తగ్గకపోగా ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడింది. దీంతో తాను చెల్లించిన మొత్తం రీఫండ్ చేయాలని సంస్థను కోరారు. కానీ సంస్థ స్పందించకపోవడంతో.. వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారించిన కమిషన్ రూ.1,30,000 సొమ్మును 12 శాతం వడ్డీతో కలిపి రీఫండ్ చేయాలని.. కేసు ఖర్చుల కింద మరో రూ.5 వేలు చెల్లించాలని సంస్థను ఆదేశించింది.

..వస్తువులు, సేవల్లో లోపాల వల్ల ప్రజలు నష్టపోయిన మొత్తాన్ని తిరిగి పొందేందుకు వినియోగదారుల కమిషన్లు తీసుకున్న చర్యలు ఇవి. కానీ మనలో చాలా మందికి సరైన అవగాహన లేక, నష్టపోయినా భరించి ఊరుకుండిపోతున్నారు.

చట్టం ఎంత బలంగా ఉన్నా.. అమల్లో నిర్లక్ష్యం ఉంటే ఫలితం శూన్యం. ఎవరికోసమైతే ఆ చట్టం చేశామో.. అదొకటి ఉందని వారికి తెలియక పోతే నిష్ప్రయోజనం. అలాంటివే వినియోగదారుల చట్టాలు. గ్రామీణులకే కాదు నగరాల్లో ఉండే వారికి కూడా వాటిపై అవగాహన అంతంతే. ఐటీ రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్‌లోనూ వినియోగదారుల హక్కులేమిటో తెలియని వారు కోకొల్లలు. ప్రభుత్వం కూడా వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించడంపై ఫోకస్ పెట్టని పరిస్థితి. ఏదో తూతూ మంత్రంగా అప్పుడప్పుడు ఏవో కార్యక్రమాలు



నిర్వహించడం మినహా పెద్దగా చేస్తున్నదేదీ లేదు. నిజానికి వినియోగదారులు కాని ప్రజలంటూ ఎవరూ ఉండరు. అందుకే అందరూ ఈ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని.. సేవలను హక్కుగా పొందాలని నిపుణులు సూచిస్తున్నారు.

2020లో మార్పులు చేశాక..

1986 నుంచి ఉన్న వినియోగదారుల చట్టంలో మార్పులు చేర్పులు చేసి వినియోగదారుల రక్షణ చట్టం -2019ను రూపొందించారు. అది 2020 జూలై 20వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. వినియోగదారుల ఫిర్యాదులను మరింత వేగంగా పరిష్కరించడానికి ఇది దోహదం చేస్తోంది. ఈ చట్టం ద్వారా సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ)ని స్థాపించారు. దీనిద్వారా వినియోగదారుల హక్కులను ప్రోత్సహిస్తూ, పరిరక్షిస్తున్నారు. అలాగే వినియోగదారుల ఫోరంను వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మార్చారు.


వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు ఎలా చేయాలి..

→ వస్తువు లేదా సేవ కోసం చేసిన ఖర్చు విలువ రూ.50 లక్షల వరకు అయితే.. జిల్లా కమిషన్‌లో ఫిర్యాదు చేయాలి. రూ.2 కోట్ల వరకు అయితే రాష్ట్ర కమిషన్‌లో, అంతకుమించితే జాతీయ కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేయాలి.

→ రాష్ట్ర కమిషన్‌తో పాటు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్లు హైదరాబాద్‌లో ఉన్నాయి.

→ ఆన్‌లైన్ ద్వారా లేదా కమిషన్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు.

→ దేశవ్యాప్తంగా టోల్ ఫ్రీ నంబర్ 18004250033కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చు.



సమస్య వస్తే ఎవరిని సంప్రదించాలి.. వినియోగదారుల కమిషన్ల వివరాలు, ఫోన్ నంబర్లు IIలో

అన్నీ తామై..

'ఆ నలుగురు' నుంచి అంత్యక్రియల వరకు సేవలు

ఆదాయమార్గంగా కార్పొరేట్ కర్మకాండ

ఆన్‌లైన్‌లో సంప్రదిస్తే చాలు.. 'ఆ నలుగురు' మొదలు అన్నీ తామై అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు.. సంప్రదాయాలు, బడ్జెట్ చెబితే చాలు.. శ్మశానవాటికలు, సామగ్రి, రవాణా వరకు అన్ని ఏర్పాటు చేస్తారు.. గూగుల్ సెర్చ్‌కి వెళ్లి క్రిమేషన్ సర్వీసెస్ అని సెర్చ్ చేస్తే చాలు... నగరంలో ఏఏ ప్రాంతాల్లో అటువంటి సర్వీసులు అందుబాటులో ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది.. - 10లో



టేస్ట్ బ్లాగుంది



హాబీగా ఫుడ్ బ్లాగింగ్

చెప్పకోదగ్గ సంఖ్యలో సభ్యులు

నగరంలో ఫుల్ టైమ్ ట్రెండ్

వివరాలు 11లో

విదేశాల్లో.. రయ్.. రయ్

ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్‌లకు ఏటేటా పెరుగుతున్న డిమాండ్

ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్(ఐడీపీ)లకు ఏటేటా డిమాండ్ పెరుగుతోంది. ఉన్నత చదువులు..ఉద్యోగాలు..టూరిస్ట్ వీసాలపై విదేశాలకు వెళ్లేవారు ఐడీపీ కోసం ఆర్టీఏ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ దేశాలకు వెళ్లిన నగరవాసుల్లో ఈ ఏడాది 42,471 మంది ఐడీపీ తీసుకున్నారు.

- సాక్షి, హైదరాబాద్



అమెరికాకే ఎక్కువగా..

ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం ఏటా లక్షలాది మంది తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికాకు వెళుతున్నారు. వారే పెద్దసంఖ్యలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ తీసుకుంటున్నారు. అమెరికాతోపాటు అన్ని దేశాల్లోనూ మన డ్రైవింగ్ లైసెన్సులను అనుమతించడం వల్ల డిమాండ్ ఎక్కువగా ఉందని ఆర్టీఏ అధికారులు తెలిపారు. వివిధ ఆర్టీఏ కార్యాలయాల్లో నగరవాసులు తీసుకొనే ఐడీపీలో 60 % వరకు అమెరికాలో డ్రైవింగ్ కోసమే కావడం గమనార్హం. హెచ్ 4 వీసాపై డిపెండెంట్‌గా వెళుతున్న మహిళలు అక్కడకు వెళ్లిన తర్వాత ఉద్యోగాన్వేషణలో భాగంగా డ్రైవింగ్ తప్పనిసరిగా భావిస్తున్నారు. అలా ఐడీపీలు తీసుకుంటున్న మహిళల సంఖ్య కూడా ఏటా పెరు గుతూనే ఉంది. 'హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ వస్తే చాలు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా పరుగులు తీయొచ్చు. అందుకే ఎక్కువ మంది ఐడీపీల కోసం వస్తారు.'అని ఆర్టీఏ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

ఆయా దేశాల్లో ఇలా...



అమెరికా తర్వాత మలేసియా, జర్మనీ, ఆస్ట్రేలియా, బ్రిటన్, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా, స్వీడన్, సింగపూర్, హాంకాంగ్, స్పెయిన్, ఫ్రాన్స్, ఫిన్‌లాండ్, ఇటలీ, మారిషస్, ఐర్లాండ్ తదితర దేశాల్లో ఇండియన్ ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్‌లను అనుమతిస్తున్నారు.

→ అమెరికాతోపాటు కొన్ని దేశాల్లో ఏడాదిపాటు అనుమతిస్తుండగా, యూరోప్ దేశాల్లో 6 నెలల వరకు మాత్రమే అనుమతి ఉంది.

→ ఐడీపీపై మలేసియాలో బండి నడపాలంటే ఆ దేశ అధికార భాష మలేలోకి ఐడీపీ వివరాలు నమోదు చేసుకోవాలి. భారత రాయబార కార్యాలయం నుంచి ఈ సదుపాయం లభిస్తుంది.


→ ఫ్రాన్స్‌లోనూ ఐడీపీని ఫ్రెంచిలోకి తర్జుమా చేసుకోవడం తప్పనిసరి.

→ ఆస్ట్రేలియాలో మూడు నెలల వరకే అనుమతి ఉంటుంది.

→ కెనడాలో మూడు నెలల్లోపు అక్కడి నిబంధనల మేరకు లైసెన్సు తీసుకోవాలి.

ఐడీపీ ఈజీనే...

→ అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ తీసుకోవడం ఎంతో తేలిక. నగరంలోని ఖైరతాబాద్, సికింద్రాబాద్, ఉప్పల్, మెహదీపట్నం, మణికొండ, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, మలక్‌పేట్, కూకట్‌పల్లి, బండ్లగూడ, తదితర ఆర్టీఏ కార్యాలయాల నుంచి ఐడీపీ తీసుకోవచ్చు. పాస్‌పోర్టు, వీసాతో పాటు, పర్మనెంట్ లైసెన్సు డాక్యుమెంట్‌లను అందజేసి రూ.1500 ఫీజు చెల్లించాలి. సాధారణంగా అన్ని రకాల ఆర్టీఏ సేవలు ఆన్‌లైన్‌లో లభిస్తుండగా, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ మాత్రం అధికారులు నేరుగా దరఖాస్తుదారులకే అందజేస్తారు.



స్పెయిన్‌లో డ్రైవింగ్ చేశా..



విదేశాలకు ఎక్కువగా వెళతాను. అక్కడికి వెళ్లిన తర్వాత బంధువులు, స్నేహితుల వాహనాలు అందుబాటులో ఉంటాయి. కానీ డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం వల్ల ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి. దీంతో హైదరాబాద్ నుంచి ఐడీపీతో వెళితే ఆ ఇబ్బంది ఉండదు. స్పెయిన్‌లో మూడు నెలలు ఐడీపీతోనే డ్రైవింగ్ చేశాను.

– సుబ్బారెడ్డి, టూరిస్టు

థాయ్‌లాండ్‌లో రైట్ డ్రైవింగే



డాక్యుమెంటరీల షూటింగ్‌కు తరచుగా విదేశాలకు వెళతా. ఇటీవల థాయ్‌లాండ్‌లో ఓ డాక్యుమెంటరీ షూటింగ్ సందర్భంగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్‌తో వెళ్లాను. అక్కడ మన ఇండియాలోలాగే రైట్ డ్రైవింగ్. ఏ ఇబ్బంది లేకుండా హాయిగా కారులో అన్ని చోట్లకు వెళ్లాను.

– మిద్దె బాలరాజు, ఆర్టిస్ట్

జర్మనీలో నిబంధనలు కఠినం..



జర్మనీలో మన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్‌లపై బండి నడపడం చాలా కష్టం. మన డ్రైవింగ్ లైసెన్సను వారు పరిగణనలోకి తీసుకోలేదు. స్టూడెంట్‌గా వెళ్లాను. ఇప్పుడు ఉద్యోగం చేస్తూ జర్మనీలోనే ఉంటున్నారు. మొదట్లో హైదరాబాద్ నుంచి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ తీసుకొని వెళ్లగా, 6 నెలలు మాత్రమే అనుమతించారు. ఉద్యోగరీత్యా అక్కడే ఉండాల్సి రావడంతో అక్కడి నిబంధనల మేరకు మొదట లెర్నింగ్, ఆ తర్వాత పర్మనెంట్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నా. జర్మనీలో నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి.

– తన్యా కొండ

వినియోగదారుల కమిషన్ల వివరాలివీ..

జాతీయ వినియోగదారుల కమిషన్..

ఉపభోక్తా న్యాయభవన్
ఎఫ్ బ్లాక్, జీపీవో కాంప్లెక్స్
ఐఎన్ఏ, న్యూఢిల్లీ–110023
ఈ–మెయిల్: ఎన్‌సీడీఆర్‌సీ ఎట్‌దిరేట్ ఎన్ఐసీ డాట్ ఇన్
ఫోన్ నంబర్: 011–24608724

- ఇందులో అధ్యక్షుడితోపాటు 11 మంది సభ్యులు ఉంటారు. నేరుగా వేసే పిటిషన్లతోపాటు అప్పీళ్లను కూడా ఎన్‌సీడీఆర్‌సీ విచారణ చేస్తుంది. వినియోగదారుల రక్షణ చట్టం–2019లో పేర్కొన్న నిబంధనల ప్రకారం జాతీయ కమిషన్ పనిచేస్తుంది.

తెలంగాణ రాష్ట్ర కమిషన్..

ఏరువాక బిల్డింగ్, శ్రీధర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా..,
ఆనంద్‌నగర్, ఖైరతాబాద్, హైదరాబాద్
ఈ–మెయిల్: ఎస్‌సీడీఆర్‌సీ–టీఎస్ ఎట్‌దిరేట్ ఎన్ఐసీ డాట్ ఇన్
మీనా రామనాథన్, ఇన్‌చార్జి అధ్యక్షురాలు,
ఫోన్: (040) 23394399
కె.రంగారావు, సభ్యుడు, ఫోన్: (040) 23394399
వీవీ శేషుబాబు (జ్యుడీషియల్) సభ్యుడు..
ఆర్ఎస్ రాజశ్రీ, సభ్యురాలు..
వీవీ వెంకటరమణమూర్తి, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఫోన్: 23394399

→ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఎస్‌సీడీఆర్‌సీ ఏర్పాటైంది. 2015లో తొలి అధ్యక్షుడిగా జస్టిస్ బీఎన్.రావు నియమితులయ్యారు. 2018 వరకు పనిచేశారు. తర్వాత జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్ నియమితులయ్యారు.

→ రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాకు ఒక జిల్లా కమిషన్ ఉండగా.. హైదరాబాద్ జిల్లాలో మాత్రం మూడు కమిషన్లు ఉన్నాయి.

→ జిల్లా వినియోగదారుల కమిషన్లలో నేరుగా వినియోగదారుడే వాదనలు వినిపించుకోవచ్చు లేదా న్యాయవాదిని నియమించుకోవచ్చు.

→ న్యాయస్థానాలే అయినా వినియోగదారులు స్థానిక భాషలో వాదనలు వినిపించుకునే అవకాశం ఉంది.

→ జిల్లా కమిషన్‌కు రాష్ట్ర కమిషన్, రాష్ట్ర కమిషన్‌కు జాతీయ కమిషన్ అప్పీలేట్‌గా వ్యవహరిస్తాయి. జాతీయ కమిషన్ తీర్పులను సుప్రీంకోర్టులో మాత్రమే సవాల్ చేయవచ్చు. ఇతర ఏ కోర్టులూ ఈ తీర్పుల్లో జోక్యం చేసుకోలేవు.



హైదరాబాద్ జిల్లా కమిషన్లు..
జిల్లా వినియోగదారుల కమిషన్–1, 2, 3
చంద్రవిహార్ కాంప్లెక్స్, ఎంజే రోడ్, నాంపల్లి, హైదరాబాద్
ఫోన్ నంబర్లు: 040-24733368, 040-24747733, 040-24746001

రంగారెడ్డి జిల్లా కమిషన్..
రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్
ఎన్‌టీఆర్ నగర్, ఎల్‌బీనగర్, రంగారెడ్డి
ఫోన్: 040-24031275

రెండేళ్లలోపు కేసు వేయాలి..

→ వినియోగదారుల కమిషన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొందరికి అవగాహన ఉన్నా.. కమిషన్‌ను ఎలా సంప్రదించాలో తెలియదు. కాజ్ ఆఫ్ యాక్షన్ (సమస్య ఎదురైనప్పటి) నుంచి రెండేళ్లలోపు కేసు దాఖలు చేయాలి. తర్వాత పెడితే కేసు చెల్లదు. ఏవైనా బలమైన కారణాలుంటే సెక్షన్ 24ఏ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు. కొందరు అనవసర కేసులు వేస్తూ విలువైన కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారు. దీంతో నిజంగా లబ్ధిపొందాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

– మీనా రామనాథన్, రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు

మధ్యంతర ఉత్తర్వులిస్తాం..

→ రాష్ట్ర కమిషన్‌కు ఎక్కువగా అప్పీల్ కేసులు వస్తున్నాయి. దీంతో పరిష్కారంలో కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో కమిషన్‌కు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అధికారం ఉంటుంది. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఓ బిల్డర్ వద్ద ప్లాట్ కొనుగోలు చేశారు. బిల్డర్ ఆ ప్లాట్‌ను రిజిస్టర్ చేయకుండా మరొకరికి అమ్ముతున్నప్పుడు కమిషన్‌ను సంప్రదిస్తే.. ఆ లావాదేవీని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఉంటుంది.

– పి.భాస్కర్, కోర్టు ఆఫీసర్, రాష్ట్ర కమిషన్

చదువుకున్నా అవగాహన తక్కువే..



→ డిగ్రీ చదివినా కూడా నాకు వినియోగదారుల కమిషన్‌ను ఎలా ఆశ్రయించాలో తెలియదు. ఎక్కడా ఎలాంటి అవగాహన కార్యక్రమం చేపట్టగా చూడలేదు. కోర్టులు తెలుసుగానీ, వినియోగదారుల కమిషన్‌లో ఎన్నడూ ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వం ఇలాంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.

– ఉపేందర్‌రెడ్డి, ఉప్పల్, హైదరాబాద్

సాక్షి

సత్యమేవ జయతే

గురువారం 20-6-2024

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 89

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్‌ నిర్మించాలి'



దక్షిణాఫ్రికా విజయం

టి20 ప్రపంచ కప్‌లో 18 పరుగుల తేడాతో అమెరికాపై గెలుపు -14లో



లాభాల స్వీకరణ


నాలుగో రోజూ సెన్సెక్స్‌ ఆల్‌టైమ్‌ హై.. నష్టాలతో ముగిసిన నిఫ్టీ -15లో



రూ.100 కోట్లు డిమాండ్‌

మద్యం స్కాంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ సౌత్‌ గ్రూప్‌ నుంచి 100 కోట్లు డిమాండ్‌ చేశారని రౌస్‌ అవెన్యూ కోర్టుకు ఈడీ తెలిపింది.

వివరాలు 6లో ▸



వైజ్ఞానిక కేంద్రంగా భారత్‌

ప్రపంచంలోనే అతిముఖ్యమైన వైజ్ఞానిక కేంద్రంగా భారత్‌ ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



ఇద్దరు తీవ్రవాదులు హతం

బారాముల్లా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి.

వివరాలు 6లో ▸



బలమైన మైత్రీబంధం

రష్యా, ఉ. కొరియా మైత్రీబంధంతో మరింత దగ్గరయ్యాయి. శత్రుదేశం దాడిచేస్తే తోటి దేశం సాయపడేలా ఒప్పందం చేసుకున్నాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్‌

యూజీసీ-నెట్‌ రద్దు



నీట్‌ పరీక్షలో బయల్పడిన అవకతవకల నీలినీడలు యూజీసీ-నెట్‌ పరీక్షపైనా పడ్డాయి. దీంతో మంగళవారం నిర్వహించిన యూజీసీ-నెట్‌ పరీక్షను రద్దుచేస్తూ కేంద్ర విద్యా శాఖ అనూహ్య నిర్ణయం తీసుకుంది. నీట్‌ను నిర్వహించిన నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీయే ఈ నెట్‌ పరీక్షనూ చేపట్టింది.

- వివరాలు 6లో▶

భద్రాద్రిలో ఇక బ్రేక్‌ దర్శనం



దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కొత్తగా బ్రేక్‌ దర్శనాలను అమలు చేయాలని నిర్ణయించారు. జూలై 2 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. బ్రేక్‌ దర్శనం టికెట్‌ ధరను రూ. 200గా నిర్ణయించారు.

- వివరాలు 5లో▶

ఎస్సై భవాని సేన్‌పై వేటు



ప్రజలకు భద్రత కల్పించాల్సిన ఓ పోలీసు అధికారి తన కిందిస్థాయి సిబ్బందిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకోగా.. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఎస్సై భవానిసేన్‌ను సర్వీస్‌ నుంచి తొలగించాలని ఆదేశించారు.

- వివరాలు 16లో▶


గ్రేస్‌ మార్కులపై ఎన్‌ఎంసీ నిర్ణయం సబబే



ఎంబీబీఎస్‌ గ్రేస్‌ మార్కులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నేషనల్‌ మెడికల్‌ కౌన్సిల్‌ (ఎన్‌ఎంసీ)కి హైకోర్టు సూచించింది. గ్రేస్‌ మార్కులను తొలగిస్తూ 2023 ఆగస్టులో ఎన్‌ఎంసీ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది.

- వివరాలు 3లో▶

ఇదంజుగుత్‌



ముందు ఆ బిళ్ల తీసి ముఖం చూపించి ఏం కావాలో చెప్పవయ్యా!

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీలో భారీగా బయటపడిన ఇసుక మేటలు



మేడిగడ్డలో సిరుల మేట!

బ్యారేజీ నుంచి నీటిని వదిలేయడంతో భారీగా బయటపడిన ఇసుక

- 1.92 కోట్ల మెట్రిక్‌ టన్నుల మేర నిల్వ ఉన్నట్లు అంచనా
- ఇసుకను విక్రయించి ఆదాయం సమకూర్చుకునేందుకు సర్కారు ప్రణాళికలు
- వేలంతో ఖజానాకు రూ.800 కోట్ల మేర ఆదాయం వచ్చే చాన్స్‌
- ప్రస్తుతానికి 14 బ్లాకుల్లో రూ.380 కోట్ల విలువైన ఇసుకే వెలికితీత
- తవ్వకాలు, స్టాక్‌ యార్డుకు చేరవేసే బాధ్యత కాంట్రాక్టర్లకు..
- ఈ నెల 25 వరకు టెండర్ల స్వీకరణ.. షెడ్యూల్‌ విడుదల చేసిన టీజీఎండీసీ
- అన్నారం, సుందిళ్లలోని ఇసుక నిల్వలపై డీఎల్‌ఎస్‌సీల దృష్టి

సాక్షి, హైదరాబాద్‌: రాజకీయ విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు కేంద్ర బిందువుగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టులోని 'మేడిగడ్డ బ్యారేజీ' రాష్ట్ర ఖజానాకు భారీగా కాసుల వర్షం కురిపించబోతోంది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన నేపథ్యంలో నీటిని దిగువకు వదలడంతో ప్రాజెక్టు ఎగువ భాగాన భారీగా ఇసుక మేటలు బయట పడ్డాయి. దీంతో వీటిని తవ్వి ఇసుకను విక్రయించడం ద్వారా భారీఎత్తున ఆదాయాన్ని రాబట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. మేడిగడ్డలో బయటపడిన ఇసుక నిల్వల ద్వారా ఖజానాకు రూ.800 కోట్ల మేర ఆదాయం లభించే అవకాశమున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తొలిదశలో రూ.380 కోట్ల మేర ఆదాయం సమకూర్చుకునేలా 14 బ్లాక్‌లను వేలం వేసే బాధ్యతను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ)కు అప్పగించారు. ఈ మేరకు ఇప్పటికే టెండర్ల షెడ్యూల్‌ను ప్రకటించిన టీజీఎండీసీ జూలై మొదటి వారంలో వేలం ప్రక్రియను పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే మరిన్ని బ్లాక్‌ల నుంచి ఇసుకను వెలికి తీయాలని భావిస్తోంది. మరోవైపు మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన ఉన్న సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లోనూ

మిగతా 2వ పేజీలో ▶



వరికి మరో రూ. 117

కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం



- సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,300
- 'ఎ' గ్రేడ్‌ రకానికి రూ.2,320
- పత్తికి మరో రూ.501 పెంపు
- 2024–25 ఖరీఫ్‌ మార్కెటింగ్‌ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర పెంపు

న్యూఢిల్లీ



అశ్వనీ వైష్ణవ్‌

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్‌ బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. వరి ధాన్యానికి కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను 5.35 శాతం పెంచింది. అంటే క్వింటాల్‌కు రూ.117 చొప్పున పెరగనుంది. 2024–25 ఖరీఫ్‌ మార్కెటింగ్‌ సీజన్‌లో క్వింటాల్‌ వరి ధాన్యాన్ని రూ.2,300కు కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుతం దేశంలో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ ధాన్యానికి మద్దతు ధర పెంచడం గమనార్హం. త్వరలో జరగనున్న హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ పెంచినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ మీడియాకు వివరించారు. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్‌(సీఏసీపీ) సిఫార్సుల మేరకు 14 ఖరీఫ్‌ పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు కేబినెట్‌ ఆమోదముద్ర వేసినట్లు తెలిపారు. ఎంఎస్పీని సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,300కు, 'ఎ' గ్రేడ్‌ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320కు పెంచినట్లు వెల్లడించారు. కనీస మద్దతు ధర అనేది ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు అధికంగా ఉండాలని 2018 కేంద్ర బడ్జెట్‌లో తీసుకున్న విధానపరమైన నిర్ణయాన్ని ప్రభుత్వం ఆమోదించినట్లు చెప్పారు. ఇదే సూత్రాన్ని ఇప్పుడు అమలు చేసినట్లు పేర్కొన్నారు. పంటల ఉత్పత్తి వ్యయాన్ని సీఏసీపీ శాస్త్రీయంగా మదింపు చేసిందన్నారు.

కేంద్ర కేబినెట్‌ నిర్ణయాలు

- మహారాష్ట్రలోని వధవాన్‌లో రూ.76,200 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్‌ డీప్‌ డ్రాఫ్ట్‌ మేజర్‌ పోర్టు అభివృద్ధి. ఈ ఓడరేవును ప్రపంచంలోని

మిగతా 5వ పేజీలో ▶

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రశ్నే లేదు

ఆ సంస్థపై కేంద్రం పెత్తనం ఏమీ లేదు, ఉండదు


'సాక్షి' ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

- బొగ్గు బ్లాకుల వేలంలో కేసీఆర్‌ ప్రభుత్వం పాల్గొనకపోవడం వల్ల నష్టం జరిగింది
- పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కేంద్రానిదే..
- ప్రస్తుతానికి విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ ప్రైవేటీకరణ ఉండదు
- ఫోన్‌ ట్యాపింగ్‌ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలి
- పోలీసులు చేసిన తప్పును పోలీసులే విచారిస్తే ఎలా?
- కాళేశ్వరంపై సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపించాలన్న కేంద్ర మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రశ్నే లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. సింగరేణిలో 51 శాతం వాటా ఉన్న రాష్ట్ర ప్రభుత్వానిదే పెత్తనం ఉంటుందని.. కేంద్ర ప్రభుత్వ పెత్తనమేదీ ఉండదని తెలిపారు. ఏపీలోని పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఉండదని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. బుధవారం కిషన్‌రెడ్డి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచన, ప్రతిపాదన ఏదీ లేదు. అది ఎన్నికల వేళ మాజీ సీఎం

మిగతా 2వ పేజీలో ▶



జీవనాడిపై దాడి..!

పోలవరం ఉసురు తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

- ఇదంతా కమీషన్ల దాహం, అస్తవ్యస్త పనుల పాప ఫలితం కాదా?
- ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కిన చంద్రబాబు
- సంక్లిష్టంగా మారిన పోలవరాన్ని గాడిలో పెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. వరదలు, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్‌వే, స్పిల్‌ చానల్, ఎగువ, దిగువ కాఫర్‌ డ్యామ్‌లు పూర్తి
- టీడీపీ హయాంలో తట్టెడు మట్టినా ఎత్తని జలవిద్యుత్కేంద్రం పనులను కొలిక్కి తెచ్చిన జగన్‌ సర్కార్‌

12లో



కమాన్‌ వద్ద కరీంనగర్‌ నేలను ముద్దాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌

ఈ పదవి కార్యకర్తల భిక్షే

- లాఠీదెబ్బలు, కేసులు, జైళ్లతోనే నాకీ గుర్తింపు
- కార్పొరేటర్‌ నుంచి కేంద్ర మంత్రి దాకా ఎదగడం బీజేపీలోనే సాధ్యం
- నేటి 'సెల్యూట్‌ తెలంగాణ' కార్యక్రమానికి తరలిరండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌

- వివరాలు 3లో

తగ్గేదే లే!

టీచర్ల బదిలీలు, పదోన్నతులపై ముందుకే...

- ఆపేయాలని న్యాయస్థానం చెప్పలేదు
- ముందే న్యాయ సలహాలు తీసుకున్నాం
- ప్రభుత్వానికి పాఠశాల విద్య కమిషనర్‌ నివేదిక
- నేటి నుంచి మల్టీజోన్‌-2లో కసరత్తు

సాక్షి, హైదరాబాద్‌: ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల విషయంలో ఏ మాత్రం వెనక్కు తగ్గకూడదని విద్యాశాఖ తీర్మానించుకుంది. న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో పాఠశాల విద్య కమిషనర్‌ దేవసేన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పదోన్నతులు, బదిలీలు చేపట్టకపోవడంతో విద్యాశాఖ నిస్తేజంగా ఉందని ఆమె అనేక సందర్భాల్లో

మిగతా 2వ పేజీలో ▶

వ్యవసాయానికి రూ.1.34 లక్షల కోట్లు

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం

- 2024–25 రాష్ట్ర స్థాయి రుణ ప్రణాళిక ఖరారు
- మొత్తం రూ.6.33 లక్షల కోట్ల రుణాలు
- ప్రాధాన్య రంగాలకు అడ్వాన్సులు రూ.2,80,550 కోట్లు.. రుణ ప్రణాళిక ఆవిష్కరించిన భట్టి విక్రమార్క, తుమ్మల
- బ్యాంకర్లకు మానవీయ కోణం ఉండాలన్న డిప్యూటీ సీఎం

సాక్షి, హైదరాబాద్‌: ఈ ఏడాది వ్యవసాయ రంగానికి రూ.1.34 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) నిర్ణయించింది. 2024–25 రాష్ట్ర స్థాయి రుణ ప్రణాళికను రూ.6.33 లక్షల కోట్లుగా ఖరారు చేసింది. ఇది గత ఏడాది కంటే 161 శాతం అధికం కావడం గమనార్హం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం ఈ రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో భట్టి మాట్లాడారు. బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం

మిగతా 5వ పేజీలో ▶



రుణ ప్రణాళిక విడుదల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

క్లుప్తంగా...

గుడిసెవాసులకు న్యాయం చేస్తా

సీపీఐ నేతలకు సీఎం హామీ



సీఎం రేవంత్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, సీపీఐ నేతలు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పరిధిలోని రావి నారాయణరెడ్డి కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న వారికి న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు గుడిసె వాసులకు న్యాయం చేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డిని సచివాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు కలిశారు. ఈ సందర్భంగా సీఎం సానుకూలంగా స్పందించారని సీపీఐ నేతలు వెల్లడించారు. ఏడాదిన్నరగా నిరుపేద ప్రజలు అక్కడ జీవిస్తున్నారని సీఎంకు సీపీఐ నేతలు తెలిపారు. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఐజీఎన్సీఏతో ఆద్యకళ ఎంవోయూ

ఆదివాసీ జానపద చిత్రాలు, పటాల పునరుజ్జీవానికి ఒప్పందం



మీడియాకు ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న సచ్చిదానంద జోషి, జయధీర్ తిరుమలరావు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్సీఏ)తో తెలంగాణ 5 కళాఖండాల మ్యూజియాల సంస్థ ఆద్యకళ ఎంవోయూ కుదుర్చుకుంది. కళా రంగాల చరిత్ర, కళల పరిరక్షణ, చిత్రకళకు సంబంధించిన ఆదివాసీ జానపద చిత్రాలు, పటాలను బాగుపరిచి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో ఐజీఎన్సీఏ తరపున ఆ సంస్థ సభ్య కార్యదర్శి డాక్టర్ సచ్చిదానంద జోషి, ఆద్యకళ, ఆదిధ్వని ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ ఆచార్య జయధీర్ తిరుమలరావు పాల్గొన్నారు. కళల అధ్యయనం, పరిరక్షణలో భాగంగా నిపుణులను హైదరాబాద్‌కు పంపి చిత్రపటాల పునరుజ్జీవ కార్యక్రమం చేపడతామని జోషి తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో జనజాతి దర్పణ్ పేరుతో ఆద్యకళ సేకరించిన 170 కళాఖండాలు సందర్శకుల మన్ననలు పొందుతున్నాయని జయధీర్ తిరుమలరావు పేర్కొన్నారు. గిరిజన, జానపద, గ్రామీణ కళలకు చేయూతనిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

కేంద్రమంత్రి జయంత్ చౌదరితో మంత్రి పొన్నం భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరితో తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. బుధవారం ఉదయం కేంద్రమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయినట్లు మంత్రి పొన్నం మీడియాకు తెలిపారు. దేశంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కాగా, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసిన పొన్నం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


కేసీఆర్ పథకాల ఎత్తివేతే లక్ష్యం: కొప్పుల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ ముద్ర లేకుండా చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఎత్తివేసే పనిలో ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పార్టీ నేత బొమ్మెర రామ్మూర్తితో కలిసి కొప్పుల ఈశ్వర్ విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే టీఎస్ స్థానంలో టీజీ తేవడంతో పాటు రాష్ట్ర చిహ్నాలను మార్చే ప్రయత్నాల్లో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నో లెర్నింగ్.. నో అప్‌డేట్

నైపుణ్యాల మెరుగునకు సిద్ధంగా లేని 90 శాతం మంది భారత వృత్తి నిపుణులు

ఆయా కంపెనీల యాజమాన్యాలు సానుకూలంగా ఉన్నా ఉద్యోగులు ససేమిరా	2030 నాటికల్లా ప్రస్తుత జాబ్‌ల స్వరూపం 64 శాతం మేర మారిపోయే చాన్స్	ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సంస్థ 'లింక్డ్ ఇన్' తాజా నివేదికలో వివిధ అంశాలు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: చేసే పనిలో అప్‌డేట్ కావాలంటే...తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. కొత్త విషయాలను నిరంతరం నేర్చుకోవాలి. కానీ తొంభైశాతం మంది భారత వృత్తి నిపుణులు అందుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావడం లేదు. కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత కమిట్‌మెంట్లు, బిజీ వర్క్‌షెడ్యూళ్లు తదితర కారణాలతో వెనుకడుగు వేస్తున్నట్టు స్పష్టమైంది. తాము పనిచేస్తున్న సంస్థలు, కంపెనీల యాజమాన్యాలు వివిధ రూపాల్లో నైపుణ్యాలు పెంచేందుకు సానుకూల దృక్పథంతోనే ఉన్నా, దీనికి సంబంధించి తమ ప్రాధాన్యతలను నిర్ధారించుకోవడంలో దేశంలోని దాదాపు 80 శాతందాకా వృత్తి నిపుణులు విఫలమవుతున్నారు. కుటుంబ బాధ్యతలు, ఇతర రూపాల్లోని ప్రతిబంధకాలు అధిగమించి కొత్తవి నేర్చుకునే విషయంలో అత్యధికుల అనాసక్తి కనబరుస్తున్నారు. 2030 సంవత్సరం నాటికల్లా ప్రపంచస్థాయిలోనే కాకుండా భారత్‌లోనూ ప్రస్తుతమున్న ఉద్యోగాలు, బాధ్యతలు, విధుల స్వరూపం 64 శాతం మేర మారిపోయే అవకాశాలున్నాయని నిపుణులు, కంపెనీవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వృత్తి నిపుణులు, ఉద్యోగులు తమ నైపుణ్యాలను తప్పనిసరిగా పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త విషయాలు నేర్చుకోవడం, చేసే పని పద్ధతులు, విధానాల్లో మార్పులపై అధిక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. తాజాగా నెట్‌వర్కింగ్ సంస్థ 'లింక్డ్ ఇన్' విడుదల చేసిన నివేదికలో వివిధ అంశాలు వెల్లడయ్యాయి.

వెనుకబాటుకు కారణాలు.. వృత్తి నిపుణులు కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలు పెంచుకోవడంలో వెనుకబాటుకు పలు కారణాలు నివేదికలో పొందుపరిచారు.

34 శాతం మంది – కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగతంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు	29 శాతం మంది – చేస్తున్న పనిలో బిజీ వర్క్ షెడ్యూల్	26 శాతం మంది – నేర్చుకునేందుకు వనరులు, విధానాలు లెక్కకు మించి ఉండడంతో ఏదీ తేల్చుకోలేకపోవడం

ఈ పరిస్థితిని అధిగమించాలంటే 'లౌడ్ లెర్నింగ్'

- పని ప్రదేశాల్లో లేదా ఆఫీసుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో అక్కడే మౌఖికంగా లేదా ఇతర కొత్త విషయాలను అర్థమయ్యేలా చేయగలిగితే అధిక ప్రయోజనం ఉంటుందన్నారు.
- తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు ఈ విధానం తమకు ఉపయోగపడుతుందని 81 శాతం మంది చెప్పారు.
- ఈ విధానంలో నిమగ్నమై కొత్త విషయాలను నేర్చుకుంటున్నవారు 64 శాతం ఉన్నట్టుగా నివేదిక చెబుతోంది.
- 'లౌడ్ లెర్నింగ్'లో భాగంగా తమ టీమ్ సభ్యుల నుంచి మెళకువలు నేర్చుకోవచ్చునని 40 శాతం మంది చెప్పగా, 35 శాతంమంది తాము నేర్చుకునే విషయాలకు సంబంధించి టీమ్ సభ్యులకు వివరించడం ద్వారా అంటున్నారు.
- అనుభవజ్ఞులైన వృత్తినిపుణుల గైడెన్స్‌లో నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా 28 శాతం మంది తమ కెరీర్‌లో ముందుకెళ్లేందుకు దోహదపడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.
- నైపుణ్యాల మెరుగుదలతో కొత్త వృత్తుల్లో అవకాశాలు లభిస్తాయని 27 శాతం మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.
- తమతో పనిచేస్తున్న వృత్తినిపుణులు, ఉద్యోగుల అనుభవసారం, ఆయా అంశాలపై వారికున్న విషయ దృష్టిని గ్రహించడం ద్వారా ప్రయోజనం చేకూరుతోందంటున్న 26 శాతం మంది చెప్పారు.

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రశ్నే లేదు

▶ మొదటి పేజీ తరువాయి

మదిలో పుట్టిన విష ప్రచారం. సింగరేణిలో 51 శాతం వాటా ఉన్న రాష్ట్ర ప్రభుత్వానిదే పెత్తనం ఉంటుంది. 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వానిది ఏమీ ఉండదు. దేశంలో 12 ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) ఉన్నాయి. దేనినైనా ప్రైవేట్ పరం చేశామా? అలాంటిది సింగరేణిని ఎలా చేస్తాం? ఎలాంటి పక్షపాతం వహించకుండా నిబంధనల ప్రకారం వ్యవహరించాలని ప్రధాని మోదీ సూచించారు. ఆ మేరకే నడుచుకుంటాం. సింగరేణిలో జరిగే అవినీతిని బోర్డు మీటింగుల్లో లేవనెత్తుతాం. దేశంలో బొగ్గు మాఫియా చాలా పెద్దది. ప్రధాని మోదీ వచ్చాక మాఫియా ఆగడాలు, అవినీతి తగ్గాయి.

అక్కడ ఉక్కు ఫ్యాక్టరీ సాధ్యం కాదు

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఫీజిబులిటీ కాదు. అక్కడ లభించే ఇనుప ఖనిజంలో పరిశ్రమలకు సరిపడే నాణ్యత లేదు. ఫీజిబులిటీ లేకే ప్రాగా టూల్స్, ఐడీపీఎల్, ఆల్విన్, హెచ్ఎంటీ బేరింగ్స్ వంటి పబ్లిక్ సెక్టార్ కంపెనీలు మూతపడ్డాయి. తెలిసి కూడా మరో ఫ్యాక్టరీ ఎలా పెడతాం? ఇది కోపంతోనో, రాజకీయ ప్రయోజనాల కోసమో తీసుకున్న నిర్ణయం కాదు. కానీ కేంద్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయడం లేదంటూ అప్పటి సీఎం కేసీఆర్ ఆరోపించారు. బయ్యారంలో దొరికే ఖనిజాన్ని ఇంకే అవసరాలకు ఉపయోగించుకోవచ్చనే దానిపై అధికారులతో చర్చిస్తా.

గనుల వేలంలో పాల్గొనక రాష్ట్రానికి నష్టం

గనులు జాతీయ సంపద. అవి ప్రజలకే చెందాలన్న సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా పార్లమెంటులో చట్టం చేశారు. ఈ క్రమంలో గనుల వేలం పారదర్శకంగా జరుగుతోంది. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం వేలంలో పాల్గొనలేదు. దాంతో రాష్ట్ర ఖజానాకు చాలా నష్టం జరిగింది. అది ఎంతనే వివరాలు త్వరలో వెల్లడిస్తాం.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

కొందరు రాష్ట్ర పోలీసులు తప్పు చేశారు. జడ్జీలు, పారిశ్రామికవేత్తలు, ఇతరుల వ్యక్తిగత వ్యవహారాలు కూడా తెలుసుకుని బ్లాక్ మెయిల్ చేశారు. వారి మీద రాష్ట్ర పోలీసులే విచారణ చేస్తే ఎలా? న్యాయం జరగదు. సీబీఐ లేదా హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరిపించాలి. ఇలాంటి అంశాలపై సమాజంలోని వ్యక్తులు పిటిషన్లు వేయాలి. పార్టీపరంగా మేం వేయం. నయీం ఆస్తులు ఎక్కడెక్కడున్నాయి? ఏమున్నాయి? చట్టపరంగా ఎంత వసూలు చేశారనేది కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టాలి. ఇక మేడిగడ్డ, విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. ఈ రెండు అంశాలపై హైకోర్టు పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరపాలి. కాళేశ్వరంపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్ వెంటనే జరగదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అలాంటిదేమీ జరగదు. ఈ విషయం ఇంకా పెండింగ్‌లోనే ఉందని, రాద్ధాంతం చేయవద్దని గతంలోనే చెప్పాను. వైజాగ్ స్టీల్ ప్లాంట్ అభ్యర్థన మేరకు మరో రూ.3 వేల కోట్లు ఆర్థిక సాయం అందిస్తున్నాం. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ ఇవ్వాలన్న డిమాండ్‌పై ఇంకా అధికారికంగా రివ్యూ చేయలేదు. దీనిపై అధికారులతో చర్చిస్తా. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కూడా వేలంలో పాల్గొని బొగ్గు గనులు కొనుక్కోవచ్చు. పోలవరం మాది. అంటే కేంద్రానిది. దానిని పూర్తి చేసే బాధ్యత మేమే తీసుకుంటాం.

అధ్యక్ష పదవిపై పార్టీ నిర్ణయిస్తుంది

బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎవరనేది పార్టీ నిర్ణయం. మంత్రి పదవి కంటే పార్టీ అధ్యక్ష పదవికే ఎక్కువ ప్రాధాన్యం. మంత్రివర్గంలో ఉన్న వారికి పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వకూడదని రూల్ ఏమీ లేదు. యోగ్యత ఉన్నవారు ఎవరైనా మంత్రివర్గంలో ఉంటే.. రాజీనామా చేయించి పార్టీ అధ్యక్ష పదవి ఇస్తారు. శివరాజ్ సింగ్‌కు ఇవ్వాలనుకుంటే రాజీనామా చేయిస్తారు. అందులో ఇష్యూ ఏమీ లేదు. ఇక రాష్ట్ర అధ్యక్ష పదవి కూడా తాత్కాలికంగానే ఇచ్చారు. చాలా రాష్ట్రాల్లో కేంద్ర మంత్రులు రాష్ట్ర పార్టీ అధ్యక్షులయ్యారు. జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న వేళ నేను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నాను. ఆర్టికల్ 370 రద్దుకు ముందు అక్కడి పరిస్థితులపై పనిచేశా. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారని అనుకుంటున్నా.

జేపీ నడ్డాతో కిషన్‌రెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాను కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కిషన్‌రెడ్డి తొలిసారి నడ్డాతో భేటీ అయ్యారు. మోదీ కేబినెట్‌లో కేంద్రమంత్రిగా అవకాశం పొందిన నడ్డాను కిషన్‌రెడ్డి సన్మానించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో తెలంగాణ బీజేపీ కొత్త సారథి ఎంపికతోపాటు.. తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చ జరిగినట్లు తెలిసింది. అనంతరం కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మేడిగడ్డలో సిరులమేట!


▶ మొదటి పేజీ తరువాయి

ఇసుక లభ్యతపై ఇప్పటికే జిల్లా స్థాయి ఇసుక కమిటీలు (డీఎల్ఎస్‌సీ) ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇసుక వెలికితీతకు ఇతరత్రా ఎలాంటి ఆటంకాలు లేకుంటే రికార్డు స్థాయిలో ఆదాయం వస్తుందని టీజీఎండీసీ లెక్కలు వేస్తోంది.

వెలికితీతకు 18–24 నెలల గడువు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ వద్ద సుమారు రూ.800 కోట్ల విలువైన సుమారు 1.92 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక మేట వేసినట్లు డీఎల్ఎస్‌సీ గుర్తించింది. అయితే ప్రస్తుతానికి రూ.380 కోట్ల విలువైన 92.77 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక వెలికితీత సాధ్యమవుతుందనే నిర్ణయానికి వచ్చారు. ఇసుక వెలికితీత, స్టాక్ యార్డుకు చేరవేసే బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించనున్నారు. 'ఇ ప్రొక్యూర్‌మెంట్ టెండర్' ద్వారా టీజీఎండీసీ కాంట్రాక్టర్లను ఎంపిక చేయనుంది. ఈ నెల 25 వరకు టెండర్లు స్వీకరించి, వచ్చే నెల 3న తెరిచేలా సంస్థ ఇప్పటికే టెండర్ షెడ్యూల్‌ను ప్రకటించింది. మహదేవ్‌పూర్ మండలంలోని 14 బ్లాక్‌ల నుంచి ఇసుకను వెలికితీస్తారు. బెగ్లూరు, ఎల్కేశ్వరం, బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లి, మహదేవపూర్ పరిధిలో ఈ బ్లాక్‌లు ఉన్నాయి. గోదావరి నదికి ఎగువ నుంచి వచ్చే వరద, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇసుక వెలికితీతకు 18 నుంచి 24 నెలల గడువును టీజీఎండీసీ నిర్దేశించింది.

అన్నారం, సుందిళ్ల ఇసుకతో రూ.500 కోట్ల ఆదాయం!



మేడిగడ్డ బ్యారేజీ ఎగువ భాగంలోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఉన్న ఇసుక మేటల పరిమాణాన్ని గుర్తించడంపై డీఎల్ఎస్‌సీలు దృష్టి సారించాయి. సంబంధిత జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో డీఎల్ఎస్‌సీ సభ్యులుగా ఉన్న రెవెన్యూ, పంచాయతీ, భూగర్భ జలవనరుల శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, భూగర్భ వనరుల విభాగాలకు చెందిన అధికారులు ఇప్పటికే ఈ బ్యారేజీలను సందర్శించినట్లు సమాచారం. రెండు బ్యారేజీల్లోని ఇసుకతో మరో రూ.500 కోట్ల ఆదాయం లభించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. డీఎల్ఎస్‌సీల నుంచి నివేదికలు అందిన తర్వాత వీటికి సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తామని టీజీఎండీసీ వర్గాలు వెల్లడించాయి.


'గనులు ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర'



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల్లా వ్యవహరిస్తూ తెలంగాణ గనులు ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు పథకం వేశారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఖనిజాల వేలానికి సంబంధించి గడువు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కిషన్‌రెడ్డి లేఖ రాశారని, సింగరేణి సంస్థ ప్రైవేటీకరణ విషయంలోనూ తమకు అనేక అనుమానాలున్నాయని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఏకమై సింగరేణి గనులను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు పన్నాయని విమర్శించారు. ఈ నెల 21న దేశవ్యాప్తంగా జరిగే 52 బొగ్గు గనుల వేలంలో సింగరేణి బ్లాకులు కూడా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీకి సున్నపురాయి గనులు, బయ్యారం స్టీల్ ప్లాంటుకు ఇనుప ఖనిజం కేటాయించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాయాలని కోరారు. మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయకుండా విలువైన సమయాన్ని వృథా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పార్టీ నేతల జేబులు నింపేందుకే అక్కడ నుంచి 92లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తరలింపునకు టెండర్లు పిలిచిందని తెలిపారు.

రేపు 60 బొగ్గు బ్లాకుల వేలం

- హైదరాబాద్‌లో ప్రారంభించనున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- హాజరుకానున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన కోసమంటూ..

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల్లోని 60 బొగ్గు బ్లాకుల కోసం 10వ రౌండ్ కమర్షియల్ బొగ్గు గనుల వేలాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. తెలంగాణలోని ఒక బొగ్గు గని, ఒడిశాలోని 16, ఛత్తీస్‌గఢ్ 15, మధ్యప్రదేశ్ 15, జార్ఖండ్ 6, పశ్చిమబెంగాల్ 3, బిహార్‌లోని 3, మహారాష్ట్రలోని ఒక బొగ్గు గనికి కేంద్ర ప్రభుత్వం వేలం నిర్వహించనుంది. ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బొగ్గు శాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా తదితరులు పాల్గొంటారు.

బొగ్గు గనుల వేలానికి సంబంధించి కేంద్ర బొగ్గు శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ''ఈ వేలంలో 60 బొగ్గు బ్లాక్‌లను వేలం వేయనున్నారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ఉన్న ఈ బ్లాక్‌లు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు దోహదం చేస్తాయి. 10వ రౌండ్‌లో మొత్తం 60 బొగ్గు గనులు ఉండగా.. అందులో 24 గనుల్లో పూర్తిగా, మిగతా 36 గనుల్లో పాక్షికంగా అన్వేషణ జరిగింది. వేలంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగం వారికి సమాన అవకాశం ఉంటుంది. సొంత వినియోగం, విక్రయం సహా వివిధ ప్రయోజనాల ను పొందవచ్చు. ఎలాంటి పరిమితులు ఉండవు..''అని పేర్కొంది. సులభతర వాణిజ్యం కోసం, బొగ్గు గనుల సత్వర నిర్వహణకు వీలుగా వివిధ అనుమతులు పొందేందుకు సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్ పోర్టల్‌ను రూపొందించినట్టు తెలిపింది.

రుణమాఫీకి 'పీఎం కిసాన్' రూల్స్!

రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.. మాఫీ విధివిధానాలపై చర్చ.. ఖరారు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గం సమావేశమై వ్యవసాయ రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలు, మార్గదర్శకాలపై చర్చించి ఖరారు చేయనుంది. రుణమాఫీకి అర్హులను గుర్తించడానికి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం విధివిధానాలనే వర్తింపజేయాలా? లేక ఇతర పద్ధతులను అనుసరించాలా? అనే అంశంపై రాష్ట్రమంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోనుంది. పీఎం కిసాన్ పథకం కింద కేంద్రప్రభుత్వం దేశంలో అర్హులైన రైతులందరికీ ఏటా రూ.6 వేలు ఆర్థికసాయం అందిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, అధిక ఆదాయం ఉండి ఐటీ పన్ను చెల్లించేవారిని ఈ పథకం నుంచి మినహాయించింది. ఉన్నత ఆదాయం పొందే సంతానం ఉన్నా ఈ పథకం కింద అనర్హులే. రాష్ట్రంలో రుణమాఫీ అమలుకు సైతం ఇలాంటి మార్గదర్శకాలనే అమలు చేయాలనే భావనలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ సహాయం పొందడానికి అర్హులైన రైతులెవరూ నష్టపోకుండా మార్గదర్శకాలను మంత్రివర్గం ఖరారు చేస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 15 లోగా రుణమాఫీ అమలు చేస్తామని ఇప్పటికే సీఎం హామీ ఇచ్చారు. రుణమాఫీకి అర్హులైన రైతులు ఎవరు ? ప్రభుత్వ సహాయం అవసరమున్న రైతులను ఏ ప్రాతిపదికన గుర్తించి రుణమాఫీ వర్తింపజేయాలి ? ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీకి అమలు చేసిన మార్గదర్శకాలు ఏమిటి? వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. రుణమాఫీకి కటాఫ్ తేదీతోపాటు ఈ పథకం అమలుకు అవసరమైన నిధుల సమీకరణపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనుంది. మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా రుణమాఫీపైనే చర్చ జరుగుతుందని, ఎజెండాలో ఇతర అంశాలు లేవని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన మంత్రి కోమటిరెడ్డి
- వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి



బుధవారం గాంధీభవన్ వద్ద రక్తదానం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో భట్టి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గాంధీభవన్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు బుధవారం రాహుల్ జన్మదినం సందర్భంగా సంబురాలు నిర్వహించాయి. గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రారంభించగా, మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డితో పాటు కార్యకర్తలు రక్తదానం చేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి నేతృత్వంలో కేక్ కట్ చేశారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూడా గాంధీభవన్‌లో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. టీపీసీసీ ఫిషర్‌మెన్ సెల్ చైర్మన్ సాయికుమార్ నేతృత్వంలో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. భారతదేశానికి భవిష్యత్తు రాహుల్‌గాంధీ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

వైద్య రంగంలో ప్రక్షాళనకు శ్రీకారం

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: వైద్య రంగంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో ప్రైవేట్ వైద్య కళాశాలల యాజమాన్యాలు, డీన్‌లు, ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైద్య విద్యలో తెలంగాణకు అత్యుత్తమ కేంద్రంగా గుర్తింపు తేవడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య విద్య కళాశాలలతోపాటు డెంటల్ కాలేజీలలో మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు వైద్య, డెంటల్ కళాశాలల యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రైవేట్ కళాశాలల్లో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల దగ్గర అదనపు ఫీజులు వసూలు చేయరాదని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా, వాటిల్లో 3,690 ఎంబీబీఎస్ సీట్లున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఎయిమ్స్‌లో 100, ఈఎస్ఐలో 125 ఎంబీబీఎస్ సీట్లున్నాయన్నారు. ఇక ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 1,320 పీజీ సీట్లున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ పీజీ మెడికల్ సీట్లు 179 ఉన్నాయన్నారు. ప్రైవేట్ రంగంలోని 28 మెడికల్ కళాశాలల్లో 4,600 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయన్నారు. సమావేశంలో వైద్య విద్య సంచాలకురాలు (డీఎంఈ) డాక్టర్ వాణి, వైద్య విద్య స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ విమల థామస్ పాల్గొన్నారు.

నేడు 96 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు

జూన్ 20న నులిపురుగుల నివారణ దినం సందర్భంగా 96 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామని దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ రోజు వేయించుకోని వారికి 27న మాప్ అప్ రౌండ్‌లో వేస్తామని చెప్పారు.

తగ్గేదేలే!

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయ సంఘాల వద్ద అభిప్రాయపడ్డారు. తాజాగా హైకోర్టు డివిజన్ బెంచ్ వద్ద ఈ కేసు విచారణకు రాగా, బదిలీలు, పదోన్నతులపై న్యాయస్థానం అధికారుల తీరును ప్రశ్నించింది. దీంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడుతుందని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ మొదలైంది. కోర్టు పరిణామాల తర్వాత పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉన్నతాధికారులను కలుస్తున్నారు. దీనిపై పాఠశాల విద్య కమిషనర్ ఓపికగా వారిలో మనోధైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు హైకోర్టు అభ్యంతరాలపై అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు తెలిసింది. ఇప్పటికే మల్టీజోన్–1 పరిధిలో ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు పూర్తయ్యాయి. మల్టీజోన్–2 పరిధిలో ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అనేక మంది టీచర్లు బదిలీలు, పదోన్నతులు పొందారు. ప్రక్రియను నిలిపివేస్తే ఈ విద్యా సంవత్సరంలో బోధన సాగడం కష్టమని అధికారులు సీఎంకు పంపిన నివేదికలో పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తోంది.

అంతా పకడ్బందీగానే..

టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల పేరెత్తితే తరచూ కోర్టు వివాదాలు వెంటాడుతుంటాయి. 2023లోనూ విద్యాశాఖ ఇలాంటి అనుభవాలే చూసింది. స్పౌజ్‌లు, పండిట్లు, పీఈటీలు, సీనియారిటీ వ్యవహారం అనేక చిక్కుముడులు వెంటాడాయి. దీంతో గత ఏడాది షెడ్యూల్ ఇచ్చినా ముందుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో విద్యాశాఖపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. టెట్ అర్హత ఉన్న టీచర్లకు మాత్రమే పదోన్నతి కల్పించాలన్న కేంద్ర నిబంధనలపై గత ఏడాది కొంతమంది కోర్టుకెళ్లారు. దీంతో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. ఈసారి ఇలాంటి చిక్కులు తలెత్తకుండా అధికారులు ముందే న్యాయ సలహాలు తీసుకున్నారు. ఏయే అంశాలపై ఇబ్బందులు వచ్చే వీలుందని, వాటిని ఎలా ఎదుర్కొనాలనే విషయాలపై దేవసేన కసరత్తు చేశారు. అయినప్పటికీ టెట్ అర్హతపై సింగిల్ జడ్జి తీర్పు, డివిజన్ బెంచ్‌కు వెళ్లడం, అక్కడ పాఠశాల విద్య కమిషనర్ సమాధానం చెప్పాల్సి రావడంతో ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన నెలకొంది. అయితే, డివిజన్ బెంచ్ ఇప్పటివరకూ ప్రక్రియను నిలిపివేయాలని ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదని అంటున్నారు. దీంతో అనుకున్న ప్రకారం ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

నేటి నుంచి మల్టీజోన్–2లో...

మల్టీజోన్–1 పరిధిలో 10వేల మంది టీచర్లకు పదోన్నతులు దక్కాయి. ఎస్‌జీటీలు, పీఈటీలు, భాషా పండితులు దాదాపు 10 వేల మంది బదిలీ అయ్యారు. కొన్నిచోట్ల ఎస్‌జీటీల బదిలీ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. వీటిని కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం నుంచి మల్టీజోన్–2 పరిధిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్‌తో కలుపుకొని మొత్తం 14 జిల్లాలు మల్టీజోన్–2 పరిధిలో ఉన్నాయి. ముందు స్కూల్ అసిస్టెంట్లకు బదిలీలు చేపట్టాక, ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పిస్తారు. ఆ తర్వాత వీళ్లను బదిలీ చేస్తారు. ఈ జోన్ పరిధిలో 10 వేల మంది ప్రమోషన్లు పొందుతారు. ఇదేస్థాయిలో బదిలీలు కూడా జరుగుతాయి. అయితే, రంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రక్రియపై కోర్టు వివాదం ఉండటంతో ప్రక్రియ ఆగిపోయింది. కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో బదిలీలు, పదోన్నతులపై టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఏపీ సచివాలయంలో పెండ్యాల ప్రత్యక్షం

మళ్లీ తెరపైకి చంద్రబాబు మాజీ పీఎస్



సాక్షి, అమరావతి: గతంలో టీడీపీ ప్రభుత్వంలో 'స్కిల్'కుంభకోణంలో కీలక పాత్ర పోషించి, సీఐడీ నోటీసులివ్వడంతో విదేశాలకు పరారైన పెండ్యాల శ్రీనివాస్ మళ్లీ తెరపైకి వచ్చారు. వందల కోట్ల నిధులను దారి మళ్లించిన ఈ 'స్కిల్'కుంభకోణం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ నిధుల తరలింపులో పెండ్యాల శ్రీనివాస్ కీలక సూత్రధారి అని సీఐడీ తేల్చింది. దీంతో ఆయన అమెరికాకు వెళ్లిపోయారు. ప్రణాళిక శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న ఆయన వెంటనే విధులకు హాజరుకావాలని జారీ చేసిన మెమోను కూడా బేఖాతరు చేయంతో ఉన్నతాధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ సీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో శ్రీనివాస్ అమెరికాలో అజ్ఞాతవాసాన్ని ముగించుకుని సచివాలయంలో ప్రత్యక్షమయ్యారు. తనపై సస్పెన్షన్ ఎత్తివేసి, పోస్టింగ్ ఇవ్వాలని అధికారులను కోరారు. స్కిల్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే నాడు అమెరికాకు పరారైన పెండ్యాల శ్రీనివాస్.. ఇప్పుడూ చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే తెరపైకి రావడం ఈ కుంభకోణంలో తదుపరి పరిణామాలకు సూచికగా నిలుస్తోంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2024లో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఒక ప్రకటనలో తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తమ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు 3,081 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించింది. అందులో 2,819 మంది క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్స్ ద్వారా, 262 మంది డిస్టన్స్, డిజిటల్ కోర్సుల ద్వారా ఫలితాలు సాధించినట్లు తెలిపింది. అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరైన ప్రతి ముగ్గురు ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల్లో ఒకరు ఉత్తీర్ణత సాధించారంది. టాప్-100 మంది విద్యార్థుల్లో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వారు 9 మంది అని, టాప్-500లో 46 మంది అని, టాప్-1000లో 89 మంది ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులేనని పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన రిషి శుక్లా 300ల మార్కులకు గాను 300 స్కోరు సాధించి తెలంగాణ టాపర్‌గా సత్తాచాటాడని తెలిపింది. కృష్ణ సాయి శిశిర్ 67వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించింది.

ఎన్ఎస్ఎస్-ఎస్పీయూఎన్ డిబేట్ విన్నర్‌గా శ్రీచైతన్య

సాక్షి, హైదరాబాద్: నేషనల్ స్పేస్ సొసైటీ-యూఎస్ఏ నిర్వహించిన ఎస్పీయూఎన్ డిబేట్స్-24లో శ్రీచైతన్య స్కూల్ విజేతగా నిలిచిందని ఆ స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అంతరిక్షంలో మానవ ఆవాసాల స్థాపనకు కృషి చేస్తున్న అమెరికా వారి స్పేస్ సొసైటీ ఎస్పీయూఎన్ డిబేట్స్-24 స్పేస్ పాలసీ, యూనివర్సలైజేషన్ అనే విషయంపై ఈ పోటీలను నిర్వహించింది. ఈ డిబేట్‌లో 9 దేశాల నుంచి 100 మంది విద్యార్థులు పోటీపడగా, గెలుపొందిన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు శ్రీచైతన్య విద్యార్థి అని సీమ తెలిపారు. ఈ డిబేట్‌లో శ్రీచైతన్య స్కూల్ విజేతగా నిలవడం ఇది నాలుగోసారి. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను, టీచింగ్ స్టాఫ్‌ను స్కూల్ డైరెక్టర్ సీమ అభినందించారు.

మూసివేత దిశగా రామగుండం
బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం?

నిలిచిన విద్యుత్ ఉత్పత్తి... పునరుద్ధరణకు అనాసక్తి
- డిప్యుటేషన్ పేరిట 48 మంది ఇంజనీర్ల బదిలీ
- ఒకవైపు నిర్వహణ భారం... మరోవైపు ముగిసిన కేంద్రం జీవితకాలం


రామగుండం: నిర్వహణ భారం..జీవితకాలం ముగియడంతో పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 62.5 మెగావాట్ల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. వారంరోజులు క్రితం 38 మంది ఇంజనీర్లు, ఐదుగురు సబ్ ఇంజనీర్లు, ఒకరు సీనియర్ కెమిస్ట్, నలుగురు కెమిస్ట్‌లను యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)కు డిప్యుటేషన్ పేరిట బదిలీ చేశారు. దీంతో మూసివేత తప్పదనే ప్రచారం జరుగుతోంది.

యూనిట్ ట్రిప్ అయినా...

ఈ నెల 4వ తేదీన యూనిట్‌లోని మిల్స్ విభాగంలో సాంకేతిక సమస్యతో తలెత్తింది. దీంతో యూనిట్ ట్రిప్ అయ్యి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. విద్యుత్ సౌధ నుంచి అనుమతులు రాకపోవడంతో పునరుద్ధరణ చేపట్టలేదు. పదిరోజులుగా ఖాళీగా ఉంటున్న ఇంజనీర్లు, ఉద్యోగులను యాదాద్రి, భద్రాద్రి, కేటీపీఎస్ తదితర జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

1965లో ప్లాంట్ ప్రారంభం

- అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న రామగుండంలో 62.5 మెగావాట్ల సామర్థ్యంగల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభించారు. కరెంట్ ఉత్పత్తితోపాటు పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధిస్తూ రికార్డులు నమోదు చేసింది. అయితే విద్యుత్ కేంద్రం స్థాపించి ఆరు దశాబ్దాలు కావడంతో నిర్వహణ భారంగా మారింది.



కాలం చెల్లిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

- బాయిలర్, టర్బయిన్, మిల్స్, ట్రాన్స్‌ఫార్మర్ తదితర విభాగాల్లో ఏడాదిగా తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది.
- ఈ జనవరి నుంచి సమస్య మరింత జటిలమైంది. కాలం చెల్లిన విద్యుత్ కేంద్రం కావడంతో విడిభాగాల లభ్యత లేదు. పాతవాటితోనే సర్దుబాటు చేసి విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకొస్తున్నారు.
- సాంకేతిక సమస్యలతో మళ్లీమళ్లీ ట్రిప్పవుతూనే ఉంది. దీంతో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణకు రూ.25 లక్షలకుపైగా వ్యయం అవుతోంది. ఆదాయం కన్నా వ్యయమే అధికంగా ఉండడంతో మూసివేతే పరిష్కారమని భావిస్తున్నట్టు సమాచారం.
- వాస్తవానికి థర్మల్ విద్యుత్ కేంద్రాల జీవితకాలం 25 ఏళ్లే. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ జీవితకాలం ఎప్పుడో ముగిసిపోయింది.

కొత్త ప్లాంటు ఏర్పాటు తప్పనిసరి



రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం సమీపంలోనే 800 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త విద్యుత్ కేంద్రం స్థాపిస్తాం. అప్పటివరకు పాత విద్యుత్ కేంద్రాన్ని కొనసాగించాలని ఎనర్జీ సెక్రటరీ రిజ్వీ, డైరెక్టర్లను కలిసి విన్నవించా. అత్యధిక సంఖ్యలో ఇంజనీర్లు ఉండడంతో కొందరిని యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తున్నారు.
- మక్కాన్‌సింగ్ ఠాకూర్, రామగుండం, ఎమ్మెల్యే

రాష్ట్రానికి 'భద్రాద్రి' గుదిబండే!

- భారీగా పెరిగిన భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ కేంద్రాల అంచనా వ్యయం
- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట వేణుగోపాల్‌రావు, తిమ్మారెడ్డి వాదనలు



వాదనల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రావు, తిమ్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం గుదిబండగా మారిందని విద్యుత్ రంగ నిపుణుడు ఎం.వేణుగోపాల్‌రావు, తిమ్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి వెళ్లకుండా నామినేషన్ల ప్రాతిపదికన బీహెచ్ఈఎల్‌కు పనులు అప్పగించడం, కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించడమే దీనికి కారణమన్నారు. రూ.7,900 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించగా, వాస్తవ వ్యయం రూ.10 వేల కోట్లు దాటిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో తీసుకున్న విద్యుత్ రంగ నిర్ణయాల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ముందు బుధవారం హాజరై తమ పిటిషన్లకు మద్దతుగా వాదనలు వినిపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భద్రాద్రి విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తికాక ముందే రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభమైందని, విద్యుత్ కొరత తీర్చడంలో ఈ విద్యుత్ కేంద్రం పాత్ర ఎంతమాత్రం లేదన్నారు. విద్యుత్ కొరతను అధిగమించే సాకుతో టెండర్లు లేకుండా ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు చేసుకున్న ఒప్పందం రాష్ట్రానికి శిరోభారంగా మారిందని తెలిపారు. 2017లో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ రాష్ట్రానికి వచ్చేనాటికే భూపాలపల్లిలో 800 మెగావాట్ల కేటీపీపీ, జైపూర్ (మంచిర్యాల జిల్లా)లో 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ ప్లాంట్‌తోపాటు జూరాలలో జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అందుబాటులోకి వచ్చిందని తిమ్మారెడ్డి కమిషన్‌కు వివరించారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ రాకున్నా విద్యుత్ లైన్ల కోసం రూ.630 కోట్లను చెల్లించారని తప్పుబట్టారు. యూనిట్‌కు రూ.3.90 ధరతో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ వస్తుందని ఒప్పందం చేసుకోగా, వాస్తవ ధర రూ.5.40కు పెరిగిందన్నారు. ఆ సమయంలో దేశంలో రూ.4.20కే కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా విద్యుత్ లభించిందని ఆధారాలను కమిషన్‌కు అందజేశారు.

మూడేళ్ల తర్వాతే ఛత్తీస్‌గఢ్ విద్యుత్ వచ్చింది..

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం 2014లో జరిగితే మూడేళ్ల తర్వాత 2017-18 నుంచి సరఫరా ప్రారంభమైందని, 1000 మెగావాట్లకు గాను 75 శాతమే వచ్చిందని వేణుగోపాల్‌రావు అన్నారు. విద్యుత్ బిల్లుల వివాదంతో 2022 ఏప్రిల్ నుంచి ఛత్తీస్‌గఢ్ విద్యుత్ పూర్తిగా ఆగిపోయిందని చెప్పారు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్‌కు రూ.10-20 వరకు అధిక ధరతో రాష్ట్రం విద్యుత్ కొనాల్సి వచ్చిందన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రానికి విద్యుత్ సరఫరా అయ్యేందుకు 1000 మెగావాట్ల పవర్ గ్రిడ్ లైన్లను బుక్ చేసుకోగా, పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోయినా రూ.650 కోట్లు చెల్లించాల్సి వచ్చిందన్నారు. మరో 1000 మెగావాట్ల కారిడార్‌ను బుక్ చేసుకొని రద్దు చేసుకోవడంతో రూ.261 కోట్లను పరిహారంగా చెల్లించాలని ఎలక్ట్రిసిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో పవర్‌గ్రిడ్ దావా వేసిందని పేర్కొన్నారు. ఒప్పందం మేరకు రావాల్సిన విద్యుత్ రాకున్నా ఛత్తీస్‌గఢ్‌కు రూ.3వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు.

గ్రేస్ మార్కులపై ఎన్ఎంసీ నిర్ణయం సబబే

పిటిషనర్లపై నిర్ణయాధికారం కౌన్సిల్‌దేనన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ గ్రేస్ మార్కులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ)కి హైకోర్టు సూచించింది. గ్రేస్ మార్కులను తొలగిస్తూ 2023 ఆగస్టులో ఎన్ఎంసీ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. గ్రేస్‌మార్కులు పొందడం పిటిషనర్ల హక్కు కాదని స్పష్టం చేసింది. మార్కులు కలపాలంటూ తాము ఆదేశాలివ్వలేమని తేల్చి చెప్పింది. ఎంబీబీఎస్ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి..ఒక సబ్జెక్టులో తక్కువ మార్కులొస్తే 5 గ్రేస్ మార్కులు ఇచ్చేవారు. అలా కొందరు రెండో సంవత్సరంలోకి వెళ్లేవారు. అయితే 2023, ఆగస్టులో ఈ గ్రేస్ మార్కులను తొలగిస్తూ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్‌పై మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్స్-1997 నిబంధనలను ఎన్ఎంసీ సవరించింది. ఎన్ఎంసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఎంబీబీఎస్ విద్యార్థి ఆర్య బచుతో పాటు మరో ఐదుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పరీక్షలు పాత నిబంధనల మేరకే జరిగాయని, మార్కుల జాబితాలోకూడా దాన్ని ప్రస్తావించారని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ ధర్మాసనానికి వాదనలు వినిపించారు. ఇక నిబంధనల మార్పు, పరీక్షలు ఒకేసారి రావడంతో విద్యార్థులు వాటిని తెలుసుకోలేకపోయారని అందువల్ల పాత నిబంధనల ప్రకారం పిటిషనర్లకు గ్రేస్ మార్కులు ఇవ్వాలని కూడా ప్రభాకర్ వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం...పాత నిబంధనల మేరకే పరీక్షలు జరిగాయన్న వాదన చెల్లదని పేర్కొంది. నిబంధనలు 2023, ఆగస్టులో వస్తే.. నవంబర్‌లో పరీక్షలు జరిగాయని వ్యాఖ్యానించింది. గ్రేస్ మార్కులను మంజూరు చేసే అంశంపై ప్రతివాదులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

'సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

సాక్షి, హైదరాబాద్: చాలీచాలని జీతాలతో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, కనీస టైం స్కేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దుండిగల్ యాదగిరి బుధవారం డిమాండ్ చేశారు. 19 వేల మందికి పైగా ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు రూ.10 వేల నుంచి రూ.30 వేల జీతానికి పని చేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత సైతం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన తప్ప.. మరో మార్గం లేదని యాదగిరి స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి పదవి కార్యకర్తల భిక్షే

- లాఠీదెబ్బలు, కేసులు, జైళ్లతోనే నాకీ గుర్తింపు
- కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రి దాకా ఎదగడం బీజేపీలోనే సాధ్యం: బండి సంజయ్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్ ప్రజలు, కార్యకర్తలు పెట్టిన భిక్షతోనే తనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి దక్కిందని బండి సంజయ్ అన్నారు. ''కార్యకర్తలారా..ఆనాడు నాతో కలిసి మీరు కేసీఆర్ మూర్ఖపు పాలనపై పోరాడితే లాఠీదెబ్బలు తిన్నరు.. కేసులు ఎదుర్కొన్నారు.. జైళ్లకు వెళ్లారు..రక్తం చిందించారు... ప్రజాసంగ్రామయాత్రలో నాతో కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ కష్టాలు లెక్క చేయకుండా 155 రోజులు 1600 కిలోమీటర్లకుపైగా నడిచారు. పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడ్డారు..అందుకే ఈరోజు నాకీ పదవి వచ్చింది..ఈ పదవి మీరు పెట్టిన భిక్షే.. ప్రజలు, కార్యకర్తలకే ఈ పదవిని అంకితమిస్తున్నా''అని సంజయ్ పేర్కొన్నారు. కేంద్రమంత్రి అయ్యాక బుధవారం తొలిసారి కరీంనగర్‌కు వచ్చిన బండి సంజయ్‌కు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కరీంనగర్‌లో సంజయ్ మీడియాతో మాట్లాడారు. కార్పొరేటర్ నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎదిగానంటే ఇది కేవలం బీజేపీవల్లే సాధ్యమైందని, మహాశక్తి అమ్మవారి ఆశీస్సులు అండగా ఉన్నాయన్నారు. నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తెలంగాణలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ కార్యకర్తలపై ప్రయోగించిన లాఠీదెబ్బలతోపాటు జైలుకు పంపడం ద్వారా నాకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. కేంద్ర మంత్రి పదవిని తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం కోసం ఉపయోగిస్తానని స్పష్టం చేశారు.



రాజన్నకు కోడె మొక్కు చెల్లిస్తున్న బండి సంజయ్

రాజన్నకు కోడె మొక్కు చెల్లింపు

వేములవాడ: 'ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి రాజన్న ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి నేనేంటో చూపిస్తా' అని బండి సంజయ్‌కుమార్ అన్నారు. దేవుడిని మోసం చేస్తే తగిన శాస్తి జరుగుతుందనడానికి కేసీఆర్ ప్రభుత్వమే నిదర్శనమన్నారు. బుధవారం రాత్రి వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు.కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రూ.400 కోట్లతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి దేవుడికే శఠగోపం పెట్టిన చరిత్ర కేసీఆర్ సర్కార్‌దేనని విమర్శించారు.

'సెల్యూట్ తెలంగాణ' పేరిట కేంద్ర మంత్రులు, ఎంపీలకు నేడు సన్మానం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతోపాటు పార్టీ ఎంపీలకు సన్మానం చేయనున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక కిషన్‌రెడ్డి తొలిసారిగా రాష్ట్రానికి వస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం 4 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి కేంద్ర మంత్రులు, ఎంపీలను ర్యాలీగా పార్టీ కార్యాలయం వరకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద 'సెల్యూట్ తెలంగాణ'పేరిట పార్టీ ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీని సత్కరిస్తారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున 8 మంది ఎంపీలను గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ సభను నిర్వహిస్తారు. తర్వాత చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించే 'మహా హారతి'కార్యక్రమంలో వీరంతా పాల్గొంటారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకం

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- వరుస హత్యలు, అత్యాచార ఘటనలే నిదర్శనం
- ఇంటర్ విద్యపై సర్కారు నిర్లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: గత పదేళ్లలో శాంతిభద్రతలకు చిరునామాగా నిలిచిన తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడంపై ఆయన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ.. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాయుత ఘటనలను ప్రస్తావించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి, మహిళా కానిస్టేబుల్‌పై అఘాయిత్యానికి పాల్పడటం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూపాలపల్లి జిల్లాలో ఈ ఘటనకు కారకుడైన ఎస్ఐపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో సంజీవ్ అనే వ్యక్తిని కర్రలతో కొట్టి చంపడం, హైదరాబాద్ బాలాపూర్‌లో సమీర్ అనే యువకుడి హత్య, పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం వంటి ఘటనలు రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుని శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

నేటికీ అందని పాఠ్య పుస్తకాలు

రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు ప్రారంభమై 19 రోజులు అవుతున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు అందించకపోవడం బాధ్యతారాహిత్యమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకునే ఈ ప్రభుత్వానికి విద్య మీద, విద్యార్థుల భవిష్యత్తుపై ఏమాత్రం పట్టింపు లేదన్నారు. 422 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 1.60 లక్షల మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలోని కొన్ని జూనియర్ కాలేజీల్లో జీరో అడ్మిషన్స్ నమోదవడంపై ప్రభుత్వం దృష్టి సారించి ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేయాలన్నారు. జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 1,654 మంది గెస్ట్ లెక్చరర్ల కాలపరిమితిని రెన్యువల్ చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో కొత్తగా ప్రకటించిన జూనియర్ కాలేజీల్లో పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

వ్యక్తిత్వం అనేది అభౌతికం. ఆత్మే నిజమైన మీరు.
మీ శరీరం మీరు కాదు. అది మీకు చెందుతుంది.
కానీ అదే మీరు కాదు.
– బ్రహ్మకుమారీలు

సాక్షి

గురువారం, 20 జూన్ 2024

చిత్తశుద్ధి కావాలి!

ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల బహిరంగంగా ఇచ్చిన సలహా వల్ల అయితేనేం, స్వీయజ్ఞానంతో అయితేనేం... మొత్తానికి మణిపూర్ భద్రతా వ్యవహారాలపై కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా చాలాకాలం తర్వాత ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిపారు. ఈశాన్య రాష్ట్రంలో ఇటీవల మళ్ళీ హింసాత్మక సంఘటనలు చెలరేగడంతో షా సారథ్యంలో సోమవారం జరిగిన ఈ భేటీ సహజంగానే ఆసక్తి రేపింది. భేటీ ముగిసిన అనంతరం కేంద్రం ఎప్పటిలానే తాము మణిపూర్ ప్రజల రక్షణ, భద్రతలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. రాష్ట్రంలోని మెయితీ, కుకీ వర్గాలు రెంటితోనూ చర్చలు జరిపి, జాతుల మధ్య వైమనస్యాలు తొలగించేందుకు సత్వరమే కృషి చేస్తామంటూ హోమ్‌మంత్రి పాతపాటే పాడారు. విపరీతంగా జాప్యమైనా, మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్య గురించి మళ్ళీ కనీసం ఆలోచన చేసినందుకు సంతోషించాలి. కానీ గంటకు పైగా సాగిన భేటీలో మణిపూర్ సీఎం బీరేన్‌సింగ్ కనిపించకపోవడమే విచిత్రం.

రాష్ట్రంలో అశాంతిని కట్టడి చేయడంలో తమ ప్రభుత్వం విఫలమైందని లోక్‌సభ ఎన్నికల తర్వాత సాక్షాత్తూ బీరేన్‌సింగే ఒప్పుకున్నారు. ఆలస్యంగానైనా వైఫల్యాన్ని అంగీకరించారు. తప్పొప్పుల బాధ్యత తలకెత్తుకున్నారు. మణిపూర్‌లో మెజారిటీ వర్గమైన మెయితీలకు షెడ్యూల్డ్ తెగల హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఈ సుదీర్ఘ ఘర్షణలకు దారి తీసింది. ఆ డిమాండ్‌కు నిరసనగా రాష్ట్రంలోని పర్వతప్రాంత జిల్లాల్లో గిరిజన సంఘీభావ యాత్ర చేపట్టేసరికి గడచిన 2023 మే 3న జాతుల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఇప్పటికీ చల్లారని ఈ చిచ్చుకు ఏడాది దాటిపోయింది. ఈ పదమూడు నెలల్లో 220 మందికి పైగా మరణించగా, 60 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. వేలాది చిన్నారులు చదువుకు దూరమయ్యారు. మయన్మార్ నుంచి 'అక్రమంగా' వలసవచ్చిన బయటి వారే ఘర్షణలకు బాధ్యులని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మొండిగా వాదిస్తూ వచ్చాయి. మణిపూర్‌లోని పర్వతప్రాంతాల్లో నివసించే కుకీ–జోలు, ఈ మయన్మార్ వలసదారులు ఒకే తెగ వారు గనక రాష్ట్రంలో ఘర్షణలకూ, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారానికీ వారే కారణమనేది సర్కారు వారి మాట. సమస్య మూలాల్లోకి వెళ్ళకుండా పక్షపాత ధోరణితో రాజకీయంగా వ్యవహరిస్తే, ఇలాగే ఉంటుంది.

అసలు 1990లలో ఈశాన్య రాష్ట్రాల్లోకెల్లా అత్యధిక తలసరి ఆదాయం ఘనత మణిపూర్‌దే. అలాంటి రాష్ట్రం ఇప్పుడు దేశంలోనే అత్యల్ప తలసరి ఆదాయమున్న మూడో రాష్ట్రంగా మారింది. విద్య, వైద్యం మొదలు ఉపాధి, ప్రాథమిక వసతి కల్పన దాకా అన్నింటా వెనకబడింది. ఈ పరిస్థితులు రాష్ట్రంలోని వివిధ జాతుల మధ్య ఉద్రిక్తతలు పెంచాయి. అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో అన్న ధోరణి వనరుల కేటాయింపు, పరిపాలనల్లో సాగుతోందంటూ ఆరోపణలు వచ్చాయి. క్రమంగా అది వర్గాల మధ్య విభేదాలు పెంచి, ఘర్షణల దాకా తీసుకొచ్చింది. అయితే ఇటీవలి దాకా అశాంతి, అస్థిరతలకు దూరంగా, విభిన్న వర్గాల సమ్మిశ్రిత ఆవాసమైన జీరీబామ్ లాంటి జిల్లాలకూ తాజాగా ఘర్షణలు పాకిపోవడం మరింత ఆందోళన రేపుతోంది. అసోమ్‌ను ఆనుకొని ఉండే జీరీబామ్ జిల్లాలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి అడ్వాన్స్ సెక్యూరిటీ కాన్వాయ్‌పైనే ఈ జూన్ 10న దాడులు జరగడం రాష్ట్రంలోని అరాచక పరిస్థితులకు అద్దం పడుతోంది. ఇటీవలి ఘర్షణలతో ఆ జిల్లా నుంచి వేలాది జనం అసోమ్‌కు పారిపోయారు. రాష్ట్రంలో ఇప్పటికి ఏడాదిగా కొన్ని వేలమంది తమ ఇళ్ళకు దూరంగా నిర్వాసితుల శిబిరాల్లోనో, బంధుమిత్రుల ఇళ్ళల్లోనో తలదాచుకొని, కాలం గడుపుతున్నారు. జీవనోపాధి మాత్రమే కాదు... చివరకు సాధారణ జీవితమే ప్రజలకు దూరమైంది.

రాష్ట్రం రావణకాష్ఠంగా మారినా ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. మాటలకే తప్ప చిత్తశుద్ధితో చేతలకు దిగలేదు. గత ఏడాది కాలంలో ప్రధాని మోదీ అనేక పర్యాయాలు ఈశాన్య రాష్ట్రాలను సందర్శించారు కానీ ఒక్కసారైనా మణిపూర్‌కు పోలేదు. మాటల్లోనైనా దాని ఊసెత్తలేదు. చివరకు ఆ మధ్య ఓ ఎన్నికల ప్రసంగంలో మణిపూర్ మాటెత్తినా, అక్కడ రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు, కేంద్రం జోక్యంతో పరిస్థితి మెరుగు పడిందన్నారు. వాస్తవానికి పరిస్థితి మరింత దిగజారిందనేది జగమెరిగిన సత్యం. మణిపూర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారశైలిని నిరసిస్తూ, మొన్నటి ఎన్నికల్లో రాష్ట్రంలోని రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇక, సీఎం సైతం మెయితీల వర్గానికి కొమ్ము కాస్తూ, తప్పంతా గిరిజన కుకీలదే అన్నట్టు వ్యవహరిస్తున్న తీరు ఆది నుంచీ తీవ్ర విమర్శల పాలైంది. గతంలో గుజరాత్, హర్యానాల్లో చిన్న కారణాలకే సీఎంలను మార్చేసిన బీజేపీ అధిష్ఠానం ఇంత జరుగుతున్నా మణిపూర్‌లో మాత్రం బీరేన్‌ను ఏడాదిగా అలాగే కొనసాగించడం పెను వింత.

కనీసం అంతకు ముందు దశాబ్దకాలంగా ప్రశాంతంగా ఉన్న మణిపూర్‌లో ఇవాళ ఇలా తయారైందంటే తప్పెవరిది? సాయుధ మూకలు తుపాకులు ధరించి, చివరకు సైనిక వాహనాలను సైతం అడ్డగిస్తున్న పరిస్థితి ఉందంటే, ఏమనాలి? సోషల్ మీడియాలో దేశమంతటా తిరుగుతున్న ఈ దృశ్యాలు పాలకులకే సిగ్గు చేటు. ఏ ఒక్క వర్గాన్నో కాదు... మొత్తం రాష్ట్రాన్నే మంటల్లో పడేసిన ప్రస్తుత పరిస్థితి మారాలంటే ప్రభుత్వాలు త్రికరణశుద్ధిగా కార్యాచరణకు దిగాలి. జాతి, మతం, రాజకీయాలతో ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు చేపట్టాలి. మాటలు, సమీక్షల కన్నా సత్వర చర్యలు ముఖ్యం. రాజకీయ జోక్యం మాని, ఉన్మాద చర్యల్ని ఉక్కుపాదంతో అణచివేసేలా భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలి. అన్ని వర్గాల మధ్య సామరస్యం నెలకొనే నిరంతర రాజకీయ కృషి సాగాలి. నిష్పాక్షికంగా, నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తేనే మణిపూర్ మళ్ళీ మామూలవుతుంది. లేదంటే, మణిపూరే కాదు... మానవ చరిత్ర కూడా మనల్ని క్షమించదు.

వలసలపై పాశ్చాత్యుల నటనలు

విశ్లేషణ



టంకశాల అశోక్

లాటిన్ అమెరికా, ఆసియా, ముఖ్యంగా ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు సాగుతున్న వలసలు అక్కడ ఒత్తిడి పెంచుతున్నాయి. ఫ్రాన్స్‌లోలా అల్లర్లు చెలరేగడం, పలురకాల నేరాలు జరగడం లాంటివి. వీటికి విరుగుడుగా యూరోపియన్ దేశాలు ఆఫ్రికాలో పెట్టుబడులు పెంచితే, అక్కడే అభివృద్ధి జరిగి, వారు యూరప్‌కు వలస రాకుండా ఉంటారని జీ–7 సమావేశాల్లో ఇటలీ ప్రధాని మెలోనీ చేసిన ప్రతిపాదన వినడానికి అద్భుతంగా ఉంటుంది. వాస్తవానికి యూరోపియన్లు, అమెరికన్లు వందల ఏళ్లుగా అనుసరించిన విధానాల పర్యవసానమే ఈ వలసలు. ఇప్పుడు ప్రత్యక్ష వలస పాలన నుంచి ఉపసంహరించుకున్నా, పరోక్షంగా నియంత్రిస్తూనే ఉన్నారు. వలసలు ఆగాలన్న చిత్తశుద్ధి వారికి ఉంటే చేయవలసింది పరోక్ష దోపిడీని మానివేయటం.

ప్రపంచంలోని పేద దేశాలన్నింటిని ఆరు వందల సంవత్సరాల నుంచి తమ వలసలుగా, నయా వలసలుగా మార్చుకుని అదుపులేని దోపిడీ సాగిస్తూ వస్తున్న పాశ్చాత్య దేశాలు, వారి బాగోగుల కోసం అంటూ మరొక మారు నటనలు చేస్తున్నాయి. ఇటలీలో గత వారాంతంలో జరిగిన జీ–7 సమావేశాలలో ఆ దేశపు ప్రధాని జార్జియో మెలోనీ చేసిన ప్రతిపాదనలను గమనిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది.

మెలోనీ చేసిన ప్రతిపాదనలు తమకు తక్షణ సమస్యగా మారిన ఆఫ్రికన్ వలసల గురించి. ఆఫ్రికా ఖండంలోని ఉత్తర భాగాన గల అరబ్ దేశాల నుంచి, దక్షిణాన సహారా ఎడారికి దిగువన గల అనేక ఇతర దేశాల నుంచి ఇటలీతో పాటు యూరప్ అంతటికీ వలసలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. వాటిలో చట్ట ప్రకారం జరిగేవాటి కన్నా, అక్రమంగా జరిగేవి అనేక రెట్లు ఎక్కువ. వారంతా ఆఫ్రికా, యూరప్‌ల మధ్య గల మధ్యధరా సముద్రం మీదుగా చిన్న చిన్న పడవలలో రహస్యంగా ప్రయాణిస్తారు. యూరోపియన్ దేశాల గస్తీ బోట్లు పట్టుకునేది కొందరినైతే, అనేక మంది పట్టుబడకుండా యూరప్ తీరానికి చేరతారు. అక్కడి నుంచి తమ మిత్రుల ద్వారానో, లేక స్థానిక అధికారులకు, ఏజెంట్లకు డబ్బు ఇచ్చుకునో వివిధ దేశాలకు వెళ్ళిపోతారు. యథాతథంగా ఇదే తమకు సమస్య అని యూరోపియన్ ప్రభుత్వాలు భావిస్తుండగా, మధ్యధరా సముద్రంపై ప్రయాణ సమయంలో పరిస్థితులు అనుకూలించక పడవలు మునిగి ప్రతి యేటా కొన్ని వందల మంది దుర్మరణం పాలవుతుంటారు.

ఈ నేపథ్యంలో, జీ–7 సమావేశాలు ముగిసిన రెండురోజులకే 'బీబీసీ' ప్రసారం చేసిన ఒక కథనం సంచలనంగా మారింది. మధ్యధరా సముద్రాన్ని ఆనుకుని ఉన్న యూరోపియన్ దేశాలలో ఇటలీ, గ్రీస్ ముఖ్యమైనవి. వాటి మీదుగానే వలసదారులు ఇతర చోట్లకు వెళుతుంటారు. అటువంటి స్థితిలో గ్రీస్ తీరప్రాంత గస్తీ అధికారులు వలసదారులను తరమ తిరిగి సముద్రంలోకి బలవంతాన తీసుకుపోయి మునిగిపోయేటట్లు చేస్తున్నారట. గత మూడేళ్ళలో జరిగిన ఇటువంటి ఘటనలలో కొన్నింటిని 'బీబీసీ' బయటపెట్టింది.

వలసల నివారణకు ఇటలీ ప్రధాని మెలోనీ చేసిన సూచనల ప్రకారం, యూరోపియన్ దేశాలు ఆఫ్రికాలో పెట్టుబడులు పెంచాలి. ఆ విధంగా అక్కడ అభివృద్ధి జరిగితే అక్కడి ప్రజలకు ఉపాధి లభించి వారు యూరప్‌కు వలస రాకుండా ఉంటారు. ఈ విధమైన ప్రతిపాదనలు చరిత్ర తెలియని వారికీ, అమాయకులకూ అద్భుతంగా తోస్తాయి. అటువంటి పెట్టుబడులంటూ నిజంగా జరిగితే, అవి సహజంగా ప్రైవేటువి అవుతాయి. వాటి యాజమాన్యాలు తమ 'జాబ్‌లెస్ గ్రోత్ టెక్నాలజీ' వల్ల కొద్దిపాటి ఉపాధులు కల్పించి, వాటికి నికరమైన దీర్ఘకాలిక హామీ ఏదీ లేకుండా చేసి, తమ దృష్టినంతా అక్కడి వనరులను, మార్కెట్లను కొల్లగొట్టటంపై కేంద్రీకరిస్తాయి. ఈ తరహా విధానాల వల్ల వలసల సమస్య, ఆఫ్రికా పేదరికం సమస్య ఎంత మాత్రం పరిష్కారం కావు. యూరోపియన్లు మాత్రం తమ కొత్త పెట్టుబడులకు రాయితీలు సంపాదించి మరింత లాభపడతారు.



వాస్తవానికి యూరోపియన్లు, అమెరికన్లు వందల సంవత్సరాలుగా ఈ తరహా ఆర్థిక నమూనాలను అనుసరించిన దాని పర్యవసానమే ఈవిధంగా సాగుతున్న వలసలు. ఈ విషయం ఇటలీ ప్రధాని మెలోనీకి తెలియదని భావించలేము. అసలు మొత్తం పాశ్చాత్య దేశాల చరిత్రే ప్రపంచాన్ని తమ వలసలుగా మార్చుకోవటం; అక్కడి నుంచి లక్షలాది మందిని బానిసలుగా తెచ్చి తమ వాణిజ్య పంటల ఎస్టేట్లలో, ఇతరత్రా భయంకరమైన రీతిలో చాకిరీ చేయించుకోవటం ; ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేయటం; తమ ఉత్పత్తులను అక్కడి మార్కెట్లలో బలవంతంగా అమ్మి స్థానిక ఉత్పత్తులను ధ్వంసం చేయటం; స్థానిక పాలకులను రకరకాలుగా లొంగదీసుకుని తుదముట్టించటాలతో నిండిపోయి ఉంది. ఇది అక్కడి నిష్పాక్షికులైన చరిత్రకారులు, మేధావులు నేటికీ ధృవీకరిస్తున్న విషయం. అంతెందుకు, ప్రముఖ వలస రాజ్యాలలో ఒకటైన ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ షిరాక్ కొద్దికాలం క్రితం యూరోపియన్ దేశాల ప్రస్తుత సిరి సంపదలకు తమ వలస దోపిడీలు ఒక ప్రధాన కారణమని అంగీకరించారు.

యూరోపియన్ వలసల దశ 1940ల నుంచి 1970ల మధ్య దాదాపు ముగిసిపోయింది. వారి దోపిడీలు కూడా అంతటితో ఆగితే ఈరోజున అక్కడి ప్రజలు యూరప్‌కు గానీ, అమెరికాకు గానీ వలస వెళ్ళవలసిన అగత్యమే ఉండేది కాదు. అక్కడ గల అపారమైన సహజ వనరులు, మానవ నైపుణ్యాలతో వారు స్వయంగా అభివృద్ధి చెంది ఉండేవారు. కానీ పాశ్చాత్యులు ప్రత్యక్ష రాజకీయ వలస పాలన నుంచి ఉపసంహరించుకున్నా, స్థానిక నాయకులను, సైనికాధికారులను, సివిలియన్ అధికారులను, ఆర్థిక రంగానికి చెందిన ప్రముఖులను పరోక్షంగా నియంత్రిస్తూనే వచ్చారు. తమ పెట్టుబడులు, టెక్నాలజీలు, మార్కెటింగ్ వ్యవస్థల ద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థలు వారి అధీనంలోనే ఉంటూ వస్తున్నాయి. ఆసియా కొంత మెరుగుపడినా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో మార్పులు స్వల్పమే. ఇది మంచి చదువులు, ఉద్యోగాల కోసం వెళుతున్న వారి గురించి అంటున్న మాట కాదు. దిగువ స్థాయి వారికి సంబంధించిన విషయం.

ఈ విధంగా వలస వెళుతున్న వారి కారణంగా పాశ్చాత్య దేశాలలో సమస్యలు తలెత్తుతున్న మాట నిజమే. అట్లా వెళ్ళేవారికి ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉండవు. వారు మురికి వాడలలో నివసిస్తుంటారు. వారి వల్ల తక్కిన సమాజంపై రకరకాల ఒత్తిడిలు ఏర్పడుతుంటాయి. ఫ్రాన్స్‌లో వలె ఒక్కోసారి తీవ్రమైన అల్లర్లు, హింస చెలరేగుతాయి. పలురకాల నేరాలు జరుగుతాయి. వారికోసం ఏ ప్రభుత్వమైనా కొన్ని సహాయ చర్యలు తీసుకున్నా అవి ఎంతమాత్రం సరిపోవు. మరొకవైపు వలసలు కొనసాగుతూనే ఉంటాయి. ఇటలీ ప్రధాని మెలోనీ మాటలను 'చీమా, చీమా ఎందుకు కుట్టావు?' అన్న నీతికథలో వలె శోధిస్తూపోతే, పైన చెప్పుకున్న వందల ఏళ్ళ పాశ్చాత్య వలస దోపిడీ చరిత్ర ముందుకు వస్తుంది. విచిత్రం ఏమంటే, ఇన్నిన్ని జరుగుతున్నా వారు తమ గత స్వభావాలను, విధానాలను మార్చుకోవటం లేదు. వారికి ఇప్పటికీ చిన్న చిన్న వలస భూభాగాలు, వందలాది సైనిక స్థావరాలు ఉన్నాయి. ఉదాహరణకు ఇటీవలి కాలానికే వస్తే, ఆఫ్రికాలోని మాజీ ఫ్రెంచి వలసలు సుమారు ఆరింటిలో, అక్కడి ఫ్రెంచ్ అనుకూల పాలకులపై తిరుగుబాట్లు జరిగాయి. కొత్తగా అధికారానికి వచ్చిన వారు అక్కడి ఫ్రెంచ్ సైనిక స్థావరాలను ఖాళీ చేయించి వెళ్ళగొట్టారు. దీనిపై ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ నానా రభస సృష్టించి కొత్త పాలకులపై ఒత్తిడి తెచ్చారు. కానీ వారు ససేమిరా లొంగలేదు.

ఇటలీ అధ్యక్షురాలు మెలోనీ నుంచి, అమెరికా అధ్యక్షుడు బైడెన్, మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ల వరకు పాశ్చాత్య నాయకులకు ఇటువంటి వలసలను ఆపాలనే చిత్తశుద్ధి నిజంగా ఉందా? వలసలు యూరప్ అంతటా పెద్ద సమస్య అయినట్లు గత వారమే జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికలలో మితవాదుల ఓటు గణనీయంగా పెరగటం రుజువు చేసింది కూడా. వలసలు, జాతివాదమే అక్కడ ముఖ్యమైన అజెండాగా మారుతున్నాయి. అందువల్ల ఆ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే చేయవలసింది ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్, ఆసియా దేశాల దోపిడీని త్వరగా మానివేయటం. అక్కడి వనరులను, మార్కెట్లను అక్కడి ప్రజల నియంత్రణకు, ఉపయోగానికి వదిలివేయటం. వారితో అన్ని సంబంధాలను సమతులనంగా, పారదర్శకంగా, ప్రజాస్వామికంగా మార్చుకోవటం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాగున్నారు!



నోమ్ చోమ్‌స్కీ (భాషా శాస్త్రవేత్త) మరణించినట్టు వచ్చిన వార్తలు మరీ ఎక్కువచేసి రాసినవి. 'జాకోబిన్', 'న్యూ స్టేట్స్‌మన్' పత్రికలు అనంతరం ఈ వార్తను తొలగించాయను కోండి! ఆయన భార్య వలేరియా నాకు నిర్ధారించారు. ఆయన బతివున్నారు, బాగున్నారు.

– స్టీవెన్ పింకర్, శాస్త్రవేత్త

ఒక్క జిరాక్సు కోసం...



మీరు ఎవరికైనా ఓటు వేయండి గానీ, ఇక్కడ బతికి ఉంటున్నందుకే పశ్చాత్తాప పడేట్టు చేయడంలో ఇండియన్ బ్యూరోక్రసీ సమర్థతే వేరు. ఢిల్లీలోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలో నా అనుభవమే తీసుకోండి. మిగతా విషయాలు అటుండనీ, హెచ్‌డీ నాణ్యతగల పాస్‌పోర్టు జిరాక్సు కోసం 50 డిగ్రీల ఎండలో నన్ను నడిపించారు.

– మేఘా మెహతా, న్యాయవాది

వీళ్లో రకం!



ఉన్న విశ్వ విద్యాలయాలను పాడు చేయాలి. లేని వాటి శిథిలాలకు ఉత్సవం చేయాలి. (బిహార్‌లోని రాజ్‌గిర్‌లో నలంద విశ్వ విద్యాలయ నూతన క్యాంపస్‌ను ప్రధాని మోదీ ప్రారంభించిన నేపథ్యంలో.)

– సాధికా తివారీ, జర్నలిస్ట్

వాస్తవాలు దాయొద్దు!



నలంద కేవలం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదు; దాని వారసత్వాన్ని తుడిచి పెట్టలేని అమూల్యమైన చారిత్రక సంపద. నిజంగా చరిత్రలోని గాయాలను పట్టించుకోవాలనుకుంటే, దురాక్రమణదారులను గొప్ప చేయడం కాకుండా, వారి చర్యలను ఖండించాలి.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ బీజేపీ నాయకుడు

అందుకే కన్ను



ప్రపంచంలో తాగునీటి వనరులు అత్యంత తక్కువున్న దేశం చైనా (రష్యాలో అత్యధికం). మూడింట రెండొంతుల బ్రహ్మపుత్ర నది చైనాలో ఉంది, మిగిలింది అరుణాచల్‌లో ఉంది. ఒక హైడ్రలాజికల్ అధ్యయనం ప్రకారం, బ్రహ్మపుత్ర నీటి సంగ్రహం 20 శాతమే చైనాలో జరుగుతుండగా, 80 శాతం అరుణాచల్‌లో జరుగుతుంది. అందుకే డ్రాగన్ కళ్లు అరుణాచల్ మీదున్నాయి.

– రాకేశ్ కృష్ణన్ సింహా, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

విచారణ జరిపించాలి

డాక్టర్ కావాలని ఎంతో కష్టపడి చదివి 'నీట్' పరీక్షకు హాజరైన లక్షలాది విద్యార్థుల ఆశలపై ఆ పరీక్షల ఫలితాలు నీళ్లు చల్లాయి. ఎన్నడూ లేనివిధంగా 67 మందికి 720 మార్కులకు 720 రావడం, అలా వచ్చినవారిలో పలువురు ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయడం విద్యార్థులనే కాక, వారి తల్లి తండ్రులనూ నిరుత్తరులను చేసింది. దీనికి తోడు నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వందలాదిమందికి పరీక్షానిర్వహణ సంస్థ ఎన్టీఏ గ్రేస్ మార్కులను ఇవ్వడం కూడా విమర్శలకు దారితీసింది. ప్రజల ఆందోళనల నేపథ్యంలో చివరికి గ్రేస్ మార్కులను ఎన్టీఏ ఉపసంహరించుకుంది. కాని, పరీక్షల నిర్వహణలో మాత్రం ఎటువంటి అవకతవకలూ జరగలేదని అనడమే విడ్డూరంగా ఉంది.

ప్రతిసారీ విద్యార్థులతో 'పరీక్షా పే' చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని... కీలకమైన నీట్ పరీక్షపై ఆరోపణలు, అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ మాట్లాడకపోవడం విద్యార్థుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నీట్ పరీక్ష మాత్రమే కాక దేశంలోని ఎన్నో పోటీ పరీక్షలను ఎన్టీఏ నిర్వహిస్తోంది. తాజాగా బయటపడ్డ వివాదస్పద అంశాల కారణంగా దానిపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చింది. ప్రతిసారీ ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు ఎక్కువగా ర్యాంక్‌లు రావడం, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తక్కువ ర్యాంకులు రావడంపై దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు అనేక అనుమానాలు కల్గుతున్నాయి.

ఈ మొత్తం వ్యవహారంపై కేంద్రం సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి అవకతవకలు ఉన్నవని తేలితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అక్రమంగా లబ్ధిపొందిన వారిపైనా చర్యలు తీసుకోవాలి. నీట్‌లో జరిగిన అక్రమాల కారణంగా కష్టపడి చదివిన విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– గద్దం శ్యామ్, పీడీఎస్‌యూ తెలంగాణ ఉపాధ్యక్షుడు

రాజకీయ చాతుర్యంలో ఆయనకు సాటి లేరు

సందర్భం



జిల్లా గోవర్ధన్

దేశ గమనాన్ని మలుపుతిప్పినవారు మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు. నాటకీయ పరిణామాల మధ్య ప్రధాని పీఠాన్ని అధిష్ఠించి మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు నడపడం ఆయన పాలనాదక్షతకు ప్రతీక. అసలు ఆయన ప్రధాని కాకపోతే నేటి సరళీకరణ ఫలాలు మనకు కనిపించేవి కావేమో?

దశ (అదృష్టం), దిశ (గమ్యం) రెండూ కొందరి జీవితాల్లో అనూహ్యంగా ట్విస్ట్ అవుతుంటాయి. దేశ రాజధానిలో మూడు దశాబ్దాల రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పి, వానప్రస్థం స్వీకరించాలనుకున్న సీనియర్ కాంగ్రెస్ నేత పాములపర్తి వెంకట నరసింహారావు విషయంలో ఇదే జరిగింది. 1991 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఢిల్లీ నుండి పెట్టే బేడాసర్దుకుని ఇంటిదారి పట్టేపనిలో ఉన్నారు. శ్రీ సిద్ధేశ్వరి మఠం (తమిళనాడు)లో శేష జీవితం గడపటానికి వెళ్ళబోతున్నానని తన సన్నిహితులకు చెప్పారు. ఈ తరుణంలోనే 1991 మే 21 రాత్రి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మృత్యువాత పడటంతో, దేశ రాజకీయ పరిస్థితి ఒక్కఉదుటున తారు మారయింది. ఇంకో విడత ఎన్నికలు జరగాల్సి ఉంది; పార్టీ అధ్యక్షుని హఠాన్మరణంతో అగాథంలో పడిన కాంగ్రెస్ నాయకులు మరుసటి రోజు మధ్యాహ్నం వర్కింగ్ కమిటీ మీటింగు ఏర్పాటు చేసి, అధ్యక్షుని స్థానంలో సీనియర్ నేత పీవీ నర్సింహారావును నియమించారు. కేవలం అరగంట పాటు జరిగిన ఆ సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులు, పార్టీ అధ్యక్షుని మరణ రీత్యా సంతాప తీర్మానం చేసి, తర్వాత తాత్కాలిక పార్టీ అధ్యక్షునిగా పీవీని నియమించారు. భర్తను కోల్పోయిన విషాదంలో, సోనియా గాంధీ పార్టీ కార్య కలాపాలకు దూరంగా ఉండాలనుకుంది. జూన్‌లో వెలువడిన 10వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 232 సీట్లు సంపాదించి, అతి పెద్ద పార్టీగా ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. గాంధీ కుటుంబీకులు రేసులో లేకపోవటంతో... అర్జున్ సింగ్, మాధవ్ రావ్ సింధియా, రాజేష్ పైలట్, శరద్ పవార్ లాంటి సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత పదవికి బరిలోకి దిగినప్పటికీ ఎన్నికైన అత్యధిక ఎంపీలు, గాంధీ కుటుంబానికి విధేయత, అనుభవం ఉన్న పీవీ వైపే మొగ్గు చూపారు. 'పార్లమెంటు పార్టీ నేత ప్రధాని పీఠానికి అర్హుడు కాబట్టి, ఈ పదవికి పార్టీ ఎంపీలు తమలోని నాయకుణ్ణి డెమాక్రటిక్ పద్ధతిలోనే ఎన్నుకోవాలని' పాచిక విసిరారు శరద్ చంద్ర పవార్. రాజకీయ చదరంగం ఆటలో అప్పటికే ఆయన పేరొందిన ఆటగాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన అనునాయిడూ, పూణె ఎంపీ అయిన సురేష్ కల్మాడీ (ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మాజీ స్క్వాడ్రన్ లీడర్) మహారాష్ట్ర సదన్ నుండి, ఉత్తరాది



రేపు పీవీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు

కాంగ్రెస్ ఎంపీలను పవార్ లాబీ కోసం సమీకరణ చేస్తూ షాం–ఏ–దావతులు ఏర్పాటు చేశారు. ఇటు కేరళ హౌస్ నుండి, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. కరుణాకరన్, పీవీ కోసం దక్షిణాది కాంగ్రెస్ ఎంపీలను ఏకతాటిపై తేవటానికి ప్రయత్నాలు జరిపారు.

అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం జూన్ 19 నాడు కాంగ్రెస్ నేతలతో కిక్కిరిసింది. 232 మంది నూతన ఎంపీలను పార్లమెంటరీ పార్టీ నాయకుణ్ణి ఎన్నుకోమని ఒకవేళ ఓటింగ్ నిర్వహిస్తే పవార్ 35 ఓట్లతో వెనుకంజలో ఉంటాడని తెలిసిపోయింది. వీరిని తన వైపు మరల్చుకోవటానికి ఆయనకు ఇట్టే సమయం పట్టదని గ్రహించిన పీవీ, పోటీకి దిగిన శరద్ పవార్‌ను ఆఖరి ప్రయత్నంగా, ఒక వైపు తీసుకెళ్లాడు. ఏకాంతంలో పవార్‌తో, ఈ మధ్యనే తన గుండెకు శస్త్ర చికిత్స జరిగిందనీ, వయోభారంతో రాజకీయ విధులు నిర్వర్తించటం ఎక్కువ కాలం సాధ్యపడక పోవచ్చని చెబుతూ... మరాఠీలో, 'మీ హీ జబాబ్దారీ మార్యు ఖాంద్యా వర్ కితీ దివస్ పేల్వూ (నేను ఈ భాధ్యత నా భుజాలపై వేసుకుని ఎన్ని రోజులని మోయగలను) అంటూ, 'కొన్ని రోజులపాటు తనకు ప్రధానిగా అవకాశం ఇవ్వవలసిందిగా' నవ్వుతూ కోరాడు పీవీ. పీవీ తాత్విక ధోరణితో మాట్లాడిన మాటలకు చలించి పోయారు పవార్ సాహెబ్.

మరుసటి రోజు ఉదయం (జూన్ 20) పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. హాజరైన ఎంపీలు అంతా హాలులోకి ప్రవేశించిన శరద్ పవార్ వైపే సస్పెన్స్‌తో చూస్తున్నారు. మీటింగు ఆరంభం కావటంతోనే పవార్, జేబులోనుండి తను రాసిన ఒక లెటర్ తీసి సభ్యుల ముందుంచారు. 'పార్టీ నాయకత్వాన్ని నిర్ణయించడంలో సీపీపీని సమావేశ పరచాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్ అధ్యక్షులు (పీవీ) అంగీకరించడాన్ని నేను స్వాగతిస్తున్నాను. సీపీపీ సభ్యులందరూ శ్రీ పీవీ నరసింహారావుకు మద్దతు ఇవ్వాలనీ, ఈ విషయంలో ఏకగ్రీవ నిర్ణయానికి రావాలనీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని అందులో కోరారు.

అంతే, మరునాడు (1991 జూన్ 21) రాష్ట్రపతి భవన్‌లో పీవీ నరసింహారావు తొమ్మిదవ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తను ప్రధాని అయ్యాక, శరద్ పవార్‌ను పార్టీ జాతీయ అధ్యక్షునిగా నియమిస్తానని రావు ప్రామిస్ చేసినట్టు అంటారు. కాని, ఏప్రిల్ 1992 ఏప్రిల్‌లో జరిగిన తిరుపతి కాంగ్రెస్ పార్టీ సదస్సులో, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని తన అనుకూల సభ్యులతో పునర్వ్యవస్థీకరించి, అధ్యక్షునిగా పార్టీ పగ్గాలు సైతం నాటకీయంగా కైవసం చేసుకున్నారు అపర చాణక్యుడు పీవీ నరసింహారావు.


(శరద్ పవార్ రాజకీయ ఆత్మకథ 'లోక్ మాఝే సాంగతి', రషీద్ కిద్వాయి రాసిన '24 అక్బర్ రోడ్' ఆధారంగా)

వ్యాసకర్త విశ్రాంత పీఎఫ్ కమిషనర్ । 9819096949

భిన్నత్వంలో ఏకత్వం

ఓ మానవుడా! భగవంతుని బ్రహ్మాండ రచనను మెచ్చుకొని దానికి శిరసు వంచి వినమ్రునిగా ఉండు. కొంచెం ఆలోచించు. ఎక్కడ నీడ ఉంటుందో అక్కడ ఒక చెట్టు; ఎక్కడ చెట్టు ఉంటుందో అక్కడ నీడ ఉంటుంది. అదే మాదిరిగా ఎక్కడైతే సంతోషం ఉంటుందో అక్కడ దుఃఖం, అది ఉన్న చోట సంతోషం ఉంటుంది. భిన్నత్వం , ఏకత్వాల కలబోతే ప్రకృతిమాత.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఎక్కడ భగవంతుడు ఉంటాడో, అక్కడ భక్తుడూ; ఎక్కడ భక్తుడు ఉంటాడో, అక్కడనే భగవంతుడూ ఉంటాడు. ఈ ఇరువురి మధ్య భిన్నత్వం లేదు. అదే మాదిరిగా ఎచ్చట శిష్యుడు ఉంటాడో, అచ్చటనే అతని గురువు ఉంటాడు; గురువు ఉన్న చోటే అతని శిష్యుడూ ఉండవలసినదే. ఈ ద్వంద్వాలను చూచి మోసపోకూడదు. ఈ బ్రహ్మాండ మంతయూ బ్రహ్మ పదార్థమే వ్యాపించియున్నది. ఈ సత్యాన్ని గ్రహించాలి. దేనివల్ల భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వములో భిన్నత్వం కలిగెనో అటువంటి మూలాన్ని స్తుతిస్తూ సాష్టాంగ నమస్కారం చెయ్యాలి. మౌనమే ధ్యానం. సాధకుడికి మౌనావలంబనం ఎంతైనా ముఖ్యం. మౌనం మానవుణ్ణి ప్రశాంతపరచి, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్లడానికి సహాయపడుతుంది. ఏ ఒక్కరూ అనవసరంగా, అధికంగా మాట్లాడకూడదు. అత్యవసరమైనదే మాట్లాడాలి. నిర్ణీత వేళల్లో మౌనంతో ఉండడమే తపస్సు. కేవలం నాలుకను కదల్చకుండా ఉంచుట మౌనం కాదు. మనసుకు కూడా పూర్తి విశ్రాంతి ఇవ్వాలి. ఈ విధంగా చేసినపుడు మనిషి ఎక్కువ శక్తినీ, ఎక్కువ నిర్మలత్వాన్నీ పొందుతాడు. ఇందువలన మనసు అలసట తీర్చుకొంటుంది. ఏకాగ్రతా పెరుగుతుంది. నీ మనసు ఎంత ఖాళీగా ఉంటుందో, అంత ఏకాగ్రత పెరుగుతుంది. మనసును ఖాళీ చేయటానికి మౌనం చాలా ప్రభావశాలి. మహాత్ములు, జ్ఞానులు దీర్ఘకాలం మౌనం పాటిస్తారు. శ్రీకృష్ణ పరమాత్మ 'గీత'లో తెలిపిన విషయం:'గోప్యమైన వానిలో, నేనే మౌనమును'. అందువలన మనసు కూడా మౌనాభ్యాసం చేద్దాం.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.6.27 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అనూరాధ సా.5.41 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.11.36 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.40 నుండి 8.23 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై సమగ్ర విధానం

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభల్లో సమాచార శాఖ మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సమగ్రమైన విధానాన్ని తీసుకొస్తామని సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభలు బుధవారం ఖమ్మంలో ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత పదేళ్లలో జర్నలిస్టులు భావ ప్రకటన విషయంలో అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను నూరు శాతం పరిష్కరిస్తుందని చెప్పారు. కొన్ని చోట్ల ఇళ్ల స్థలాలు మంజూరైనా కోర్టులో వివాదం ఉందని, అది క్లియర్ అయ్యాక కూడా గత ప్రభుత్వం స్థలాలు ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత్రికేయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించామని తెలిపారు. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రామనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ గడువు పెంపు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ (గుర్తింపు కార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్లు అయిన జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అక్రెడిటేషన్ కార్డుల గడువు ఈ నెల జూన్ 30 తో ముగుస్తుండగా, గడువు తేదీని సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు ఆ ఉత్తర్వులలో వెల్లడించారు.

డిసెంబర్ లోపు ట్రిపుల్ ఆర్ పనులు షురూ

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి
- అక్టోబర్‌లో శంకుస్థాపన చేసే యోచన
- వీలైతే ప్రధాని చేతుల మీదుగా కార్యక్రమం
- ఢిల్లీలో 24 అంతస్తులతో తెలంగాణ భవన్
- రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష



రోడ్లు, భవనాల శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ దశ మార్చేలా రూపుదిద్దుకోనున్న రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) పనులను డిసెంబర్‌లోపు ప్రారంభించనున్నట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. టెండర్ల ప్రక్రియ అనంతరం అక్టోబర్‌లో లాంఛనంగా శంకుస్థాపన చేసే యోచనలో ఉన్నామని చెప్పారు. కుదిరితే ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగానే ట్రిపుల్ ఆర్ పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చించి మళ్లీ ఆ పథకాన్ని పట్టాలెక్కించినట్టు చెప్పారు. బుధవారం రోడ్లు భవనాల శాఖపై 8 గంటల పాటు సమీక్ష అనంతరం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ట్రిపుల్ ఆర్ ఆధారంగా స్పోర్ట్స్, హార్డ్‌వేర్ జోన్లు

'ప్రపంచ పటంలో హైదరాబాద్‌ను ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మార్చే స్థాయి ట్రిపుల్ ఆర్‌కు ఉంది. దీనిని ఆధారంగా చేసుకుని స్పోర్ట్స్ జోన్, హార్డ్‌వేర్ జోన్‌లాంటి వాటిని ఏర్పాటు చేయనున్నాం. దీనితోపాటు రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్-విజయవాడ హైవే ఆరు వరుసల విస్తరణ పనులను కూడా డిసెంబర్ నాటికి కొలిక్కి తెస్తాం. రూ.375 కోట్ల విలువైన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. 17 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల పనులకు 23న శంకుస్థాపన చేస్తున్నాం. రూ.5,600 కోట్లతో గ్రీన్ హైవేగా బెంగుళూరు రహదారిని, ఎలివేటెడ్ కారిడార్లతో నాగ్‌పూర్ జాతీయ రహదారిని మెరుగుపరుస్తాం. నగరం చుట్టూ నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాలను, వరంగల్ కొత్త ఆసుపత్రి భవనాన్ని సకాలంలో పూర్తి చేస్తాం. గత ప్రభుత్వం అకౌంట్ల కోసం పనిచేస్తే, మా ప్రభుత్వం అకౌంటబిలిటీ(జవాబుదారీతనం) కోసం పనిచేస్తుంది..'అని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

3 నెలల్లో అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభం

'ఎనిమిదేళ్ల క్రితం పనులు మొదలై నిలిచిపోయిన ఉప్పల్ వంతెన పనులను నెల రోజుల్లో తిరిగి ప్రారంభిస్తాం. అంబర్‌పేట వంతెనను 3 నెలల్లో ప్రారంభిస్తాం. అల్వాల్ మార్గంలో 14 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ పనులకు త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. ఢిల్లీలో ఏపీ భవన్ స్థలంలో మన దామాషా ప్రకారం దక్కే భూమిలో 24 అంతస్తులతో తెలంగాణ భవన్‌ను నిర్మిస్తాం. దీనికి సంబంధించి డిజైన్లు పూర్తయ్యాయి. రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది.

రోల్ మోడల్‌గా తెలంగాణ రోడ్లు

తెలంగాణ రోడ్లు రోల్‌మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతాం. రాష్ట్ర రహదారుల్లో వేటిని జాతీయ రహదారులుగా మార్చాలో తేల్చి కేంద్రానికి ప్రతిపాదనలు అందజేస్తాం. ప్రస్తుతం 16 రోడ్ల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగులో ఉన్నాయి. వాటికి అనుమతులు సాధిస్తాం. అవసరమైతే ముఖ్యమంత్రితో పాటు ప్రధానిని కలుస్తాం. రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేతగా ప్రస్తుతం పార్లమెంటులో విపక్ష కూటమి బలంగా ఉంది. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి ఎక్కువ నిధులు వచ్చేలా చూస్తాం. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే, దాని పక్కనే బుల్లెట్ రైలు మార్గం సాధించేందుకు కూడా ఒత్తిడి చేస్తాం. కాంట్రాక్టర్లకు పేరుకుపోయిన బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం.

ఉస్మానియాకు కొత్త భవనంపై అఖిలపక్ష సమావేశం

నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి అదే స్థలంలో కొత్త భవనాన్ని, అదే నమూనాలో నిర్మించే ప్రతిపాదన ఉంది. త్వరలో అన్ని పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటాం. పాటిగడ్డలో హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించాం. దేశంలోనే గొప్ప హైకోర్టు భవనంగా తెలంగాణ హైకోర్టు భవనాన్ని నిర్మిస్తాం. దీనికి సంబంధించిన డిజైన్లు సిద్ధమవుతున్నాయి. రెండేళ్లలో భవనం సిద్ధమవుతుంది..'అని మంత్రి వివరించారు.

భద్రాద్రిలో ఇక బ్రేక్ దర్శనం

- వచ్చే నెల 2 నుంచి అమలు
- టికెట్ ధర రూ.200గా నిర్ణయం
- ఉదయం 9 నుంచి 9.30 వరకు తిరిగి రాత్రి 7 నుంచి 7.30 వరకు సదుపాయం

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో కొత్తగా బ్రేక్ దర్శనాలను అమలు చేయాలని నిర్ణయించారు. జూలై 2 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రేక్ దర్శనం టికెట్ ధరను రూ.200గా నిర్ణయించామని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 9.30 వరకు, తిరిగి రాత్రి 7 గంటల నుంచి 7.30 వరకు ఈ సదుపాయం ఉంటుందని వివరించారు. ఈ దర్శన సమయంలో ఉచిత, ప్రత్యేక దర్శనాలు, అంతరాలయ అర్చనలు తాత్కాలికంగా నిలిపివేస్తారని పేర్కొన్నారు. అయితే ఆలయంలో జరిగే విశేష, ఉత్సవ కార్యక్రమాల రోజుల్లో బ్రేక్ దర్శనం రద్దు లేదా వాయిదా వేసే అవకాశం ఉందని తెలిపారు. దీంతోపాటు ఈనెల 22న ఆలయంలో జ్యేష్ఠాభిషేకోత్సవం జరుగుతుందని, దీనిని పురస్కరించుకుని స్వామి వారికి జరిగే నిత్యకల్యాణం, తిరువీధి సేవ రద్దు చేస్తున్నట్లు ఈఓ వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో కూడా..: దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బ్రేక్ దర్శనం సౌకర్యవంతంగా ఉంటుందని ఆలయ వర్గాలు చెపుతున్నాయి. నిర్ణీత సమయంలో దర్శనం చేసుకుని ఉపాలయాల సందర్శన, ఇతర ప్రాంతాలను చూసేందుకు వీలు కలుగుతుందని అంటున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కౌంటర్లతోపాటు దేవస్థానం వెబ్‌సైట్‌లో కూడా బ్రేక్ దర్శనం టికెట్లు అందుబాటులోకి రానున్నాయి.

చిరంజీవి మాజీ అల్లుడు మృతి



శిరీష్

మణికొండ: మెగాస్టార్ చిరంజీవి మాజీ అల్లుడు శిరీష్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా లంగ్ కేన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చిరంజీవి కుమార్తె శ్రీజను 2007లో వివాహం చేసుకున్న శిరీష్ 2014లో చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అనంతరం 2019లో మరో వివాహం చేసుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్‌లో నివసిస్తున్నారు. బుధవారం ఆసుపత్రి నుంచి శిరీష్ మృత దేహాన్ని ల్యాంకోహిల్స్‌లోని ఎల్‌హెచ్-5 టవర్‌లోని ఆయన నివాసానికి తీసుకుని వచ్చారు. అనంతరం సాయంత్రం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు బంధువులు తెలిపారు.

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు న్యాయం దక్కుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం తెలంగాణ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌లతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం వీహెచ్ మాట్లాడుతూ... బీసీల గురించే ఆలోచించే ఏకైక వ్యక్తి రాహుల్ అంటూ కొనియాడారు.

వరి ధాన్యానికి మరో రూ.117

▶ మొదటి పేజీ తరువాయి

టాప్-10 ఓడరేవుల్లో ఒకటిగా అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 12 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ పోర్టులో 9 కంటైనర్ టెర్మినల్లు ఉంటాయి. ఒక్కో టెర్మినల్ పొడవు వెయ్యి మీటర్లు. ● రూ.2,869.65 కోట్లతో వారణాసిలోని లాల్‌బహదూర్ శాస్త్రి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు విస్తరణ. ఇందులో భాగంగా కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మిస్తారు. రన్‌వేను మరింత విస్తరిస్తారు. ● సముద్ర తీరంలో పవన విద్యుత్ ప్రాజెక్టులకు రూ.7,453 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్). 500 మెగావాట్ల చొప్పున గుజరాత్‌లో ఒకటి, తమిళనాడులో ఒకటి పవన విద్యుత్ ప్రాజెక్టుల అమలు. ● 2024-25 నుంచి 2028-29 దాకా రూ.2,254.43 కోట్లతో జాతీయ ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం(ఎన్‌ఎఫ్ఐఈఎస్) అమలు. ఇందులో భాగంగా ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి. కొత్త క్యాంపస్‌లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణం. నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ వర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ) ఏర్పాటు.

ఏ పంటకు ఎంతంటే (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనీస మద్దతు ధర 2024-25	కనీస మద్దతు ధర 2023-24	పెంపు
వరి ధాన్యం(సాధారణ)	2,300	2,183	117
వరి ధాన్యం('ఎ' గ్రేడ్)	2,320	2,203	117
జొన్నలు(హైబ్రిడ్)	3,371	3,180	191
జొన్నలు(మాల్దండి)	3,421	3,225	196
సజ్జలు	2,625	2,500	125
రాగులు	4,290	3,846	444
మొక్కజొన్న	2,225	2,090	135
కందులు	7,550	7,000	550
పెసలు	8,682	8,558	124
మినుములు	7,400	6,950	450
వేరుశనగ	6,783	6,377	406
పొద్దుతిరుగుడు	7,280	6,760	520
సోయాబీన్(ఎల్లో)	4,892	4,600	292
నువ్వులు	9,267	8,635	632
నైగర్ సీడ్	8,717	7,734	983
పత్తి(మధ్యస్థ పింజ)	7,121	6,620	501
పత్తి(పొడవు పింజ)	7,521	7,020	501

వ్యవసాయానికి రూ.1.34 లక్షల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఉండాలని సూచించారు. బ్యాంకర్లకు పాజిటివ్ దృక్పథం లేకపోతే ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదన్నారు. నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. బలహీన వర్గాలకు విరివిగా రుణాలు ఇస్తేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలు మారిపోతాయని పేర్కొన్నారు.

త్వరలో కొత్త విద్యుత్ పాలసీ

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో రాష్ట్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడనుందని భట్టి చెప్పారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన చెల్లింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా పెండింగ్‌లో పెట్టదని హామీ ఇచ్చారు. ఆయిల్ పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉందని, రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విద్యుత్ పాలసీని తీసుకురాబోతోందని తెలిపారు.



బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రాష్ట్రస్థాయి రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. చిత్రంలో అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు

సన్న చిన్నకారు రైతులపై చిన్నచూపు: మంత్రి తుమ్మల

వ్యవసాయ రంగానికి సంబంధించి గత సంవత్సరం కంటే రూ.13 వేల కోట్ల రుణాలు అధికంగా మంజూరు చేసినప్పటికీ, సన్న చిన్నకారు రైతుల వాటా అనుకున్నంత మేర లేదని మంత్రి తుమ్మల అన్నారు. రాష్ట్రంలో 73.11 శాతం భూములు వారి చేతిలోనే ఉన్నాయని, వీరికి ఇచ్చే రుణాలను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. రాష్ట్రంలో వివిధ బ్యాంకులకు చెందిన 6,415 శాఖల ద్వారా సేవలందిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 1,874 మాత్రమే ఉన్నాయన్నారు. వాటిని పెంచాల్సిన అవసరం ఉందని తుమ్మల చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగుకు బ్యాంకుల నుండి ప్రోత్సాహం కరువైందన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ కమల్ ప్రసాద్ పట్నాయక్, నాబార్డు సీజీఎం సుశీల్ చింతల, ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ దేబశిష్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

రుణాల కేటాయింపులు ఇలా...

- 2024-25 వార్షిక రుణ ప్రణాళిక మొత్తం రూ.6,33,777 కోట్లు ● ప్రాధాన్య రంగాలకు అడ్వాన్సులు రూ.2,80,550 కోట్లు ● వ్యవసాయ రంగానికి రూ.1,34,138 కోట్లు ● వ్యవసాయ రంగ కేటాయింపుల్లో పంట రుణాలకు రూ.81,478 కోట్లు. (గతం కంటే 10.95% పెరుగుదల), వ్యవసాయ పెట్టుబడులకు రూ.28,222 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.5,197 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలకు రూ.19,239 కోట్లు
- సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలకు రూ.1,29,635 కోట్లు ● గృహ రుణాలు రూ.10,768 కోట్లు ● విద్యా రుణాలు రూ.2,706 కోట్లు ● ఇతర రంగాలకు రూ.3,301 కోట్లు ● 2023-24లో మొత్తం డిపాజిట్లు రూ.7,79,953 కోట్లు (గతం కంటే రూ. 96,547 కోట్లు వృద్ధి) ● మొత్తం అడ్వాన్సులు రూ.9,79,058 కోట్లు (గతం కంటే రూ.1,65,162 కోట్ల వృద్ధి)
- పంట రుణాలు రూ.64,940 కోట్లు. (లక్ష్యంలో 88.42% మంజూరు) ● వ్యవసాయ పెట్టుబడి రుణాలు, అనుబంధ రంగాలు, కార్యక్రమాలకు రూ. 47,935 కోట్లు (లక్ష్యంలో 121.89% ఇచ్చారు)

20 లక్షల ఎకరాల్లో వానాకాలం పంటల సాగు

- అందులో 15 లక్షల ఎకరాలకుపైగా పత్తి
- పప్పుధాన్యాల సాగు 90,332 ఎకరాలు
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: వానాకాలం పంటలసాగు ఊపుమీదుంది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు అధికంగా పంటలు సాగవుతున్నాయి. ముందుగానే రుతుపవనాలు ప్రవేశించడంతో రైతులు సాగుపై దృష్టి సారించారు. గత ఏడాది వానాకాలంలో ఇదే సమయానికి 15.38 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఈ సీజన్‌లో బుధవారం నాటికి 20.22 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్టు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ ఏడాది వానాకాలం అన్ని పంటల సాధారణ సాగువిస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 15.44 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

- పత్తి అత్యధికంగా 15.60 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి సాధారణ సాగువిస్తీర్ణం 50.48 లక్షల ఎకరాలు కాగా, 30.91 శాతం సాగైంది. ఈ ఏడాది పత్తిని 60 లక్షల ఎకరాల్లో సాగు చేయించాలని ప్రభుత్వం రైతులకు పిలుపునిచ్చింది. ● వరి సాధారణ సాగువిస్తీర్ణం 57.18 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 28,236 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ● పప్పుధాన్యాల సాధారణ సాగువిస్తీర్ణం 8.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 90,332 ఎకరాల్లో సాగయ్యాయి. అందులో ఒక్క కంది సాగే 76,587 ఎకరాలు కావడం గమనార్హం. మొక్కజొన్న సాధారణ సాగువిస్తీర్ణం 6.09 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 37,766 ఎకరాలు సాగైంది. సోయాబీన్ సాధారణ సాగువిస్తీర్ణం 4.29 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 12,750 ఎకరాల్లో సాగైంది.

నారాయణపేటలో అధికంగా సాగు

నారాయణపేట జిల్లాలో వానాకాలం పంటలసాగు అధికంగా 41.50 శాతం విస్తీర్ణంలో నమోదైంది. ఆ తర్వాత మెదక్ జిల్లాలో 31.91 శాతం నమోదైంది. అత్యంత తక్కువగా మంచిర్యాల జిల్లాలో 0.12 శాతమే సాగైంది. ఇప్పటివరకు సాధారణ వర్షపాతం నమోదైందని వ్యవసాయశాఖ తెలిపింది. ● నారాయణపేట, నాగర్‌కర్నూలు, వనపర్తి, గద్వాల, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ● సంగారెడ్డి, మహబూబాబాద్, వికారాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ● కరీంనగర్, సిద్దిపేట, మెదక్, రంగారెడ్డి, వరంగల్, హన్మకొండ, జనగాం, ఖమ్మం జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ● ఆదిలాబాద్, కొమురం భీం, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.
- మంచిర్యాల జిల్లాలో అధికలోటు వర్షపాతం నమోదైందని వ్యవసాయశాఖ వెల్లడించింది.


బిహార్‌లో నలంద మహావిహార వద్ద ప్రధాని నరేంద్ర మోదీ

ప్రపంచ వైజ్ఞానిక కేంద్రంగా భారత్

అత్యాధునిక, పరిశోధనల ఆధారిత ఉన్నత విద్యా వ్యవస్థకు ప్రాధాన్యం

21వ శతాబ్దంలో భారత్ కీలకపాత్ర.. 2047 నాటికి వికసిత్ భారత్

- పరిశోధన, నవీన ఆవిష్కరణలకు రూ.లక్ష కోట్లతో ప్రత్యేక నిధి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- బిహార్‌లో నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ ప్రారంభం

రాజ్‌గిర్: అత్యాధునిక, పరిశోధనల ఆధారిత ఉన్నత విద్యా వ్యవస్థతో ప్రపంచంలోనే అతిముఖ్యమైన వైజ్ఞానిక కేంద్రంగా భారత్ ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఎల్లప్పుడూ జిజ్ఞాస, ధైర్యసాహసాలు కలిగి ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను ప్రధాని మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 10 రోజుల వ్యవధిలోనే ఇక్కడికి వచ్చే అవకాశం దక్కడం తనకు చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. విజ్ఞానాన్ని అగ్నికీలలతో కాల్చి బూడిద చెయ్యలేమని, ఇందుకు నలంద విశ్వవిద్యాలయమే ఒక ఉదాహరణ అని చెప్పారు. 21వ శతాబ్దంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని, ఆ శతాబ్దం ఆసియాదేనని, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని పునరుద్ఘాటించారు. విద్యా రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలే ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అగ్రరాజ్యాలుగా ఎదుగుతాయని, ఇది చరిత్ర చెబుతున్న సత్యం అని పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో మన దేశం ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అగ్రరాజ్య హోదాను అనుభవించిందని గుర్తుచేశారు. అప్పట్లో నలంద, విక్రమశిల వంటి విద్యాసంస్థలు ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయన్నారు.

గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మన వర్సిటీలు

భారత్‌ను ప్రపంచ వైజ్ఞానిక కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో భాగంగా చిన్నారుల్లో నవీన ఆలోచనలను ప్రోది చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 'అటల్ టింకరింగ్ ల్యాబ్'ల ద్వారా కోటి మందికిపైగా బాలలకు అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. చంద్రయాన్, గగన్‌యాన్ వంటి ప్రయోగాలు మన బాలబాలికల్లో సైన్స్ పట్ల ఉత్సకతను కలిగిస్తున్నాయని చెప్పారు. పదేళ్ల క్రితం మన దేశంలో కేవలం 100 స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 1.30 లక్షలు దాటేసిందని హర్షం వ్యక్తం చేశారు. రికార్డు స్థాయిలో పేటెంట్లు మనకు లభిస్తున్నాయని, రీసెర్చ్ పేపర్ల ప్రచురణలో ముందంజలో ఉన్నామని పేర్కొన్నారు. పరిశోధన, నవీన ఆవిష్కరణలకు మరింత ఊతం ఇవ్వడానికి రూ.లక్ష కోట్లతో ప్రత్యేక నిధిని ప్రకటించామన్నారు. గత పదేళ్లగా చూస్తే మన దేశంలో సగటున ప్రతి వారానికొక యూనివర్సిటీని నెలకొల్పినట్లు, ప్రతి పది రోజులకొక ఐటీఐని స్థాపించినట్లు తెలుస్తోందని నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజులకొక అటల్ టింకరింగ్ ల్యాబ్, ప్రతిరోజూ రెండు కొత్త కాలేజీలు ఏర్పాటయ్యాయని స్పష్టంచేశారు. ప్రస్తుతం 23 ఐఐటీలు, 21 ఐఐఎంలు, 22 ఎయిమ్స్‌లు ఉన్నాయన్నారు. గత పదేళ్లలో మెడికల్ కాలేజీ సంఖ్య రెండింతలు అయ్యిందన్నారు.

నలంద మహా విహార సందర్శన

బిహార్ రాష్ట్రం నలంద జిల్లా రాజ్‌గిర్‌లోని ప్రాచీన నలంద విశ్వవిద్యాలయ శిథిలాలలో కూడిన నలంద మహా విహారను ప్రధాని మోదీ బుధవారం సందర్శించారు. ఈ కట్టడం విశేషాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ మహా విహార యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందింది.



మోదీ వేలిపై సిరా గుర్తు ఉందా?

నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ ప్రారంభోత్సవంలో ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. వేదికపై బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రధాని మోదీ ఎడమ చేతిని కొద్దిసేపు పట్టుకొని చూశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసిన మోదీ చూపుడు వేలిపై సిరా గుర్తు ఇంకా ఉందా? అని పరిశీలించారు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నితీశ్ ఆకస్మిక చర్యకు మోదీ కూడా కొంత ఆశ్చర్యానికి గురైనట్లు కనిపించారు. అంతేకాదు ఆయన వెనుక ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు.

యూజీసీ-నెట్ రద్దు

పరీక్షలో అవకతవకలు జరిగి ఉండొచ్చన్న అనుమానాలు

- కేంద్ర విద్యా శాఖ ఆకస్మిక నిర్ణయం
- సమగ్ర దర్యాప్తు కోసం సీబీఐకి అప్పగింత
- త్వరలో మళ్లీ పరీక్షను నిర్వహించనున్న ఎన్‌టీఏ
- తేదీ, తదితర వివరాలు త్వరలో వెల్లడి

ज्ञान-विज्ञान विमुक्तये
UGC - NET

న్యూఢిల్లీ: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు చేపట్టిన నీట్ పరీక్షలో బయల్పడిన అవకతవకల నీలినీడలు యూజీసీ-నెట్ పరీక్ష పైనా పడ్డాయి. దీంతో మంగళవారం నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షను రద్దుచేస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ బుధవారం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గతానికి భిన్నంగా ఈసారి ఒక్కరోజులోనే ఆఫ్‌లైన్‌లో పెన్, పేపర్(ఓఎంఆర్) విధానంలో దేశవ్యాప్తంగా 317 నగరాలు, పట్టణాల్లోని 1,205 పరీక్షా కేంద్రాల్లో యూజీసీ-నెట్ పరీక్ష మంగళవారం జరిగిన విషయం తెల్సిందే. త్వరలో మళ్లీ నెట్ పరీక్షను నిర్వహిస్తారని, త్వరలోనే సంబంధిత వివరాలు వెల్లడిస్తామని కేంద్ర విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. '' నెట్ పరీక్ష విధానంలో అత్యంత పారదర్శకత, సమగ్రత, గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకూడదు. పరీక్షలో అక్రమాలు జరిగి ఉండొచ్చన్న విశ్వసనీయ సమాచారం మేరకు 'యూజీసీ-నెట్ జూన్ 2024'ను రద్దుచేస్తున్నాం'' అని ఆ అధికారి వివరించారు. ఈ ఏడాది నెట్ పరీక్షకు 11,21,225 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం పూర్తయిన ఈ పరీక్షను 9,08,580 మంది అభ్యర్థులు రాశారు. నెట్ పరీక్షలో అక్రమాలపై సమగ్ర దర్యాప్తు కోసం ఈ అంశాన్ని సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. నెట్ పరీక్షలో అక్రమాలు జరిగి ఉంటాయని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)కు ప్రభుత్వ సైబర్ నిఘా సంస్థల సమాచారం అందడంతో ఆ మేరకు పరీక్షకు రద్దుచేస్తున్నట్లు తెలిపింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ వివరాలను యూజీసీకి పంపింది. ఐ4సీలోని నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలైటిక్స్ విభాగం సంబంధిత సమాచారాన్ని క్రోడీకరించి యూజీసీకి అందజేసింది. ఈ విభాగం దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాల దాడులపై సమాచారం ఇవ్వడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా హెచ్చరిస్తుంది. ఐ4సీ అనేది కేంద్ర హోం శాఖ పరిధిలో పనిచేస్తుంది. ఇది పరీక్షల సంబంధ వ్యవహారాలను చూస్తుంది. నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీయే ఈ నెట్ పరీక్షనూ చేపట్టింది.

యూజీసీ-నెట్ ఎందుకు రాస్తారు?

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్- నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(యూజీసీ-నెట్) పరీక్షలో ఉత్తీర్ణులైతే సైన్స్ సబ్జెక్టుల్లో పరిశోధనకు అవకాశం లభిస్తుంది. పరిశోధన వైపు వెళ్లొచ్చు లేదంటే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బోధనారంగం వైపూ వెళ్లొచ్చు. దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరొచ్చు. శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి(సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో నడిచే ప్రయోగ, పరిశోధనాశాలల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా చేరొచ్చు. జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది. ఇలా శాస్త్రవేత్తగా ఎదగొచ్చు. పీహెచ్‌డీ చేసేందుకు అర్హత లభిస్తుంది. ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ వంటి సంస్థల్లోనూ ఉద్యోగాలు పొందొచ్చు. నెట్‌కు క్వాలిఫై అయిన వారికి విదేశాల్లోనూ చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నెట్ పరీక్షను ఏటా రెండు సార్లు నిర్వహిస్తారు. 80కిపైగా సబ్జెక్టుల్లో పరీక్ష రాసుకోవచ్చు.

కశ్మీర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. బారాముల్లాలోని వాటర్‌గామ్ ప్రాంతంలో టెర్రరిస్టులు తలదాచుకొన్నారనే సమాచారంతో బుధవారం భద్రతాబలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయని, తీవ్రవాదులు కాల్పులకు దిగడంతో ఎన్‌కౌంటర్ మొదలైందని అధికారవర్గాయి తెలిపాయి. కాల్పుల్లో మరణించిన తీవ్రవాదుల పేర్లు, వారు ఏ సంస్థకు చెందిన వారనే విషయాలను ఆరాతీస్తున్నారు. తీవ్రవాదుల కాల్పుల్లో ఒక పోలీసు, మరో జవానుకు గాయాలయ్యాయని వెల్లడించారు.

అమృత్‌పాల్ నిర్బంధం ఏడాది పొడగింపు

చండీగఢ్: సిక్కు తీవ్రవాద ప్రబోధకుడు అమృత్‌పాల్ సింగ్ నిర్బంధాన్ని ఏడాదిపాటు పొడగిస్తూ పంజాబ్ ప్రభుత్వం ఈనెల 3న ఉత్తర్వులు జారీచేసింది. అయితే బుధవారం వీటిని బహిరంగ పర్చారు. వారిస్ దే పంజాబ్ చీఫ్ అమృత్‌పాల్, అతని తొమ్మిది మంది అనుచరులు జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయ్యి ప్రస్తుతం అస్సాంలోని డిబ్రూగఢ్ జైలులో ఉన్నారు. జైలులో ఉంటూనే అమృత్‌పాల్ లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి సమీప కాంగ్రెస్ ప్రత్యర్థిపై 1.97 లక్షల మెజారిటీతో ఎంపీగా విజయం సాధించాడు. ఫలితాలు ఈనెల 4న వెలువడగా.. 3వ తేదీనే అమృత్‌పాల్ నిర్బంధాన్ని ఏడాదిపాటు పొడగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

తమిళనాడులో కల్తీ సారాకు

18 మంది బలి

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుమాపురం గ్రామంలో కల్తీ సారా తాగిన 18 మంది బుధవారం మరణించారు. మరో 90 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మృతులలో ప్రవీణ్, సురేష్, శేఖర్, మోహన్, జగదీశ్, సుబ్రమణియన్, మణి ఉన్నారు. మరో ముగ్గురు సాయంత్రం మృతి చెందారు. ఈ సమాచారంతో కల్తీ సారా, సారా సేవించిన వారంతా ఆస్పత్రులకు పరుగులు తీశారు. ప్రస్తుతం కళ్లకురిచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో సారా సేవించిన వారు 90 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో పది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని జిప్మర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, కల్తీ సారా తాగి మరణించినట్టుగా వైద్య పరీక్షల్లో తేలలేదని కళ్లకురిచ్చి కలెక్టర్ శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. కాగా ఘటనపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం జిల్లా ఎస్పీ సమయసింగ్ మీనాపై సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే కలెక్టర్ శ్రావణ్‌కుమార్‌ను బదిలీ చేసింది. 18 ప్రత్యేక వైద్య బృందాలను చెన్నై నుంచి కళ్లకురిచ్చికి పంపించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ జిల్లాలోని ఎక్సైజ్ విభాగం ఉన్నతాధికారులందరిపై వేటు వేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది.

నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు నివాళి

న్యూఢిల్లీ: ఖలిస్తానీ తీవ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ మృతి చెంది ఏడాది గడిచిన సందర్భంగా మంగళవారం కెనడా పార్లమెంటు నివాళులర్పించింది. హౌస్ ఆఫ్ కామన్స్‌లో సభ్యులు మౌనం పాటించారు. ఖలిస్తానీ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్) అధినేత నిజ్జర్ గత ఏడాది జూన్ 18న కెనడాలోని బ్రిటిష్ కొలంబియా గురుద్వారా ఎదుట జరిగిన కాల్పుల్లో హతమయ్యాడు. భారత ప్రభుత్వం ప్రకటించిన టెర్రరిస్టుల జాబితాలో నిజ్జర్ పేరు ఉంది. నలుగురు భారతీయులు నిజ్జర్ హత్య కేసులో నిందితులుగా ఉన్నారు. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ప్రమేయం ఉందని కెనడా ఆరోపిస్తోంది. అప్పటినుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. 1997లో నకిలీ పాస్‌పోర్ట్‌పై నిజ్జర్ కెనడాకు వెళ్లాడు. శరణార్థిగా కెనడా పౌరసత్వాన్ని కోరాడు. ఇది తిరస్కరణకు గురైంది. అనంతరం తాను కెనడాకు రావడానికి సహాయపడ్డ మహిళను నిజ్జర్ వివాహమాడి మరోమారు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోగా.. మళ్లీ తిరస్కరణకు గురైంది. అయితే నిజ్జర్ హత్యకు గురైన వెంటనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయో అతను కెనడా పౌరుడని పార్లమెంటులో చెప్పారు. నిజ్జర్ కేటీఎఫ్ కోసం నియామకాలు చేసుకొని.. వారికి శిక్షణ ఇస్తున్నాడని భారత భద్రతా సంస్థలు పేర్కొన్నాయి. నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు నివాళి అర్పించడంపై వాంకోవర్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. 1985లో ఎయిర్ ఇండియా కనిష్క విమానంలో ఖలిస్తానీ తీవ్రవాదులు బాంబులు అమర్చడంతో 329 ప్రాణాలు కోల్పోయారు. వారి స్మృత్యర్థం ఈనెల 23న (విమాన ఘటన 39 ఏళ్లు) సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

మరింత బలమైన మైత్రీబంధం

- ఒకరిపై దాడి జరిగితే తోటి దేశం సాయపడేలా ఒప్పందం
- ద్వైపాక్షిక చర్చలు జరిపిన పుతిన్, కిమ్


కానుకగా వచ్చిన లిమోజిన్ కారు డ్రైవింగ్ సీట్లో కిమ్, పక్కన పుతిన్

సియోల్: పశ్చిమ దేశాల ఆంక్షల కత్తులు వేలాడుతున్నా రష్యా, ఉత్తర కొరియాలు మైత్రిబంధంతో మరింత దగ్గరయ్యాయి. శత్రుదేశం తమపై దాడి చేస్తే తోటి దేశం సాయపడేలా కీలక ఒప్పందం కుదుర్చుకున్నారు. ద్వైపాక్షిక అంశాలపైనా విస్తృతస్థాయి చర్చలు జరిపి కొన్ని కీలక ఉమ్మడి ఒప్పందాలపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉ.కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ సంతకాలు చేశారు.

ఘన స్వాగతం పలికిన కిమ్

సరిగ్గా 24 ఏళ్ల తర్వాత ఉ.కొరియాలో పర్యటిస్తున్న పుతిన్‌కు ప్యాంగ్యాంగ్ నగర శివారులోని ఎయిర్‌పోర్ట్‌లో కిమ్ ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కిమ్-2 సంగ్ స్క్వేర్‌లో వేలాది మంది చిన్నారులు బెలూన్లు ఊపుతూ పుతిన్‌కు ఆహ్వానం పలికారు. సైనికుల నుంచి పుతిన్ గౌరవవందనం స్వీకరించారు. తర్వాత అక్కడే తన సోదరి కిమ్ యో జోంగ్‌ను పుతిన్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా అక్కడి విమోచనా స్మారకం వద్ద పుతిన్ నివాళులర్పించారు.

పలు రంగాలపై ఒప్పందాలు

'కుమ్‌సుసాన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్' అధికార భవనానికీ పుతిన్, కిమ్‌లు ఒకే కారులో వచ్చారు. ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సంస్కృతి, మానవ సంబంధాల రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. 1991లో సోవియట్ రష్యా పతనం తర్వాత ఇంతటి విస్తృతస్థాయిలో ఒప్పందాలు కుదుర్చుకోవడం ఇదే మొదటిసారి. 'ఈ ఒప్పందం అత్యంత పటిష్టమైంది. కూటమి అంత బలంగా ఇరుదేశాల సత్సంబంధాలు కొనసాగుతాయి. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి పూర్తి మద్దతు, సాయం ప్రకటిస్తున్నా'' అని కిమ్ అన్నారు. అయితే ఉ.కొరియా ఎలాంటి సాయం చేయబోతోందనేది కిమ్ వెల్లడించలేదు. '' మైత్రి బంధాన్ని సమున్నత శిఖరాలకు చేర్చే విప్లవాత్మకమైన ఒప్పందమిది. అయితే ఉ.కొరియాకు సైనిక సాంకేతిక సహకారం అనేది ఈ ఒప్పందంలో లేదు' అని పుతిన్ స్పష్టంచేశారు. ఇరుదేశాల సరిహద్దు వెంట వంతెన నిర్మాణం, ఆరోగ్యసంరక్షణ, వైద్య విద్య, సామాన్య శాస్త్ర రంగాల్లోనూ ఒప్పందాలు కుదిరాయని రష్యా ప్రకటించింది.

కారు నడిపిన పుతిన్, కిమ్

కుమ్‌సుసాన్ ప్యాలెస్‌కు బయల్దేరిన సందర్భంగా వారు ప్రయాణించిన లిమోజిన్ కారును పుతిన్ స్వయంగా నడిపారు. మార్గ మధ్యంలో ఒక చోట ఆగి పచ్చిక బయళ్లపై కొద్దిసేపు నడుస్తూ మట్లాడుకున్నారు. మార్గమధ్యంలో మరో చోట ఆగి పుతిన్‌కు కిమ్ టీ పార్టీ ఇచ్చారు. తర్వాత సంగీత కచేరీకి వెళ్లారు. తర్వాత కిమ్ సైతం పుతిన్‌ను వెంటబెట్టుకుని ఆ కారును నడిపారు. ఒప్పందాల తర్వాత పుతిన్ చిత్రపటం ఉన్న కళాఖండాలను పుతిన్‌కు కిమ్ బహూకరించారు. కిమ్‌కు పుతిన్ రష్యాలో తయారైన ఆరాస్ లిమోజిన్ కారు, టీ కప్పుల సెట్, నావికా దళ ఖడ్గాన్ని బహుమతిగా ఇచ్చారు. కిమ్‌కు పుతిన్ లిమోజిన్ కారును బహుమతిగా ఇవ్వడం ఇది రెండోసారి.

నీట్‌లో ఆరుగురి ఫస్ట్ ర్యాంకు గల్లంతు!

న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష-అండర్ గ్రాడ్యుయేట్(నీట్-యూజీ)లో కొందరు అభ్యర్థులకు కేటాయించిన గ్రేసు మార్కులను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సుప్రీంకోర్టుకు తెలియజేసిన నేపథ్యంలో టాప్ ర్యాంకర్లపై ప్రభావం పడబోతోంది. టాపర్లలో కొందరు 60 నుంచి 70 శాతం పాయింట్లు కోల్పోతారని అంచనా. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మంది ఫస్ట్ ర్యాంకు సాధించిన సంగతి తెలిసిందే. వీరిలో గ్రేసు మార్కులతో ఫస్ట్ ర్యాంకు పొందినవారు ఆరుగురు ఉన్నారు. గ్రేసు మార్కులను రద్దు చేస్తుండడంతో వీరు ఫస్టు ర్యాంకును కోల్పోనున్నట్లు సమాచారం. అంటే టాపర్ల సంఖ్య 61కి పరిమితం కానుందని అంచనా వేస్తున్నట్లు ఎన్‌టీఏ వర్గాలు వెల్లడించాయి. నీట్-యూజీలో అక్రమాలు జరిగాయని, 1,563 మందికి ఉద్దేశపూర్వకంగా గ్రేసు మార్కులు కేటాయించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అభ్యర్థుల మార్కులను ఎన్‌టీఏ పునర్ మూల్యాంకనం చేస్తోంది. గ్రేసు మార్కులను రద్దు చేసి, మళ్లీ ర్యాంకులు కేటాయించబోతున్నారు. గ్రేసు మార్కులు రద్దయిన వారికి ఈ నెల 23న మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా, నీట్ పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎన్‌టీఏ స్పష్టంచేసింది.

యథాతథంగా కౌన్సెలింగ్!

నీట్ కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలని, అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 6వ తేదీ నుంచి జరగాల్సిన కౌన్సెలింగ్ నిలిపివేసేందుకు నిరాకరించింది.

బీజేపీ గూటికి కిరణ్ చౌదరి

హరియాణా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ హరియాణాలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తలిగింది. ఎమ్మెల్యే కిరణ్ చౌదరి, ఆమె కూతురు శ్రుతి చౌదరిని కాంగ్రెస్‌ను వీడి బుధవారం బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బీజేపీ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైనీల సమక్షంలో వీరిద్దరూ కాషాయ కండువాలు కప్పుకున్నారు. కిరణ్ చౌదరి ఎమ్మెల్యే కాగా, శృతి హరియాణా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ. హరియాణా మాజీ ముఖ్యమంత్రి బన్సీలాల్ కోడలు కిరణ్. హరియాణా కాంగ్రెస్ పార్టీని సొంత జాగీరులా నడుపుతున్నారని తన బద్ధ విరోధి, మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడాపై కిరణ్ ధ్వజమెత్తారు.

నీళ్లు ఇవ్వకుంటే నిరాహార దీక్ష

- 21 లోగా మాకు నీళ్లివ్వండి
- ప్రధాని మోదీకి ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి ఆతిషి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జల సంక్షోభం రోజురోజుకి ఎక్కువౌతోంది. దాదాపు ప్రతీ ప్రాంతంలో నీటి కొరత నెలకొంది. నీటి సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నా.. రాజధాని వాసులకు ఊరట లభించడం లేదు. రాజకీయ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి ఆతిషి ప్రధాని నరేంద్ర మోదీకి బుధవారం లేఖ రాశారు. ఢిల్లీ ప్రజలకు నీటిని అందించాలని ఆతిషి అభ్యర్థించారు. ఢిల్లీకి 613 ఎంజీడీలను విడుదల చేయాల్సి ఉండగా.. మంగళవారం హరియాణా 513 ఎంజీడీలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఒక్క ఎంజీడీతో 28,500 మందికి నీటిని సరఫరా చేయవచ్చని, హరియాణా 100 ఎంజీడీలు ఆపడమంటే.. 28 లక్షల మందికి నీటిని నిరాకరించడమేనని పేర్కొన్నారు. ఢిల్లీకి జూన్ 21లోగా 100 ఎంజీడీల నీరు అందించాలని కోరారు. లేకపోతే జూన్ 21 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ఆమె లేఖలో స్పష్టం చేశారు. హరియాణా నుంచి అయినా, ఎక్కడి నుంచైనా ఢిల్లీ ప్రజలకు నీటిని అందించాలని ఆతిషి కోరారు.

ఎదురొడ్డి నిల్చున్నారు

జన్మదిన వేడుకల్లో రాహుల్‌ను పొగడ్తల్లో ముంచెత్తిన కాంగ్రెస్, 'ఇండియా' నేతలు


ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఖర్గే, పక్కన ప్రియాంక

న్యూఢిల్లీ: రాజ్యాంగం ప్రబోధించిన అంకితభావం, విలువలున్న రాహుల్ గాంధీ దేశంలో తమ వాణిని వినిపించలేకపోయిన కోట్లాది మందికి గొంతుకగా మారారని రాహుల్‌ను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పొగడ్తల్లో ముంచెత్తారు. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ 54వ పుట్టినరోజు వేడుకను పార్టీ కీలక నేతలు జరిపారు. ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్ తదితరుల సమక్షంలో రాహుల్ కేక్ కట్‌చేశారు. పెద్దసంఖ్యలో అక్కడికొచ్చిన కార్యకర్తలు రాహుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా తన పుట్టినరోజును ఘనంగా జరుపుకోవద్దని సామాజిక, దాతృత్వ కార్యక్రమాల్లో నిమగ్నమవ్వాలని పార్టీ కార్యకర్తలకు రాహుల్ పిలుపునిచ్చారు. '' కాంగ్రెస్ పాటించే సామరస్యం, భిన్నత్వంలో ఏకత్వం, తపన అన్నీ మీలో ప్రతిబింబిస్తున్నాయి. ప్రతి ఒక్కరి కన్నీటి కష్టాలు తుడిచేసి సత్యానికి ఉన్న శక్తిని చాటుతున్నారు' అని ఖర్గే 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. '' నా ప్రియమైన సోదరుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు. సమాజం కోసం పరితపించే విలక్షణమైన వ్యక్తి, నా స్నేహితుడు, మార్గదర్శకుడు, నేత' అంటూ ప్రియాంకా ట్వీట్‌చేశారు. ''ప్రియమైన సోదరుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రజల పట్ల మీకున్న అంకితభావం దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది' అని తమిళనాడు సీఎం స్టాలిన్ ట్వీట్‌చేశారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రూ.100 కోట్లు డిమాండ్ చేసిన కేజ్రీవాల్

- మా దగ్గర ఆధారాలున్నాయ్
- ఆయనకు బెయిల్ ఇవ్వొద్దు: ఈడీ
- కస్టడీ వచ్చే 3 దాకా పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లు డిమాండ్ చేశారని, ఇందుకు ఆధారాలున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు తెలియజేసింది. అప్రూవర్లు ఇచ్చిన స్టేట్‌మెంట్లను చట్టప్రకారం సాక్ష్యంగా పరిగణించవచ్చని వెల్లడించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో అధికారులు ఆయనను బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టారు. అలాగే కేజ్రీవాల్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ప్రత్యేక న్యాయమూర్తి బిందూ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. కేవలం కొందరు వ్యక్తులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేజ్రీవాల్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని ఆక్షేపించారు. సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లు వసూలు చేసినట్లు కొందరు చెబుతున్నారు తప్ప అందుకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. సౌత్ గ్రూప్ నుంచి ముడుపుల రూపంలో కేజ్రీవాల్ రూ.100 కోట్లు డిమాండ్ చేసినట్లు సీబీఐ విచారణలో తేలిందని ఈడీ వెల్లడించింది. ఆమ్ ఆద్మీ పార్టీ కోసం కేజ్రీవాల్ ఈ డబ్బు డిమాండ్ చేశారని పేర్కొంది. మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేరానికి పాల్పడింది కాబట్టి నాయకత్వం వహిస్తున్న కేజ్రీవాల్ ముమ్మాటికీ దోషి అవుతారని ఈడీ చెప్పింది. దీంతో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని వచ్చే నెల 3వ తేదీ దాకా పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. బెయిల్ పిటిషన్‌పై గురువారం కూడా వాదనలు కొనసాగుతాయి.

ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమే: సెంథిల్



తిరువళ్లూరు: ఈవీఎంల ట్యాంపరింగ్‌పై కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుమానాల వెనుక బలమైన కారణాలు ఉన్నాయని తిరువళ్లూరు పార్లమెంట్ సభ్యుడు, మాజీ ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను టార్గెట్ చేసి, కొన్ని వర్గాలకు పంచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మాతో పాటు సాధారణ ప్రజలకు కూడా అనుమానం ఉంది. తాము వేసిన ఓటు ఎక్కడికి వెళ్తుందోనని ఆలోచన చేసే స్థాయికి చేరారు. దేశంలో ఈవీఎంలు లేకపోయి ఉంటే బీజేపీ హ్యాట్రిక్ సాధించేదా..? అని ప్రశ్నించారు. ఈవీఎంలను నిషేధించాలన్న తమ పార్టీ విధానానికి ఇప్పటికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈవీఎంలను హ్యాక్ చేయడం కుదరదన్న వారే ఎలాన్ మస్క్ సవాలుకు తోక ముడిచారన్నారు.



అన్నీ.. తామై..
ఆన్‌లైన్‌లో సంప్రదిస్తే చాలు.. 'ఆ నలుగురు' అన్నీ తామై అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. శ్మశాన వాటికలు, సామగ్రి, రవాణా వరకు అన్ని ఏర్పాటు చేస్తారు. -10లో



బోర్డుల్లోనే 'వార్డు'లు
చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల్లో అధికారుల పేర్లతో ఫోన్‌నెంబర్ల బోర్డులు తప్ప ఫిర్యాదులు తీసుకోవడానికి ఎవరూ ఉండటంలేదు. -10లో

గరిష్టం/కనిష్టం 32.0/25.0

వాతావరణం
రానున్న 24 గంటల్లో నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. గరిష్ట ఉష్ణోగ్రత 32 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్‌గా ఉండనుంది.



నగరంలో ఇలాంటి తవ్వకాలెన్నో..

కిల్లర్.. సెల్లార్

- 2017లో కొండాపూర్‌లో ఓ భవన నిర్మాణానికి సంబంధించి 30 అడుగుల లోతున జరుగుతున్న సెల్లార్ పనుల్లో కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన భారతమ్మ, కిష్టమ్మ అనే ఇద్దరు మహిళలు మృతి చెందారు. వారి భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సెల్లార్ తవ్వకాల సందర్భంగా తీసుకోవాల్సిన రక్షణ చర్యలు తీసుకోనందునే ప్రమాదానికి కారణమని అధికారులు గుర్తించారు.
- 2019లో ఉప్పల్‌లో నిర్మాణంలో ఉన్న సెల్లార్‌లో పడి ఇద్దరు మైనర్ బాలురు మరణించారు. తగిన భద్రత ఏర్పాట్లు లేకపోవడంతో ఆడుకుంటూ ఒక బాలుడు సెల్లార్‌లో పడిపోయాడు. సెల్లార్ నీటితో నిండి ఉండటంతో అందులో మునిగి చనిపోయాడు. మిత్రున్ని కాపాడేందుకు ప్రయత్నించి మరో బాలుడు మృతి చెందాడు.
- 2020లో మాదాపూర్ ఖానామెట్‌లో ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు సెల్లార్ గుంతలో పడింది. రిటైనింగ్ వాల్ కూడా లేకపోవడమే అందుకు కారణం. విద్యార్థులను కళాశాల వద్ద దింపి తిరిగి వస్తున్నందున బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రాణాపాయాలు జరగలేదు. అక్కడా సెల్లార్ నిర్మాణంలో నిర్లక్ష్యమే కారణం.

ఇలా ప్రతియేటా సెల్లార్ల తవ్వకాల సందర్భంగా జరుగుతున్న ప్రమాదాల్లో కొందరు మరణిస్తున్నారు. పలువురు గాయాల పాలవుతున్నారు. సెల్లార్లలో జరుగుతున్న ప్రమాదాలు బయటకు రాకుండా ఉంటున్న ఘటనలు కూడా ఎన్నో ఉంటున్నాయి. అయినప్పటికీ అటు భవనాలు నిర్మించే రియల్టర్లు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదు. ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో షరామామూలుగా అక్రమ నిర్మాణాలు, వాటిల్లో భాగంగా అక్రమ సెల్లార్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అనుమతి తీసుకొని నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారితో పాటు ఎలాంటి అనుమతులు లేకుండానే సెల్లార్లు తవ్వుతున్న వారూ ఉన్నారు. - సాక్షి, సిటీబ్యూరో



నాగోలులో..

ఉల్లంఘనలెన్నో..

బడాబాబులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు మధ్య ఉన్న అవినాభావ ఆర్థిక సంబంధాల వల్లే ఉల్లంఘనులను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. వర్షాకాల సీజన్‌ను పురస్కరించుకొని ఈ నెల 1వ తేదీ నుంచే సెల్లార్ల తవ్వకాలపై నిషేధం విధించారు. సెల్లార్ల పనులు తుది దశలో ఉన్న వారు పటిష్ట రక్షణ ఏర్పాట్లతో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, ఆచరణలో అది కనిపించడం లేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వందల సెల్లార్ల పనులు జరుగుతున్నాయి. కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించగా ఇప్పటి వరకు 152 సెల్లార్ల తవ్వకాల్ని గుర్తించారు.

జాగ్రత్తలేవీ ?

- వర్షాకాలం ముగిసేంత వరకు సెల్లార్ల పనులు ఆపివేయాల్సి ఉన్నప్పటికీ, పనులు తుది దశలో ఉన్న వారు మాత్రం ప్రమాదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలతో పనులు చేయాలని అధికారులు పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

పార్కింగ్ కోసం స్టిల్ట్ ఫ్లోర్ నిర్మించాలన్నా ప్లాట్ విస్తీర్ణం కనీసం 200 చదరపు మీటర్లుండాలి. ప్లాట్ విస్తీర్ణం ఎంత ఉంటే ఏం నిర్మించవచ్చో ఆ వివరాలు ఇలా..

- 200–300 చ.మీ. : స్టిల్ట్‌ఫ్లోర్
- 300–400 చ.మీ. : స్టిల్ట్‌ఫ్లోర్
- 400–500 చ.మీ.: స్టిల్ట్‌ఫ్లోర్
- 500–750 చ.మీ. : స్టిల్ట్‌ఫ్లోర్
- 750–1000 చ.మీ: స్టిల్ట్‌ఫ్లోర్ +1 సెల్లార్
- 1000–1500 చ.మీ: స్టిల్ట్‌ఫ్లోర్ +2 సెల్లార్లు
- 1500–2500 చ.మీ.: స్టిల్ట్‌ఫ్లోర్ +2 సెల్లార్లు
- 2500 చ.మీ. అంతకు మించి ఉంటే: స్టిల్ట్‌ఫ్లోర్ +2 అంతకుమించి సెల్లార్లు

(వీటిలో రిటైనింగ్‌వాల్స్ ఉన్నవి ఉన్నాయి)

సెల్లార్ల నిర్మాణాలు.. వాటిలో చర్యలు తీసుకోనివి జీహెచ్‌ఎంసీ జోన్ల వారీగా..

జోన్	సెల్లార్లు	చర్యలు తీసుకోనివి
ఎల్‌బీనగర్	33	19
చార్మినార్	27	9
ఖైరతాబాద్	34	15
సికింద్రాబాద్	10	3
శేరిలింగంపల్లి	26	24
కూకట్‌పల్లి	22	10
మొత్తం	152	80

- అక్రమాలకు పేరుగాంచిన ఎల్‌బీనగర్ జోన్‌లో ఎక్కువ సెల్లార్లుండటాన్ని, సంపన్న ప్రాంతమైన శేరిలింగంపల్లిలో చర్యలు తీసుకోనివి ఎక్కువ సంఖ్యలో ఉండటాన్ని గుర్తించవచ్చు. ఇంకా చర్యలు తీసుకోవాల్సినవి సగానికి పైగా ఉండటం గమనార్హం.

షరామామూలుగా ఏటా ప్రమాదాలు

- కనీస రక్షణ చర్యలు కరువైన తీరు
- నగరంలో యథేచ్ఛగా సాగుతున్న వ్యవహారం
- బడా బాబులపై అధికారుల ఉదాసీన వైఖరి
- నిమ్మకు నీరెత్తినట్లుగా బల్దియా యంత్రాంగం
- ఈ నెల 1 నుంచి సెల్లార్ల తవ్వకాలపై నిషేధం
- వర్షాకాల సీజన్ నేపథ్యంలో కమిషనర్ నిర్ణయం
- జీహెచ్‌ఎంసీ పరిధిలో వందలాదిగా జరుగుతున్న పనులు
- 152 సెల్లార్ల తవ్వకాల్ని గుర్తించిన అధికారులు
- వీటికి అడ్డుకట్ట వేయడమే తక్షణ కర్తవ్యం

ఇందులో భాగంగా నేల బలంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలి. పనులు చేసే చోట రిటైనింగ్‌వాల్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లు చేయాలి. సెల్లార్ తవ్వి వదిలేసిన ప్రాంతాల్లో పరిసరాల్లోని నిర్మాణాలు పటిష్టంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్లార్ గుంతను నిర్మాణ వ్యర్థాలతో నింపివేయాలి. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ సీఅండ్‌డీ వేస్ట్ వింగ్ సహకారం తీసుకోవచ్చు.

- సెల్లార్ తవ్వే ప్రాంతాల్లో, ముఖ్యంగా వాలు ప్రాంతాల్లో నేల జారిపోకుండా అవసరమైన పటిష్టత చర్యలు చేపట్టాలి. ఇందుకుగాను ఇసుకబస్తాలు వినియోగించడంతోపాటు నైలింగ్, గ్రౌటింగ్‌లు చేయాలి. సెల్లార్ల తవ్వకాలకు చుట్టూ 3 మీటర్ల సెట్‌బ్యాక్ వదలాలి. ఇది పై లెవెల్ సెల్లార్‌కు కాగా, దిగువ లెవెల్స్‌కు వెళ్లే కొద్దీ అదనంగా మరో 0.5 మీటర్ల చొప్పున సెట్‌బ్యాక్ వదలాలి. అధిక బరువున్న సామగ్రిని సెల్లార్ ప్రాంతాల్లో వేయరాదు. సెల్లార్ల సమీపంలోకి భారీ వాహనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్లార్ తవ్వకం ప్రాంతాన్ని నిత్యం పరిశీలిస్తూ, ఎక్కడైనా బలహీనంగా ఉన్నా, జారిపోయేలా ఉన్నా వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పగుళ్ల తదితరాలను గుర్తించి తగిన పరిష్కార చర్యలు చేపట్టాలి. సెల్లార్ తవ్వే ప్రాంతంలోకానీ, ఇరుగు పొరుగు భవనాల్లో భూమి కదులుతున్నట్లు గ్రహిస్తే యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపట్టాలి.

రిటైనింగ్ వాల్స్ లేకుండానే..

కనీసం తాత్కాలిక రిటైనింగ్ వాల్ కూడా లేకుండా ప్రమాదాలకు ఆస్కారమిస్తూ తవ్వకాలు జరుగుతున్న సెల్లార్లు నగరంలో సర్కిళ్ల వారీగా.. కాప్రా–5, ఉప్పల్–4, హయత్‌నగర్–3, ఎల్‌బీనగర్–6, సరూర్‌నగర్–4, చార్మినార్–1, ఫలక్‌నుమా–1, రాజేంద్రనగర్–2, మెహదీపట్నం–3, గోషామహల్–6, ఖైరతాబాద్–8, జూబ్లీహిల్స్–9, ముషీరాబాద్–5, అంబర్‌పేట–2, బేగంపేట–1, యూసుఫ్‌గూడ–1, చందానగర్–5, మూసాపేట–1, కూకట్‌పల్లి–3, కుత్బుల్లాపూర్–2, గాజుల రామారం–3, అల్వాల్–1,
మొత్తం– 76

పట్టని సెట్‌బ్యాక్ నిబంధనలు

సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ సెల్లార్లు తవ్వుతుండటంతోనూ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సెల్లార్ తవ్వకాలు జరిపేటప్పుడు ఆ ప్రభావం పరిసరాల్లోని ఇతర భవనాలపై పడుతుంది. ఏడేళ్ల క్రితం నానక్‌రామ్‌గూడలో భవనం కూలి పదిమందికి పైగా మరణించిన ప్రమాదానికి భవన యజమాని అక్రమంగా నిర్మాణం చేపట్టడంతో పాటు పొరుగున్న ఉన్న మరో భవనం సెల్లార్ పనులు జరుగుతుండటం కూడా కారణమని గుర్తించారు.

నిషేధంపై ఆలోచనలు

నగరంలో నాలుగు సెల్లార్ల వరకు అనుమతులు తీసుకుంటున్నారు. ఒక్కో సెల్లార్ కోసం దాదాపు మూడు మీటర్ల లోతు తవ్వుతున్నారు. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండంతో సెల్లార్ల తవ్వకాలను నిషేధించాలని గతంలో సెల్లార్ల ప్రమాదాలు జరిగినప్పుడు ఆలోచనలు చేశారు. సెల్లార్లు తవ్వకుండా పైఅంతస్తుల్లోనే పార్కింగ్ ఏర్పాట్లు చేసే వారికి ఆమేరకు అదనపు అంతస్తులు నిర్మించుకునేందుకు అనుమతులిచ్చే యోచన కూడా చేశారు. ఆ తర్వాత అది ముందుకు సాగలేదు.

నిబంధనలిలా..

- సెల్లార్ తవ్వాలంటే రెసిడెన్షియల్ ప్లాట్ల విస్తీర్ణం కనీసం 750 చదరపు మీటర్లుండాలి. వాణిజ్య భవనాలకు 500 చదరపు మీటర్లుండాలి.
- చాలామందికి సెల్లార్‌కు, స్టిల్ట్‌కు తేడా తెలియదు. రెండూ పార్కింగ్ కోసం వినియోగించేవే అయినప్పటికీ, భూమి కింద వాటిని సెల్లార్లుగా, భూమిపై పార్కింగ్‌కు వినియోగించే ఫ్లోర్‌ను స్టిల్ట్ ఫ్లోర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టం చేశారు.

నోటీసులిచ్చాం



తనిఖీల్లో సెల్లార్ల తవ్వకాన్ని నిలిపివేయడంతోపాటు పనులు తుది దశలో ఉన్న ప్రాంతాల్లో వర్షం నీరు వెళ్లేందుకు డీ వాటరింగ్ ప్రెషర్ పంపుల్ని అందుబాటులో ఉంచాల్సిందిగా, పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు చేయాల్సిందిగా నోటీసులిచ్చాం. రిటైనింగ్ వాల్స్ లేకుండా, ప్రమాదకరంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలుంటాయి.
– రాజేంద్రప్రసాద్ నాయక్, చీఫ్ సిటీప్లానర్, జీహెచ్‌ఎంసీ

కన్నతండ్రే కాలయముడు

కామవాంఛ తీర్చలేదని బాలికను చంపేశాడు
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మియాపూర్: తన కామవాంఛ తీర్చలేదన్న కోపంతో ఓ కన్నతండ్రి ఉన్మాదిగా మారాడు. కూతురు తలను బండరాయికి కొట్టి కిరాతకంగా హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ దుర్గా రామలింగ ప్రసాద్‌లు వెల్లడించిన ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట్ లక్ష్మా తండాకు చెందిన బానోత్ నరేష్, శారద దంపతులు. వీరికి కుమారుడు, ఏడో తరగతి చదువుతున్న కూతురు వసంత ఉన్నారు. వీరు బతుకుదెరువును వెతుక్కుంటూ ఈ నెల 1వ తేదీన నగరంలోని మియాపూర్ నడిగడ్డ తండాకు వచ్చారు. నరేష్ డెలివరీ బాయ్‌గా, శారద స్థానికంగా ఇళ్లల్లో పని చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం నరేష్, శారద దంపతులు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఉన్న బాలిక వసంత, ఆమె సోదరుడు గొడవపడ్డారు. బాలిక సొంత ఊరుకు వెళ్దామని పదేపదే అంటూ ఉండేది. ఈ క్రమంలో అన్నతో గొడవపడిన వసంత ఇంట్లోంచి బయటికి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని పక్కింటివారు ఆమె తండ్రి నరేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే నరేష్ ఇంటికి వచ్చి కూతురు కోసం వెతకసాగాడు. నడిగడ్డ తండా సమీపంలోని మార్గమధ్యలో అతడికి కూతురు కనిపించింది. అమ్మ పని చేసే చోటికి వెళ్దామని చెప్పి కూతురును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు.



నిందితుడు బానోత్ నరేష్

బాలికను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి..

మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు వెంబడి ద్విచక్ర వాహనంపై వెళ్తూ మార్గమధ్యలోని కాళికామాత దేవాలయం వద్ద నరేష్ తన ద్విచక్ర వాహనాన్ని యూటర్న్ తీసుకుని వెనక్కి వచ్చాడు. నడిగడ్డ తండా ఎదురుగా రోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని నిలిపివేశాడు. వంట చేయడానికి కట్టెలు తీసుకువద్దామని కూతురుతో చెప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లాడు. కొంతదూరం చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి నరేష్ తన కామవాంఛ తీర్చాలని బాలికపై ఒత్తిడి చేయగా ఆమె ఒప్పుకోలేదు. ఈ విషయం తల్లికి చెబుతానని గట్టిగా అరవడంతో కూతురు వెంట్రుకలు పట్టుకుని గట్టిగా కొట్టడంతో ముక్కులో నుంచి రక్తం వచ్చింది. బాలిక బతికి ఉంటే.. విషయం ఇంట్లో చెబితే తన పరువుపోతుందని భావించిన నరేష్.. బాలిక తలను బండరాయికి మోది అతి కిరాతకంగా హత్యచేసి ద్విచక్ర వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. కూతురును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడం, తిరిగి ఒక్కడే రావడం తదితర దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

ఏమీ ఎరగనట్టుగా పోలీసులకు ఫిర్యాదు..

నరేష్ ఇంటికి వెళ్లి తన ఒంటిపై ఉన్న టీ షర్ట్ మార్చుకున్నాడు. భార్య శారద వద్దకు వెళ్లి కూతురు వసంత ఇంట్లోంచి వెళ్లిపోయిందని చెప్పాడు. అక్కడి నుంచి మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కూతురు కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 13న రాత్రి సమయంలో నడిగడ్డ తండా సమీపంలోని చెట్ల పొదల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతదేహంపై ఉన్న దుస్తులను చూసి వసంతగా గుర్తించారు. సీసీ కెమెరాలను పరిశీలించి కన్నతండ్రే నిందితుడిగా తేల్చారు. పోలీసులకు ఎలాగైనా విషయం తెలిసిపోతుందని భావించిన నరేష్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కన్నకూతురును తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

నిధుల లేమితో పనుల కుదింపు

రూ. 5135 కోట్ల నుంచి రూ.459 కోట్లకు తగ్గిన పనులు

- ఎస్ఎన్‌డీపీ– 2కు ప్రాధాన్యతలతో ప్రతిపాదనలు
- పథకం పేరు మార్పు..

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో కాలనీల ముంపు సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) రెండో దశ పనులు తగ్గించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పథకం మొదటి దశ పనులు దాదాపుగా పూర్తి కావస్తుండటంతో రెండో దశ పనులకు తొలుత రూ.5135 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఆ మేరకు తగినన్ని నిధులు జీహెచ్‌ఎంసీ ఖజానాలో లేకపోవడం, ఇతరత్రా మార్గాల ద్వారా సైతం అన్ని నిధులు అందే అవకాశాలు కనిపించకపోవడంతో ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకొని రూ. 459 కోట్లకు కుదించి తాజాగా ప్రతిపాదనలు రూపొందించారు.

ఏ జోన్‌లో ఎన్ని పనులు

ముంపు సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతనిస్తూ ఎల్‌బీనగర్ జోన్‌లో రూ.131.61 కోట్లతో ఏడు పనులు, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలో రూ.120.47 కోట్లతో తొమ్మిది పనులు, శేరి లింగంపల్లి జోన్‌లో రూ.102.89 కోట్లతో ఏడు పనులు, కూకట్‌పల్లి జోన్‌లో రూ.103 కోట్లతో ఆరు పనులకు డీపీఆర్‌లు పూర్తయ్యాక టెండర్లు పిలిచి ఎంపికైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించనున్నారు.



పథకం పేరు మార్పు

2020లో కురిసిన భారీ వర్షాలతో పలు ప్రాంతాలు, కాలనీలు నీట మునగడం, ఇళ్లు నీళ్లలో మునిగిపోవడం, రోడ్లు చెరువులవడం తెలిసిందే. కాలనీలు, ఇళ్లలోకి నీళ్లు వెళ్లకుండా సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎన్‌డీపీ పేరిట మొదటి దశగా రూ.985.45 కోట్ల అంచనా వ్యయంతో పనులు పనులు చేపట్టారు.వాటిల్లో పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మిగతావి పూర్తయ్యే దశలో ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ పేరును మార్చి హెచ్–సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్– నాలా కాంపొనెంట్) పేరిట ఈ పనులు చేయడానికి సిద్ధమైంది.

కట్టుకున్నోడే కడతేర్చాడు

అనుమానమే పెనుభూతమైంది..
- కన్నకూతుళ్ల ముందే భార్యను చంపిన భర్త
- 24 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ

అడ్డగుట్ట: కట్టుకున్న భార్యను కన్నకూతుళ్ల ముందే కత్తితో పొడిచి చంపాడు. తల్లిని చంపొద్దని కుమార్తెలు ఎంత బతిమిలాడినా వినిపించుకోకుండా హతమార్చి పరారైన భర్తను పోలీసులు 24 గంటల్లో అదుపులోకి తీసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు చెప్పిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ధర్మారం రోడ్డు బసంత్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్ (34), రోజా (31)కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ప్రభు(9) గుండమ్మ (6) నిరీక్షణ (4) ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుమారుడు ప్రభు రెసిడెన్షియల్ హాస్టల్‌లో చదువుతుండగా ఇద్దరు కుమార్తెలు తల్లిదండ్రులతోనే ఉంటున్నారు. లక్ష్మణ్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో రోజా భర్తను వదిలేసి పిల్లలు, తల్లి లక్ష్మమ్మను తీసుకొని 15 నెలల క్రితం నగరానికి చేరుకుంది. నాలుగు నెలల క్రితం అడ్డగుట్టలోని రెండు గుళ్ల (పోచమ్మ దేవాలయం) సమీపంలోని అద్దె ఇంట్లో దిగింది.



కూతుళ్లు గుండమ్మ, నిరీక్షణ

సికింద్రాబాద్‌లోని ఓ వస్త్ర దుకాణంలో రోజా, ఆమె తల్లి లక్ష్మమ్మ స్థానికంగా ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నారు.

భోరున విలపిస్తున్నా.. కనికరించలేదు..

ఈ క్రమంలో ఇరవై రోజుల క్రితం రోజా రామగుండం వెళ్లి తన భర్త లక్ష్మణ్‌ను అడ్డగుట్టకు తీసుకువచ్చింది. అయినా లక్ష్మణ్ ప్రవర్తనలో మార్పు రాలేదు. నిత్యం మద్యం తాగి వచ్చి భార్య, అత్తలతో గొడవ పడేవాడు. మంగళవారం (ఈ నెల 18న) రాత్రి 9 గంటల ప్రాంతంలో అడ్డగుట్టలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసే తన అత్త లక్ష్మమ్మతో గొడవ పడ్డాడు. అదే



రోజా (ఫైల్)



నిందితుడు లక్ష్మణ్

ఆవేశంతో ఇంటికి వెళ్లి భార్య రోజాతోనూ ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో వంట చేయడానికి రోజా కూరగాయలు తరుగుతోంది. ఇద్దరు కుమార్తెలు కూడా ఇంట్లోనే ఉన్నారు. ఈ క్రమంలో కూరగాయలు కోసే కత్తితో రోజా కడుపులో పొడిచాడు. రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసి పిల్లలు భోరున విలపిస్తున్నా కనికరం లేకుండా భార్య కాలుపై, ముఖంపైనా కత్తితో దాడి చేసి ఆమె ప్రాణాలు తీశాడు. అనంతరం, ఇద్దరు కుమార్తెలను తీసుకొని అడ్డగుట్ట డీ సెక్షన్ కమిటీహాల్ వైపు వెళ్లాడు. అక్కడ పార్క్ చేసి ఉన్న ఓ ఆటో వద్ద పిల్లలను వదిలేసి అక్కడి నుంచి పరారయ్యాడు. పిల్లలు ఏడవడాన్ని గమనించిన స్థానికులు విషయం తెలుసుకొని తుకారాంగేట్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొదటి నుంచి తన భార్యపై అనుమానంతో ఉన్న భర్త లక్ష్మణ్ పథకం ప్రకారమే రోజాను హత్య చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ధర్మారం వెళ్లి.. అదుపులోకి తీసుకుని..

భార్యను హత్య చేసిన లక్ష్మణ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. తన స్వగ్రామమైన రామగుండంలోని ధర్మారానికి వెళ్లినట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు రామగుండం వెళ్లిన పోలీసులు బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మహేశ్వరం మెడికల్ కాలేజీలో.. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు

మంగళ్‌పల్లిలో ప్రైవేట్ భవనంలో ఏర్పాట్లు

- వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో శిక్షణ
- మొదట 50 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయనున్న మెడికల్ కౌన్సిల్
- ఒకటి రెండు రోజుల్లో ఎన్ఎంసీ రాక.. ఏర్పాట్ల పరిశీలన



మీర్‌ఖాన్‌పేటలో మెడికల్ కళాశాల నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం (ఫైల్)

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో అడ్మిషన్లు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గాంధీ మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణను కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించిన వైద్య ఆరోగ్యశాఖ.. తాజాగా అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ, శిక్షణ వంటి అంశాలపై దృష్టిసారించింది. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఈ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు భూమి కేటాయించిన విషయం తెలిసిందే. గత ఏడాది అక్టోబర్‌లో శంకుస్థాపన కూడా చేశారు. వరుస ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంగళ్‌పల్లి సమీపంలోని ఐదు అంతస్తుల ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో జాతీయ వైద్య మండలి బృందం ఈ భవనాన్ని తనిఖీ చేయనుంది. తరగతుల నిర్వహణ, విద్యార్థుల వసతి, పరిపాలన సౌలభ్యం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేదా వంటి అంశాలను పరిశీలించనుంది.

ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనుండటంతో ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ అర్హులైన వైద్య సిబ్బందిని నియమించే ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే 22 మంది సీనియర్ రెసిడెన్సీలతో పాటు ఐదుగురు డ్యూటీ డాక్టర్లను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించింది. మరో 27 మంది టెక్నీషియన్ల నియామకానికి కూడా రంగం సిద్ధం చేసింది.

ఔట్ సోర్సింగ్ ప్రాతిపాదికన నియామకం

ప్రస్తుతం ఈ నియామక ఫైలు కలెక్టర్ వద్దే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. తొలి ఏడాది 50 సీట్లు భర్తీ చేయనుంది. ఆ తర్వాత సీట్ల సంఖ్యను పెంచనుంది. ఇదిలా ఉంటే మహేశ్వరం మెడికల్ కాలేజీకి గత ప్రభుత్వం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సర్వే నం.112లో 20 ఎకరాలు కేటాయించింది. రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ భవనం, రూ.400 కోట్లతో ఆస్పత్రి భవనం నిర్మించాలని భావించి, ఆ మేరకు అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేశారు.

వనస్థలిపురంలో తరగతులు

- నిబంధనల మేరకు కొత్తగా వైద్యకళాశాల ఏర్పాటు చేయాలంటే ఐదేళ్లకు సరిపడు మౌలిక సదుపాయాలను ముందే చూపించాలి.
- కాలేజీకి సమీపంలో అనువైన టీచింగ్ ఆస్పత్రి కూడా ఉండాలి. అది కూడా 20 కిలోమీటర్ల లోపే ఉండాలి.
- నిజానికి తొలుత కందుకూరు, మహేశ్వరం పరిసరాల్లోని ఏదైనా అద్దె భవనంలో ఈ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ పరిసరాల్లో అనువైన భవనం అందుబాటులో లేకపోవడం, షాద్‌నగర్ ఆస్పత్రి మెడికల్ కాలేజీకి సుదూరంగా ఉండటం, సమీపంలోని మహేశ్వరం ఆస్పత్రిలో విద్యార్థుల నిష్పత్తి మేరకు పడకలు లేకపోవడంతో మంగళ్‌పల్లిని ఎంచుకున్నారు.
- ఓ ప్రైవేటు కాలేజీ యాజమాన్యం మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు భవనం నిర్మించింది. అయితే, అనుమతులు రాకపోవడంతో భవనం ఖాళీగా ఉండిపోయింది. లక్ష చదరపు అడుగులు అవసరం కాగా, ఇక్కడ 1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం ఉండటం కలిసొచ్చే అంశంగా మారింది.
- అడ్మినిస్ట్రేషన్, తరగతుల నిర్వహణ, హాస్టళ్లకు సరిపడే గదులు అందుబాటులో ఉండటమే కాకుండా దీనికి సమీపంలోనే వంద పడకల సామర్థ్యంతో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి కూడా ఉంది. వైద్య విద్యార్థుల శిక్షణ కోసం ఆస్పత్రిలోని పడకల సామర్థ్యాన్ని 250 పడకలకు పెంచనున్నారు. రెండో సంవత్సరం నుంచి శేరిగూడలో తరగతులు నిర్వహించి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఓపీ, ఐపీ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

కేన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు

- ఔట్ పేషెంట్లకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్
- చికిత్స ఖర్చు 50 శాతం మేర తగ్గుతుంది: డాక్టర్ రవీంద్రబాబు

సాక్షి, సిటీ బ్యూరో: కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి విప్లవాత్మక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎముక మజ్జ మార్పిడి (బీఎంటీ) చికిత్సను ఔట్ పేషెంట్లకు కూడా అందిస్తున్నట్లు తెలిపింది. తెలంగాణ, ఏపీలోనే ఈ రకమైన సేవలు తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చామని అపోలో ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. బుధవారం అపోలో ఆస్పత్రి కేన్సర్ విభాగంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఔట్ పేషెంట్ బీఎంటీ సేవల ద్వారా కేన్సర్ నయం అయిన నేహా కుమారి అనుభవాలు, ఔట్‌పేషెంట్ బీఎంటీ ద్వారా ఎలాంటి సేవలు అందిస్తున్నారో డాక్టర్లు వివరించారు. ఔట్‌పేషెంట్ బీఎంటీ ద్వారా లింఫోమా, మల్టిపుల్ మైలోమాతో పాటు హెమటోలాజికల్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. ఈ పద్ధతిలో రోగులు త్వరితగతిన కోలుకునే అవకాశం ఉంటుందని డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర బాబు వివరించారు. సాధారణంగా కేన్సర్ సోకిన వారు చికిత్స కోసం నెలల తరబడి ఆస్పత్రుల్లోనే ఉండాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని, కానీ ఔట్ పేషెంట్ బీఎంటీ ద్వారా ఆ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చామని వెల్లడించారు. దీంతో రోగుల చికిత్సకు అయ్యే ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. రోగి ఆస్పత్రిలో ఉంటే ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అదే రోగిని ఇంటికి పంపిస్తే ఇన్ఫెక్షన్లు గణనీయంగా తగ్గుతాయని హెమాటో ఆంకాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ పద్మజా లోకిరెడ్డి తెలిపారు.

అణచివేతను పెంచే కొత్త చట్టాలను వెనక్కి తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సీనియర్ పాత్రికేయుడు వేణుగోపాల్

పంజగుట్ట: పౌరుల హక్కులను కాలరాసి..ప్రజలపై అణచివేతను పెంచే కొత్త నేర చట్టాలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మరో 10 రోజుల్లో కొత్త నేర చట్టాలు అమలుచేస్తున్న నేపథ్యంలో అన్ని ప్రజా సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా, ట్రాన్స్ జెండర్ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పౌర హక్కులను మరింత అణచివేసే కొత్త నేర చట్టాలు ఎవరి ప్రయోజనం కోసం?' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్, వేణుగోపాల్, ఐక్యవేదిక నాయకులు విమలక్క, ఖలీదా పర్వీన్, కృష్ణవేణి, రుక్మిణి, వసుంధరలు మాట్లాడుతూ 2023 డిసెంబర్ 20వ తేదీన ఎన్‌డీఏ ప్రభుత్వం మూడు కొత్త నేర చట్టాలను ప్రవేశపెట్టి ఎలాంటి చర్చలకు అవకాశం లేకుండా వాటిని ఆమోదించుకుందని, ఈ మూడు చట్టాలు జులై 1వ తేదీ నుండి అమలులోకి రానున్నాయని తెలిపారు. ది నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ సమాచారం ప్రకారం ఇప్పటికే పూర్వ చట్టాల పరిధిలో కిందిస్థాయి కోర్టు నుండి, హైకోర్టు, సుప్రీం కోర్టు వరకు సివిల్, క్రిమినల్ కేసులు కలిపి 50 లక్షలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అవన్నీ పరిష్కారం అయ్యేందుకు రెండు నుండి మూడు దశాబ్దాలు పడుతుందన్నారు. 170 సంవత్సరాల నాటి చట్టాలు రద్దుచేసి పరిస్థితులకు అనుగుణంగా కొత్త చట్టాలు తెచ్చామని చెప్పుకుంటున్న పాలకులు మార్చిన చట్టాలు పూర్తిగా అర్థం చేసుకుని..చదివి తీర్పులు ఇచ్చేసరికి ఇంకా ఎన్నికేసులు పెండింగ్‌లో పడతాయని ప్రశ్నించారు. కొత్తగా తెచ్చిన చట్టాలు సామాన్య పౌరుల ప్రాణాలకు, స్వేచ్ఛకు హాని కలిగించే విధంగా ఉన్నాయని, భావప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలపడానికి ప్రదర్శనలు జరిపే స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దిద్దుబాటలో జీహెచ్ఎంసీ

'ఫేక్' రికగ్నిషన్ అటెండెన్స్‌లో అవకతవకలు అరికట్టేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికుల హాజరు నమోదులో అవకతవకలు సరిదిద్దే చర్యలు చేపట్టారు. 'ఫేక్ రికగ్నిషన్' శీర్షికతో 'సాక్షి'లో వెలువడిన కథనానికి స్పందిస్తూ ,కొన్ని సందర్భాల్లో 'స్పూఫ్ డిటెక్షన్ (మోసాన్ని గుర్తించడం)' పనిచేయలేదని జీహెచ్ఎంసీ వివరణనిచ్చింది. సంబంధిత ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) యాప్ ప్లేస్టోర్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలతో యాప్ పనిచేయలేదని జీహెచ్ఎంసీ పేర్కొంది. దాంతో హాజరు నమోదులో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపింది. ఆ సమస్యను పరిష్కరించామని, యాప్‌ను అప్‌డేట్ చేశామని పేర్కొంది. ఒకసారి హాజరు నమోదయ్యాక, కార్మికులు క్షేత్రస్థాయిలో ఉండకపోవడాన్ని కూడా సమీక్షించామని, ఈ పరిస్థితి నివారణకు త్వరలోనే చర్యలు ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఇందుకుగాను కార్మికులు క్షేత్రస్థాయిలో ఉన్నప్పుడు మరోమారు కూడా హాజరును ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొంది. ఒక సూపర్‌వైజర్ పరిధిలోని ఐదుమంది కార్మికులకు ర్యాండమ్‌గా ఈ హాజరును తీసుకోనున్నట్లు తెలిపింది.

9 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.కరుణాకర్‌రెడ్డికి లాలాగూడ, కె.సత్యనారాయణను బండ్లగూడ, ఎస్.శ్రేయను సౌత్ ఈస్ట్‌జోన్ మహిళ ఠాణాకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా నియమించారు. బి.శ్రీనివాసరావును బండ్లగూడ, షేక్ జహంగీర్ యాదవ్‌ను ఆసిఫ్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. పల్లె పద్మను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, షకీర్ అలీని అసెంబ్లీ సెక్యూరిటీకి, జె.మహేందర్‌రెడ్డిని సిటీ సెక్యూరిటీ వింగ్‌లకు బదిలీ చేశారు. ఇటీవల ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన పి.మహేందర్‌ను మల్టీ జోన్-2కు రిలీవ్ చేశారు.

స్టార్ ఆస్పత్రిలో ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్

రాయదుర్గం: స్టార్ ఆస్పత్రి ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం అభినందనీయమని ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో 'స్టార్ ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం స్టార్ ఆస్పత్రి నగరంలో ప్రవేశపెట్టిన 10 అధునాతన కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టార్‌లో అత్యవసర సేవలు ఆధునికతను సంతరించుకోవడం గొప్ప విషయమన్నారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ మన్నం మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా తాము రోగులకు అత్యంత మెరుగైన సేవలందిస్తున్నామని చెప్పారు. స్టార్ ఆస్పత్రి ఎమర్జెన్సీ మెడిసిన్ గ్రూప్ లీడ్ డాక్టర రాహుల్ కట్టా, ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'డ్రగ్స్ రవాణా' అంటూ సైబర్ చీటింగ్

హిమాయత్‌నగర్: డ్రగ్స్ అక్రమ రవాణాలో మీ మొబైల్ నెంబర్ వినియోగించారంటూ బెదిరించి ఓ రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..నగరానికి చెందిన 78 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి 'మీ మొబైల్ నంబర్‌ను డ్రగ్స్ స్మగ్లింగ్‌లో ఉపయోగించారు. అందువల్ల మీ నంబర్‌ను బ్లాక్ చేస్తాం' అని ట్రాయ్ నుంచి సందేశం వచ్చింది. ట్రాయ్‌కి చెందిన సీనియర్ అడ్వైజర్ మాట్లాడుతున్నామని చెబుతూ సిమ్ కార్డును పొందేందుకు మీ ఆధార్ నంబర్ ఉపయోగించారని, ఆ తర్వాత 200 జామ్ బ్యాగ్‌ల ఎండీఎంఏ డ్రగ్స్‌ను రవాణా చేయడానికి ఉపయోగించారని చెప్పారు. అనంతరం ముంబై సైబర్ క్రైమ్ పోలీసులమంటూ కేటుగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. ఇంటికి పోలీసు సిబ్బందిని పంపిస్తామని, కదలికలపై నిఘా పెట్టి బయటకు వెళ్లనివ్వబోమని బెదిరించారు. తమకు రూ.10 లక్షలు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడు భయపడి..స్నేహితుల వద్ద డబ్బులు తీసుకుని ఆర్టీజీఎస్ ద్వారా మోసగాళ్ల ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం ఇది మోసమని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

తప్పుడు ట్వీట్ చేసిన మహిళపై కేసు నమోదు

నాగోలు: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసి ప్రశ్నించిన ఓ మహిళపై విద్యుత్‌శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్‌బీ నగర్ ఏరియా ప్రాంతంలో 7 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయిందంటూ ఎక్స్ వేదికగా స్థానిక మహిళ రేవతి ట్వీట్ చేసింది. దీన్ని గమనించిన విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయంపై వివరాల కోసం హయత్‌నగర్ సబ్ డివిజన్ ఆటోనగర్ సబ్‌స్టేషన్ ఆపరేషన్ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న దిలీప్‌కు మంగళవారం సాయంత్రం 5 గంటలకు మెసేజ్ చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలో 6 నెలల షీట్స్‌ను పరిశీలించారు. ఆయన పరిశీలనలో 7 గంటల పాటు విద్యుత్ సరఫరాకు ఏనాడూ అంతరాయం కలగలేదని తేలింది. దీంతో విద్యుత్ అంతరాయం కలిగిందంటూ ఉద్దేశపూర్వకంగా టీజీఎస్‌పీడీసీఎల్‌పై ఎక్స్ వేదికగా తప్పుడు ఆరోపణ చేశారని ఏఈ దిలీప్ ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అసత్య వార్త ప్రచారం చేసి..టీజీఎస్‌పీడీసీఎల్ ప్రతిష్టకు భంగం కలిగించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా..పోలీసులు బుధవారం రేవతిపై సెక్షన్ 505 ఐపీసీ అండ్ సెక్షన్ 66(డీ) ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

సైదాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ మెయిల్ ద్వారా వినతి పత్రాన్ని పంపారు. అనంతరం కళ్యాణ్‌నగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించాలని ఆయన వివరించారు. అయితే ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వేలాది రూపాయలను ఫీజులుగా వసూలు చేస్తూ చట్టాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ చేయకపోవడం సరికాదని అన్నారు.

కుక్కల దాడిలో జింకపిల్ల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన జింక

శంషాబాద్ రూరల్: తప్పిపోయి వచ్చిన జింక పిల్లపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పాల్మాకుల శివారులో ఉన్న ఓ తోట నుంచి బుధవారం ఉదయం జింక పిల్ల తప్పిపోయి బయటకు వచ్చింది. దీన్ని కుక్కలు వెంబడించడంతో చాలా దూరం పరుగెత్తి అలిసిపోయిన ఓ చోట కుప్పకూలిపోయింది. తర్వాత కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమివేశారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా.. అక్కడకు చేరుకున్న అధికారులు జింకను పరిశీలించగా..అప్పటికే మృతి చెందింది.

శాలిబండలో యువకుడి హత్య

చాంద్రాయణగుట్ట: పాత కక్షల కారణంగా నలుగురు సోదరులు కత్తులతో దాడి చేసిన సంఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలాపత్తర్‌కు చెందిన అన్వర్, అసద్‌లు పాత నేరస్థులు. అదే ప్రాంతంలో వాజిద్, సాజిద్ సోదరులతో పాటు వారి కజిన్ బ్రదర్స్ ఖదీర్, రఫిక్ సిమ్లాన్ కూడా నివాసం ఉంటారు. ఈ రెండు గ్రూప్‌ల నడుమ పాత గొడవలున్నాయి. బుధవారం తెల్లవారుజామున మాట్లాడుకుందామంటూ అన్వర్ సోదరులు వాజిద్‌ను తాడ్‌బన్‌లోని ఫాతిమా ఆసుపత్రి వద్దకు పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న వాజిద్ సోదరులు కూడా అక్కడికి వెళ్లారు. మాట్లాడుకునే క్రమంలో మాటామాటా పెరిగింది. దీంతో రెచ్చిపోయిన అన్వర్, అసద్‌లు వాజిద్ సోదరులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన రఫిక్ సిమ్లాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శాలిబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సిబ్బంది శ్రమకు సీపీ గుర్తింపు




పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో భాగంగా అంకిత భావంతో పని చేసిన అధికారులు, సిబ్బందిని కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎలక్షన్ సెల్, పోస్టల్ బ్యాలెట్ వింగ్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్, ఐటీ అండ్ కమ్యూనికేషన్స్, కంట్రోల్ రూమ్, ఐటీ సెల్ తదితర విభాగాలకు చెందిన సిబ్బందికి రివార్డులు అందించారు.
– సాక్షి, సిటీబ్యూరో

ఎన్టీఆర్ 'ఇంటి' వివాదం మళ్లీ డీఆర్‌టీకి..

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని జూనియర్ ఎన్టీఆర్ ఇంటి పై బ్యాంకులకు హక్కులు ఉన్నాయని డీఆర్‌టీ ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టివేసింది. మరోసారి విచారణ చేపట్టి ఇరు పక్షాల వాదనలు వినాలని ఆదేశించింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని 681 చదరపు గజాల భూ వివాదంలో డీఆర్‌టీ(రుణ వసూలు ట్రిబ్యునల్) తీర్పును సవాల్ చేస్తూ ప్రముఖ హీరో జూనియర్ ఎన్టీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. డీఆర్‌టీ ఉత్తర్వులు సరికాదని.. కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం ముందు బుధవారం విచారణకు వచ్చింది. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్ ను మళ్లీ డీ ఆర్ టీ కి పంపింది. 2003లో సుంకు గీత తదితరుల నుంచి ఎన్టీఆర్ ఈ భూమిని కొనుగోలు చేశారు. 2007లో చట్టప్రకారం అన్ని అనుమతులు పొందిన తర్వాతే ఇంటిని నిర్మించారు. 2012లో సర్ఫేస్ యాక్ట్ ప్రకారం ఎస్‌బీఐ డీఆర్‌టీ నుంచి అనుమతులు పొంది.. ఆ భూమి తమదంటూ నోటీసులు జారీ చేసింది. 2013 తర్వాత మరికొన్ని బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. దీన్ని సవాల్ చేస్తూ ఎన్టీఆర్ డీఆర్‌టీలో పిటిషన్ దాఖలు చేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బ్యాంకులతో పాటు సుంకు గీత, తదితరులపై కేసు నమోదు చేశారు. రుణాల విషయాలను చెప్పకుండా భూమిని విక్రయించినట్లు విచారణలో బయటపడింది. మరోవైపు విచారణ చేపట్టిన డీఆర్‌టీ బ్యాంకులకే ఆ భూమిపై హక్కులు ఉంటాయని చెప్పింది. ఎన్టీఆర్ భూమి కొనుగోలు చేసే నాటికే అది తనాఖాలో ఉందని పేర్కొంది. డీఆర్‌టీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎన్టీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

బోర్డు తిప్పేసిన సాఫ్ట్‌వేర్ కంపెనీ

రోడ్డున పడ్డ 100 మంది ఉద్యోగులు



మూతపడ్డ రైల్ వరల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ

గచ్చిబౌలి: ఉత్తమ శిక్షణ, ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మించిన ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఉద్యోగులు రోడ్డున పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ వెంకన్న తెలిపారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌లో రైల్ వరల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ మే 24న కార్యకలాపాలు ప్రారంభించింది. శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కో వ్యక్తి నుంచి రూ.40 నుంచి రూ.50 వేలు వసూలు చేశారు. కాగా గత ఐదు రోజులుగా కంపెనీని మూసివేశారు. మిగతా రాష్ట్రాలలో వాకబు చేయగా కంపెనీ మూసివేస్తే అక్కడా కేసులు అయ్యాయని తెలుసుకొని బాధితులు అవాక్కయ్యారు. కొందరు బాధితులు బుధవారం రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు వంద మంది నుంచి రూ.18 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, దేశవ్యాప్తంగా ఎంత మందిని మోసం చేశారో తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బెంగళూరు, ముంబై, పూణే,ఇండోర్, రాయపూర్, హైదరాబాద్‌లలో బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఒకే రోజు అన్ని బ్రాంచ్‌లను మూసినట్లు ఆయన వివరించారు. ఇది ఇలా ఉంటే దేశ వ్యాప్తంగా 800 మంది బాధితులు ఉంటారని, రూ.ఐదు కోట్ల వరకు వసూలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. బెంగళూర్‌లో ఉండే రైల్ వరల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రకాశ్ సింగ్‌తో పాటు మరికొందరిపై కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్రద్ధాంజలి



కీ॥శే॥ తలసాని శంకర్ యాదవ్ గారు

మోండా మార్కెట్ కూరగాయల వర్తక సంఘం అధ్యక్షులు

జననం: 08-03-1963 మరణం: 10-06-2024

"ఎందరో పేదవారికి అండగా నిలబడిన మీ సేవాభావం మాకు ఆదర్శనీయం
మోండా మార్కెట్‌కు ప్రెసిడెంట్‌గా మీరు అందించిన సేవలు చిరస్మరణీయం"

ఆ మహాత్ముడిని కోల్పోయిన వారి అమ్మగారు తలసాని లలిత భాయ్, సతీమణి విజయలక్ష్మి, కుమారుడు శివలాల్ యాదవ్, కోడలు రజిని, మనువడు సారీష్ యాదవ్ (సాండీ) సోదరుడు **తలసాని శ్రీనివాస్ యాదవ్** (MLA) మరియు **తలసాని కుటుంబ సభ్యులందరికీ** మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ఎల్లప్పుడూ బలమై నిలబడతామని తెలుపుకుంటూ, వారికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరుకుంటూ .. బాధాతప్త హృదయాలతో

వియ్యంకుడు-వియ్యపురాలు: **వల్లాల చిన్న శ్రీశైలం యాదవ్ - కస్తూరి**
కూతురు - అల్లుడు: **వల్లాల వర్ష-నవీన్ యాదవ్**, మనువడు: **వల్లాల అన్ష్ యాదవ్**
కూతురు - అల్లుడు: **ఎర్రగుడ్ల వైశాలి యాదవ్-ప్రభాకర్ యాదవ్**
మనుమరాండ్లు: ఎర్రగుడ్ల నిత్య యాదవ్, శ్రీ యాదవ్, మనువడు: ఎర్రగుడ్ల క్రిష్ యాదవ్

వల్లాల వారి కుటుంబ సభ్యులు

వి.సత్యనారాయణ యాదవ్-విజయలక్ష్మి
వి.రమేష్ యాదవ్-వసంత
వి.లక్ష్మి యాదవ్
వి.ప్రవీణ్ యాదవ్ (వెంకట్)
వి.రిషి యాదవ్-ఐశ్వర్య యాదవ్
వి.మౌనిక యాదవ్, వి.శ్రావణి యాదవ్
వి.సౌందర్య యాదవ్, వి.మల్లిక యాదవ్
వి.వెన్నెల యాదవ్, వి.ఆరవ్ యాదవ్

జె.అశోక్ యాదవ్ - జయలక్ష్మి
ఎం.ఆంజనేయులు యాదవ్ - నాగలక్ష్మి
పి.గోవర్ధన్ యాదవ్ - రాజ్యలక్ష్మి
పి.మల్లేష్ యాదవ్ - ధనలక్ష్మి

బీసుపల్లి వారి కుటుంబసభ్యులు

బి.మల్లేశం యాదవ్-మంగమ్మ
బి.మహేష్ యాదవ్-ధనలక్ష్మి
బి.మహేందర్ యాదవ్-వనజ
బి.యాదగిరి యాదవ్-రాణి
బి.భాను చందర్ యాదవ్-నవిత
బి.నర్సింగ్ యాదవ్-సుధ
బి.శ్రీకాంత్ యాదవ్-పూజ
బి.రాజ్ మల్లేష్ యాదవ్-సువర్ణ
బి.విహన్ యాదవ్, వి.ఈషాన్ యాదవ్
బి.వేద్ యాదవ్, బి.బృవన్ యాదవ్
బి.ఆద్విక్ యాదవ్

నక్కా వారి కుటుంబ సభ్యులు

ఎన్.ఉమేష్ యాదవ్-సావిత్రి
ఎన్.శ్రీనివాస్ యాదవ్-సుఖన్య
ఎన్.రాహుల్ యాదవ్-శైలజ
ఎన్.రాహి యాదవ్
ఎన్.సాహస్ యాదవ్
ఎన్.స్వయం (రాఖీ) యాదవ్

కొల్లా అరవింద్ యాదవ్-నవనీత
బాతుక రవి యాదవ్-అనిత
గుర్రాల మధు యాదవ్-వాణి
మూసాపేట్ అరవింద్ యాదవ్-ప్రియాంక
పూచబోయిన అశోక్ యాదవ్-లత
యం.ప్రవీణ్ యాదవ్

పెద్దకర్మ: 20-06-2024,
గురువారం మధ్యాహ్నం 12:00 గం॥లకు

Lunch Follows

కార్యస్థలం: SVITఆడిటోరియం (మహబూబ్ కాలేజ్) ప్యాట్నీ సెంటర్, సికింద్రాబాద్ నందు పెద్దకర్మ జరుపబడును.

స్వర్గీయ తలసాని శంకర్ యాదవ్ గారు మీ తలపు లేని రోజు గడవదు మాకు, మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరలని కోరుకుంటూ మీకు ఇవే మా ఘన నివాళులు

ఆర్‌బీవీఆర్‌ఆర్‌లో కొత్త కోర్సులు

సాక్షి, సిటీబ్యూరో: రావ్‌బహద్దూర్ వెంకట్రామారెడ్డి (ఆర్‌బీవీఆర్‌ఆర్) మహిళా కళాశాల ఈ ఏడాది నుంచి బీకాం ఫైనాన్స్, బీఏ (హెచ్ఈపీ), బీఎస్సీ బయోలజీ, డేటా సైన్స్, కెమిస్ట్రీ ప్రోగ్రాంలు అందిస్తున్నామమని కళాశాల ప్రిన్సిపాల్ అచ్యుతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 1954లో ఏర్పాటైన ఈ కళాశాల మహిళా సాధికారత, స్వయంప్రతిపత్తి, స్వావలంబన కోసం కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని అత్యుత్తమ కళాశాలలలో ఆర్‌బీవీఆర్‌ఆర్ ఒకటని పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలో ఎన్ఏఏసీ (NAAC) ఏ గ్రేడ్‌తో గుర్తింపు పొందిన మొదటి కళాశాల అని తెలిపారు. భారత దేశంలో బీఎస్సీ బయాలజీ కోర్సు అందిస్తున్న మొదటి కళాశాలగా గుర్తింపు తెచ్చుకున్నామని పేర్కొన్నారు. కళాశాల పేద, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.

వ్యవసాయ వర్సిటీకి అరుదైన అవార్డు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కలుపు యాజమాన్య పరిశోధన విభాగంలో అత్యుత్తమ అవార్డును దక్కించుకుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌లో అఖిల భారత కలుపు యాజమాన్య సంస్థ మూడు రోజుల పాటు వార్షిక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి గాను హైదరాబాద్ కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.రామ్ ప్రకాశ్, డాక్టర్ పద్మలు ఒడిశా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పీ.కే రౌల్, డైరెక్టర్ ఆఫ్ వీడ్ రీసెర్చ్ సంచాలకులు డాక్టర్ ఎ.కె.నాయక్ చేతుల మీదుగా బుధవారం ఈ అవార్డును అందుకున్నారు.

అనుకోకుండా ఆర్టిస్టునయ్యా...



ఫిక్కీ సభ్యులతో అరవింద్ విజయ్ మోహన్

పంజగుట్ట: 'నేను చిత్రకళా ఉపాధ్యాయుల కుటుంబానికి చెందిన వాడిని, కళాప్రపంచంలో పెరిగాను, నా ప్రమేయం లేకుండానే ఈ రంగంలో స్థిరపడ్డాను'అని ఆర్టరీ ఇండియా, లగ్జరీ బ్రాండ్ స్టోరీ క్రాఫ్ట్స్‌మ్యాన్ వ్యవస్థాపకుడు, సీఈవో అరవింద్ విజయ్ మోహన్ తెలిపారు. బుధవారం ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో సోమాజిగూడ పార్క్ హోటల్‌లో మాగ్నెటిక్ బ్రాండ్స్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగ్జరీ అనేది మానసిక స్థితి, జీవన విధానమని, ట్రెండ్‌లకు అనుగుణంగా కాకుండా చేసే కొత్తవాటిని సృష్టించడంలో ముందువరసలో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విజయ్ మోహన్ తన జీవిత అనుభవాలను, బ్రాండ్ కథలను, బ్రాండ్ నైపుణ్యం, అనేక విజయవంతమైన అంతర్జాతీయ బ్రాండ్‌ల కథనాల గురించి వివరించాడు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియా గజ్జర్ ఆయనను ఘనంగా సత్కరించారు.

జూలై 7న ఎమ్మార్పీఎస్ రజతోత్సవాలు

పంజగుట్ట: జూలై 7వ తేదీన రవీంద్రభారతిలో మాదిగ మేధావులు, కళాకారులు, విద్యావంతులు, కవులు, గాయకులతో కలిసి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఎమ్ఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దండోరా ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కుటుంబాలకు ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దండోరా ఆవిర్భవించి 30 సంవత్సరాలు అవుతున్నా ఇంకా ఆశయం సాధించుకోలేక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గెల్వయ్య మాదిగ, నాయకులు గుర్రాలు శ్రీనివాస్, మోహన్, మేడి రమణ, నాగారం బాబు, చింత బాబు, యాదయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్‌కు డబ్బులిచ్చి ఫోన్ పట్టుకెళ్లాడు

వెంగళరావునగర్: వృద్ధుడికి టిఫిన్ తినడానికి డబ్బులిచ్చి ఓ యువకుడు ఫోన్‌తో ఉడాయించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... చింతల్‌బస్తీకి చెందిన జి.బలరామ్ అనే వృద్ధుడు మంగళవారం మైత్రీవనం వచ్చి రైల్వే రిజర్వేషన్ చేసుకుని బస్టాప్ వద్ద నిలబడ్డాడు. ఈ సమయంలో యువకుడు వచ్చి ఎక్కడకు వెళుతున్నావని ప్రశ్నించగా జీడిమెట్లకని చెప్పాడు. తాను అటే వెళ్తున్నానని చెప్పడంతో అతడితో పాటు వృద్ధుడు బయలుదేరాడు. మూసాపేట బ్రిడ్జి సమీపంలో ఓ హోటల్ ముందు వాహనాన్ని ఆపిన యువకుడు రూ.200 ఇచ్చి టిఫిన్ తీసుకురావాలని చెప్పి, కాల్ చేసుకోవడానికి మొబైల్ ఫోన్ ఇవ్వాలని కోరాడు. దాంతో వృద్ధుడు అతనికి ఫోన్ ఇచ్చి టిఫిన్ కోసం వెళ్ళాడు. బలరాం తిరిగి వచ్చేలోగా ఆ యువకుడు ఫోన్ తీసుకొని పరారయ్యాడు. జరిగిన మోసాన్ని గుర్తించిన వృద్ధుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నీ తామై..

'ఆ నలుగురు' నుంచి అంత్యక్రియల వరకు సేవలు
ఆదాయమార్గంగా కార్పొరేట్ కర్మకాండ
బడ్జెట్ చెబితే చాలు.. చకచకా పనులు
నగరవాసులకు అందుబాటులో క్రిమేషన్ సర్వీసెస్ సంస్థలు

ఆన్‌లైన్‌లో సంప్రదిస్తే చాలు.. 'ఆ నలుగురు' మొదలు అన్నీ తామై అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు.. సంప్రదాయాలు, బడ్జెట్ చెబితే చాలు.. శ్మశానవాటికలు, సామగ్రి, రవాణా వరకు అన్ని ఏర్పాటు చేస్తారు.. గూగుల్ సెర్చ్‌కి వెళ్లి క్రిమేషన్ సర్వీసెస్ అని సెర్చ్ చేస్తే చాలు... నగరంలో ఏఏ ప్రాంతాల్లో అటువంటి సర్వీసులు అందుబాటులో ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది.. చార్జీలు మాట్లాడుకుంటే చాలు.. ఆత్మబంధువులు అవుతారు ఫ్యునరల్ సర్వీసెస్ సంస్థల నిర్వాహకులు. అంతిమయాత్ర కూడా ఆదాయమార్గంగా మారిన వైనంపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

నగరంలో పేరెన్నికగన్న మిఠాయి దుకాణంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. అతడి స్వస్థలం బీహార్‌లోని ఓ కుగ్రామం. నగరంలో అతడికి నా అనేవారు లేకపోవడంతో యాజమాన్యం రంగంలోకి దిగి పోస్టుమార్టం వగైరాలు చేయించింది. మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చి అక్కడ అంత్యక్రియలు జరిపించాలని ఓ సంస్థతో కాంట్రాక్ట్ మాట్లాడుకుంది. సాయంత్రమయ్యే నాటికి సమీప ఎయిర్‌పోర్టుకు మృతదేహాన్ని తరలించారు ఆ సంస్థ నిర్వాహకులు. అక్కడ్నుంచి అంబులెన్స్‌లో అదేరోజు అర్ధరాత్రికి మృతుడి స్వస్థలానికి చేర్చారు. ఉదయంకల్లా అంత్యక్రియలు పూర్తి చేశారు ఆ సంస్థ ప్రతినిధులు. అంతా ఆన్‌లైన్ పేమెంట్‌లతోనే పని జరిగింది.

నగరంలో నివసిస్తున్న యువ సాఫ్ట్‌వేర్ మురళీకృష్ణ నాయనమ్మ ఓ రోజు కాలం చేసింది. అసలే నగరంలో తెలిసిన వాళ్లు లేరు. మిత్రుల సాయం కోరడం ఇబ్బందిగా అనిపించింది. వెంటనే ఈ విషాదం నుంచి తేరుకుని చేతిలోని సెల్‌ఫోన్‌లో ఫ్యునరల్ సర్వీసెస్ ఇన్ హైదరాబాద్ అని గూగుల్‌లో సెర్చ్ చేశాడు అంతే... నాయనమ్మ అంత్యక్రియలకు పాడె మోసే 'ఆ నలుగురు'మొదలు అంత్యక్రియలు పూర్తి చేసేందుకు అవసరమైనవారితో పాటు అన్ని రకాల వస్తువులూ అందుబాటులోకి వచ్చాయి. యూజర్ చార్జెస్ చెల్లించినా ఏ లోటు లేకుండా తన నాయనమ్మ అంతిమసంస్కారాలు, కర్మలు శాస్త్రోక్తంగా, ప్రశాంతంగా పూర్తి చేసుకోగలిగాడు మురళీకృష్ణ.



సికింద్రాబాద్: కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో ఆత్మీయుల భౌతికకాయాలకు అంతిమ సంస్కారం నిర్వహించడం కష్టతరం. మతాలు, కులాలు, సంస్కృతులు, సంప్రదాయాలకు అనుగుణంగా అంత్యక్రియలు నిర్వహించడం మరింత క్లిష్టతరం. ఉద్యోగం, వ్యాపారం కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నగరంలో స్థిరపడిన కుటుంబాల పరిస్థితి మరీ ఇబ్బందికరం. అంత్యక్రియలు, కర్మకాండలు ఎలా, ఎక్కడ పూర్తి చేయాలో, వాటి గురించి ఎవరిని అడగాలో తెలియదు. 'ఇటువంటి విషాదకర సందర్భాల్లో చింతించాల్సిన పనిలేదు.. మీకు అండగా మేం ఉంటాం'అంటున్నాయి పలు క్రిమేషన్ సంస్థలు. గూగుల్ సెర్చ్‌కి వెళ్లి క్రిమేషన్ సర్వీసెస్ అని ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తే చాలు.. నగరంలో ఏఏ ప్రాంతాల్లో అటువంటి సర్వీసులు అందుబాటులో ఉన్నాయో ఇట్టే తెలిసిపోతుంది. వాటి ఫోన్ నెంబర్ల ఆధారంగా వివరాలు తెలుసుకుని సంప్రదిస్తే అంత్యక్రియలు పూర్తి చేసి పెడతారు.

ఆ నలుగురు కూడా...

పాడె కట్టెలు తేవడం, వాటిని కట్టడం, శ్మశానవాటికలకు భౌతికకాయాలను తరలించడం, అంతిమ యాత్ర వాహనాలు, అవసరమైతే పాడె మోసే ఆ నలుగురిని కూడా ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. అద్దె గృహాల్లో ఉండేవారికి కర్మకాండలు చేయడం కూడా ఒక ప్రహసనమే. ఇటువంటి వారికి వేదికలు, అర్చకులను ఏర్పాటు చేసి ప్రశాంతంగా, తృప్తిగా చివరి సేవలు నిర్వహించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

భద్రపరచడం, తరలించడం....

నగరంలో మృతి చెందినవారి భౌతికకాయాలను కొన్ని సందర్భాల్లో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలించాల్సి ఉంటుంది. ఒక్కోసారి దేశ, విదేశాల నుంచి బంధువులు రావాల్సిన ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లోనూ ఇంటివద్దే భౌతికకాయాలను భద్రపరుచడం కోసం ఫ్రీజర్లు, మృతదేహాలను తరలించడానికి ఫ్రీజర్లతో కూడిన అంబులెన్స్‌లు, భౌతికకాయం కొద్ది రోజులపాటు చెడిపోకుండా ఉంచడం కోసం ఎంబామింగ్ సేవలు అందిస్తున్నాయి.

సేవాభావంతోనే నిర్వహిస్తున్నాం

అంత్యక్రియలను మేం వ్యాపారం కన్నా సేవాభావంతోనే నిర్వహిస్తాం. ఈ సేవల గురించి ఎంతమాత్రం తెలియనివారు మమ్మల్ని ఆశ్రయిస్తుంటారు. అయినా అందినంత దండుకునే ప్రయత్నం చేయం. ప్రాంతాలు, శ్మశానవాటికల దూరం, వాహన వినియోగాన్ని బట్టి మాత్రమే చార్జీలు వేస్తాం.

-మహేశ్, క్రిమేషన్ ఆర్గనైజర్

మంచి డిమాండ్ ఉంది

నేను ఇంజినీరింగ్ చదివాను. నలుగురు మిత్రుల సహాయంతో క్రిమేషన్ సంస్థను ఏర్పాటు చేశాను. నగరంలో అంతిమ సంస్కారాలు, భౌతికకాయం భద్రపర్చడం, తరలింపు వంటి సేవలు నిర్వహిస్తున్నాం. తొలుత ఈ వ్యాపారం ఇబ్బందికరం అనిపించినా క్రమేణా తృప్తికరంగా మారింది.

- రవీందర్‌కుమార్, క్రిమేషన్ కన్సల్టెంట్

అన్ని రకాల సేవలు

సుశిక్షితులైన బృందాలతో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నాం. డెడ్‌బాడీ ట్రాన్స్‌పోర్టు, పురోహితులు, ప్రీస్టుల సేవలు అందిస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా మమ్మల్ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత స్లాట్ బుక్ చేసుకుంటే సేవలు అందిస్తాం.

-మురళీధర్, ఫ్రీజర్ సప్లయర్

చెత్త వేస్తే కెమెరా పట్టేస్తుంది

చెత్త పాయింట్ వద్ద నిఘా



ఉప్పల్ ఎస్‌బీహెచ్ పార్క్ చెత్త డంపింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాను ఏర్పాటు చేసిన సిబ్బంది, డీసీ

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ పార్కు వద్ద ఉన్న డంపింగ్ యార్డును అధికారులు ఎత్తివేశారు. చెత్త వేయకుండా ఉండేందుకు హెచ్చరికలు జారీ చేస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు నిరంతరం నిఘాకు సీసీ కెమెరా విత్ సైరన్‌ను ఏర్పాటు చేశారు. చెత్తవేసే వారిని ఈ సీసీ కెమెరా గుర్తించి ఫొటో తీసుకునే విధంగా ఆధునిక టెక్నాలజీని వాడుతూ యంత్రాన్ని అమర్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఎవరైనా ఇక నుంచి ఇక్కడ చెత్త వేస్తే భారీగా జరిమానా విధించనున్నట్లు తెలిపారు. చెత్తవేసే వారిని పసిగట్టి చిత్రం తీసి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక నుంచి అన్ని ప్రాంతాల్లో చెత్తకుండీలను ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. ఇంటి యజమానులు చెత్తను స్వచ్ఛ కార్మికులకు అందజేయాలని సూచించారు. అలాకాకుండా రోడ్లపై చెత్త వేస్తే భారీగా జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ చందన, శానిటరీ సూపర్‌వైజర్లు సుదర్శన్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో 'లీడింగ్ ది వే' వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభించిన వెంకటనర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో బుధవారం ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లీడింగ్ ది వే – నావిగేట్ ది ఎమర్జింగ్ ట్రెండ్స్ ఆఫ్ ఏఐ, ఎలక్ట్రిఫికేషన్ అండ్ ఐఓటీ ఇన్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్‌పై ఒకరోజు వర్క్‌షాపు జరిగింది. దీనిని జేఎన్‌టీయూ, మ్యాథ్ వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సెమినార్‌కు కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం.మాధవీలత వ్యవహరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో అనేక కొత్త ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలు వస్తున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉంటూ కొత్త విషయాలను నేర్చుకొని బోధిస్తే విద్యార్థులకు చాలా ఉపయోగకరమని అన్నారు. యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ అధిపతి డాక్టర్ ఎ. రజని తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పరిచయమై.. ఆదుకుంటానంటూ..

- మాయమాటలతో బాలికపై లైంగికదాడి
- నిందితుడితోపాటు సహకరించిన మహిళ అరెస్టు



నిందితుడు సాయికృష్ణ



సహకరించిన హోం ఉద్యోగి లక్ష్మీ

చిలకలగూడ: ఆస్పత్రిలో పరిచయమయ్యాడు. ఆపదలో అన్నివిధాలా ఆదుకుంటానన్నాడు. ప్రేమ, పెళ్లి అంటూ మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకుని పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. చివరికి కటకటాలపాలయ్యాడు. నిందితుడితో పాటు సహకరించిన మహిళపై పోలీసులు బుధవారం కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ సీఐ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం... నార్త్‌లాలాగూడకు చెందిన బాలిక(14) అమ్మమ్మతో కలిసి ఉంటోంది. అస్వస్థతకు గురైన అమ్మమ్మను 2022లో మెట్టుగూడలోని ఓ ఆస్పత్రిలో చేర్పించింది. ఈ క్రమంలో ఆస్పత్రిలో మల్కాజ్‌గిరి మీర్జాలగూడకు చెందిన సాయికృష్ణ (25) బాలికకు పరిచయమయ్యాడు. ఆపదలో ఆదుకుంటానని, ప్రేమ పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి బాలికను లోబరుకున్నాడు. ఎవరూలేని సమయంలో ఇంటికి తీసుకెళ్లి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన బాలిక పెద్దమ్మ సాయికృష్ణను హెచ్చరించి, బాలికను పాతబస్తీలోని ఎంబీ ఫౌండేషన్‌లో 2022 డిసెంబర్‌లో చేర్పించింది. అనంతరం ఈ ఏడాది జనవరిలో సికింద్రాబాద్ మేడిబావి అమన్‌వేదిక రెయిన్‌బో హోంలో బాలిక చేరింది. హోంలో పనిచేసే లక్ష్మీ అనే ఉద్యోగి ఫోన్ నుంచి సాయికృష్ణకు ఆ బాలిక కాల్ చేసి తాను ఉంటున్న చిరునామా చెప్పింది. లక్ష్మీతో పరిచయం పెంచుకున్న సాయికృష్ణ ఆమె ఫోన్ నుంచి తరచూ బాలికతో మాట్లాడేవాడు. కొన్ని రోజుల క్రితం కొత్త ఫోన్, సిమ్‌కార్డును లక్ష్మీ ద్వారా బాలికకు అందించాడు. ఈ నెల 10న రెయిన్‌బో హోంకు సాయికృష్ణ వచ్చి లక్ష్మీ సహాయంతో బాలికను స్నేహితుడి గదికి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక పెద్దమ్మ చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలికను భరోసా కేంద్రానికి తీసుకువెళ్లి విచారించగా, సాయికృష్ణ పలుమార్లు తనపై లైంగికదాడి చేసినట్లు బాలిక తెలిపింది. హోంలో పనిచేసే ఉద్యోగి లక్ష్మీ సహాయంతో తాము కలుసుకునేవారమని చెప్పింది. సాయికృష్ణతో పాటు లక్ష్మీపై పోక్సో చట్టం ప్రకారం పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బోర్డుల్లోనే 'వార్డు'లు

ఆరంభ శూరత్వంగా వార్డు కార్యాలయాలు

- మూణ్నాళ్లకే మూసివేతలు.. తీరని ప్రజల వెతలు



ముషీరాబాద్‌లో పరిస్థితి ఇలా..

సాక్షి, సిటీబ్యూరో: 'చిన్న సమస్యల కోసం కూడా ప్రజలు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్, సర్కిల్ కార్యాలయాల దాకా రాకుండా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాం. సిటిజెన్ చార్టర్ కనుగుణంగా ప్రజల సమస్యలు పరిష్కారం కావాలి. ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.ఫిర్యాదు అందినప్పటి నుంచి గంటలోగా చర్యలకు ఉపక్రమించి నాలుగు గంటల్లోగా పరిష్కరించాలి. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదు. పార్టీలతో సంబంధం లేదు. వ్యక్తులు కాదు.. వ్యవస్థ శాశ్వతం' గత ఏడాది జూన్ 16వ తేదీన జీహెచ్‌ఎంసీలో వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవాల సందర్భంగా అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు చెప్పిన మాటలు.

కార్యరూపం దాల్చని ప్రసంగాలు..

కానీ.. ఆ మాటలు కార్యరూపం దాల్చలేదు. పైపెచ్చు ఆ కార్యాలయాల పని కూడా మూణ్నాళ్లకే ముగిసింది. రోడ్లపై గుంతలు, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు, పరిసరాల్లో చెత్త, నాలాల్లో వ్యర్థాలు, రోడ్ల పక్కనే నాలాల్లోని పూడిక, మురుగునీటి లైన్ల లీకేజీలు, రోడ్లపైనే నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు.. ఇతరత్రా సమస్యలన్నీ స్థానికంగా పరిష్కారం చేయగలిగినవే. వీటికోసం ప్రజలు దూరంలోని కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా ఉండేందుకు గ్రేటర్‌లోని 150 వార్డులకు 150 వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. వాటి కోసం ఆగమేఘాల మీద ఏర్పాట్లు చేశారు. అవసరమైన సిబ్బంది, కంప్యూటర్లు తదితరమైనవి సమకూర్చారు. భవనాలు అందుబాటులో లేని చోట స్థానిక కమ్యూనిటీ హాళ్లు, మహిళాభవన్‌లు,ప్రజలకు పయోగపడుతున్న ఇతరత్రా భవనాలను తీసుకున్నారు. వాటికి రంగులు వేశారు. అందంగా తీర్చిదిద్దారు. బోర్డులు పెట్టారు. గూగుల్ మ్యాప్స్ ద్వారా లొకేషన్ తెలిసే ఏర్పాట్లు.. ఇతరత్రా ఎన్నో చేశారు. ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లను తీసుకున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్,శానిటేషన్, స్ట్రీట్‌లైట్స్, వాటర్‌బోర్డు, దోమల నివారణ తదితర విభాగాల నుంచి సంబంధిత అధికారులు కార్యాలయంలో వార్డు కార్యాలయంలో ఉండి సమస్యలను వెంటనే పరిష్కరిస్తారన్నారు. దాదాపు రెండు నెలలు మాత్రం పనిచేసిన అవి ఆ తర్వాత నుంచి పని చేయడం లేదు.

వెక్కిరిస్తున్న బోర్డులు

దాదాపు అన్ని చోట్లా కార్యాలయాలు తెరచుకోవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తలుపులు తెరుస్తున్నప్పటికీ, ఖాళీ కుర్చీలు, కంప్యూటర్లు వెక్కిరిస్తున్నాయి. అధికారుల పేర్లతో ఫోన్‌నెంబర్ల బోర్డులు తప్ప ఫిర్యాదులు తీసుకోవడానికి ఎవరూ లేకుండాపోయారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్క కంప్యూటర్ ఆపరేటర్ మాత్రం ఉంటున్నారు. ఎవరైనా ఫోన్ చేసినా సమస్య ఏమిటో అడిగి డ్రైనేజీదని చెబితే వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలనో, కాల్‌సెంటర్ నెంబర్‌కు ఫోన్ చేయాలనో సెలవిస్తున్నారు. ఇంకొందరు ప్రజావాణికి వెళ్లాలని చెబుతున్నారు. ఎంతో హంగూ ఆర్భాటాలతో కార్యాలయాలు ప్రారంభమైనప్పుడు ప్రజలు స్థానికంగానే తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశపడ్డారు. దూర ప్రాంతంలోని జోన్ల కార్యాలయాలకు వెళ్లనవసరం లేదనుకున్నారు. కానీ..చాలా ప్రాంతాల్లో కనీసం తలుపులు కూడా తెరచుకోకపోవడంతో ఉసూరమంటున్నారు.

విశ్రాంతి గృహాలుగా మారాయి..

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల విధుల పేరిట ఆయా విభాగాల అధికారులు రావడం మానేశారు. ఎన్నికల తర్వాత కూడా రావడంలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. సంబంధిత ఉన్నతాధికారులూ పట్టించుకోలేదు. ప్రస్తుతం ఈ కార్యాలయాలు కేవలం అలంకారప్రాయంగా మిగిలాయి. 80 శాతం కార్యాలయాలకు ఏ ఒక్క అధికారి కానీ, కనీసం కంప్యూటర్ ఆపరేటర్ కానీ రావడం లేదు. కొందరికి ఆటవిడుపు కేంద్రాలుగా, విశ్రాంతి గృహాలుగా ఉపయోగపడుతున్నాయి.

'అగ్రి బిజినెస్' 29వ బ్యాచ్ ప్రారంభం



విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు



అగ్రి బిజినెస్ 29 బ్యాచ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్

ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో 2024–26 విద్యాసంవత్సరానికి గాను పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ 29వ బ్యాచ్ ప్రారంభమైంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 120 మంది ఈ అగ్రి బిజినెస్ కోర్సులో చదువుకోనున్నారు. ఈ సందర్భంగా మేనేజ్ డైరెక్టర్ జనరల్ చంద్రశేఖర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రును ఉద్దేశించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి దోహదపడే మంచి పౌరులుగా మారడానికి ఈ కోర్సు సహాయపడుతుందన్నారు. రెండేళ్ల ఈ డిప్లొమా కోర్సు విద్యార్థులు వ్యవసాయ సాంకేతికతను ఆవిష్కరించడం, వ్యవసాయ నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడం, వ్యవసాయ సంక్షేమాన్ని పెంపొందించడ వంటి వాటికి దోహదపడుతుందని అన్నారు. వృత్తిపరమైన వృద్ధికి మేనేజ్‌లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్‌కు పురస్కారాలు



బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంటున్న జ్యోతిరెడ్డి

బంజారాహిల్స్: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సామాజిక సేవా కార్యక్రమాలకుగాను అత్యుత్తమ పురస్కారాలు అందుకుంది. రోటరీ 3150 డిస్ట్రిక్ట్ కింద తెలంగాణతోపాటు ఏపీలోని ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో 110 క్లబ్‌లు కొనసాగుతున్నాయి. వీటిలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ బెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌గా జ్యోతిరెడ్డి ఎంపికయ్యారు. ఈ క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు కూడా దక్కింది. రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ వరుసగా మూడోసారి ఉత్తమ ప్రెసిడెంట్, ఉత్తమ క్లబ్ కేటగిరీలో మొదటిస్థానంలో నిలిచింది. 1989లో ఏర్పాటైన ఈ క్లబ్‌లో 193 మంది సభ్యులు ఉన్నారు. ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని కోటి రూపాయలతో తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించడం, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు విద్యావాలంటీర్లను కూడా నియమించింది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి డిజిటల్ మామొగ్రఫీ యూనిట్‌ను రూ.60 లక్షలు వెచ్చించి అందజేసింది. ఇదే క్లబ్ సెక్రటరీ రాజగోపాల్ సెకండ్ బెస్ట్ సెక్రటరీ అవార్డును కూడా అందుకున్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం



శ్రీరామ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

బంజారాహిల్స్: కబ్జా బారి నుంచి ప్రభుత్వ స్థలాన్ని అధికారులు కాపాడారు. స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వివరాలు... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని శ్రీరామ్‌నగర్ బస్తీలో 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఓ ఆక్రమణదారుడు కబ్జా చేయడానికి జేసీబీతో చదును చేస్తుండగా కాంగ్రెస్ సీనియర్ నేత పి.విజయారెడ్డి అడ్డుకుని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు ఈ స్థలం వద్ద విచారణ చేపట్టి బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 40 ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న ఈ స్థలంలో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలని స్థానికులు అధికారులను కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు

పాఠశాలలో గదిని సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు

సైదాబాద్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఓ పాఠశాలపై సైదాబాద్ మండల విద్యాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. సైదాబాద్ డివిజన్ జయానగర్‌లోని సెయింట్ ఆంద్రూస్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నారని కొందరు తల్లిదండ్రులు సైదాబాద్ మండల డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డీఈఓ స్పందించి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు స్కూల్‌లో తనిఖీలు చేపట్టారు. ఓ గదిని వ్యాపార కేంద్రంగా మార్చి యూనిఫాంలు, పుస్తకాలు అమ్ముటాన్ని గుర్తించి వెంటనే దానిని సీజ్ చేశారు. తనిఖీల్లో సైదాబాద్ మండల విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, నర్సింగ్‌రావు, రాజు పాల్గొన్నారు.

'ఫీజు' బకాయిల విడుదల కోరుతూ దీక్ష



ధర్నాచౌక్‌లో దీక్ష చేపట్టిన డిగ్రీ, పీజీ కాలేజీల ప్రతినిధులు

కవాడిగూడ: మూడేళ్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.750 కోట్లను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, యాద రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పరమేశ్వర్లు, యాజమాన్యాల ప్రతినిధులు బుధవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతియేటా సుమారు రూ.2,500 కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కేటాయిస్తోందని, అందులో జూనియర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు కేవలం 40 శాతం మాత్రమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎక్కువగా గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ దీక్షతో ఏ రాజకీయ పార్టీలకు సంబంధంలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు శ్రీధర్‌రావు, శంకర్, భాస్కర్‌తోటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 20, జూన్, 2024

బోటీ.. లొట్టలేసి..

73 ఏళ్ల లక్ష్మమ్మ వడ్డిస్తే బొజ్జ నిండాల్సిందే..

25ఏళ్లుగా చెరగని టేస్ట్

రోడ్డు పక్కనే కదా హోటల్ అనుకొని తీసిపారేయకండి. ఈమె వద్ద ఒక్కసారి బోటికూర, తలకాయ మాంసం రుచి చూశారంటే ఇక రోజూ ఇటువైపు రావాల్సిందే.. అవును మరి.. బోటికూర లక్ష్మమ్మ పెట్టే తలకాయ మాంసం, మటన్ లివర్, బోటి కూర, చికెన్ కర్రీ కోసం ఎక్కడెక్కడి నుంచో ప్రముఖులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బడా వ్యాపారులు సైతం వచ్చి లొట్టలేసుకొని తింటుంటారు. సమపాళ్లలో మసాలా దినుసులు, ఇంట్లోనే తయారు చేసే కారంపొడి, కొబ్బరిపొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్‌తో ప్రత్యేకంగా బోటీ వండుతుంటానని, రుచికి అదే కారణమని అంటుంటారు బోటికూర లక్ష్మమ్మ.

– బంజారాహిల్స్



లక్ష్మమ్మ చుట్టూ చేరిన ఆహార ప్రియులు

బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని షేక్‌పేట మండల కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌ను ఆనుకొని రోడ్డు పక్కనే రెండు దశాబ్దాలుగా ఆమె నిర్వహిస్తున్న మొబైల్ మెస్‌లో టేస్ట్ చేస్తున్న ఎంతో మంది ప్రముఖులు శెభాష్ అనకుండా ఉండలేకపోతున్నారు. ప్రతిరోజూ 12 కిలోల బోటీ వండి వంద మందికి పైగానే ఆహారప్రియులకు అందిస్తున్నారు. అందుకే వరంగల్ జిల్లా ఉల్లిగడ్డ దామెర గ్రామానికి చెందిన గన్నారం లక్ష్మమ్మ(73) ఏకంగా బోటీకూర లక్ష్మమ్మగా పేరు తెచ్చుకుంది. ఈమె బోటీ కూర గురించి ఇప్పటికే సుమారు 100 మంది యూట్యూబర్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బోటీ కోసమే వారంలో ఒకటి, రెండు సార్లు ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ వస్తుంటారు. తలకాయ మాంసం, మటన్ లివర్, మటన్ కూర, చికెన్ లివర్, చికెన్ కూర, ఇవన్నీ ఈమె వద్ద ప్రత్యేక రుచుల్లో లభిస్తుంటాయి.



రాహుల్ సిప్లిగంజ్‌కు వడ్డిస్తూ..

మరో నలుగురికి ఉపాధి

బోటీ కూరను తానే స్వయంగా వండుతానని, ఇందులో వాడే ప్రతి మసాలా దినుసు తానే తయారు చేస్తుంటానని తెలిపారు. తాను సంపాదించడమే కాకుండా మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నట్లు ఆమె చెప్పారు. లక్ష్మమ్మను చూసి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శ్రీనగర్‌కాలనీ, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో ఎంతోమంది మహిళలు స్ఫూర్తి పొంది ఇలాంటి మొబైల్ మెస్‌లు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. ఈమె టేస్ట్‌కు ఎవరూ సాటిరారంటూ చాలామంది యూట్యూబర్లు సైతం తమ అభిప్రాయాలు వెల్లడించడమే కాకుండా సోషల్ మీడియాలో లక్ష్మమ్మ బోటి కూర టేస్ట్ సెపరేట్ అంటూ పోస్టులు పెడుతుంటారు. అంతేకాదు స్విగ్గి, జొమాటో ఆర్డర్లు కూడా వస్తుండగా ఇప్పుడున్న గిరాకీ తట్టుకోలేక ఆమె సున్నితంగా తిరస్కరిస్తున్నారు.

ఎంతో ఆనందం



బోటీ వండటానికి నాకు 3 గంటల సమయం పడుతుంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు ఇక్కడ భోజనాలు ప్రారంభిస్తాను. మొదటి గంటలోనే వందకుపైగా బోటి కూర భోజనాలు అమ్మడవుతుంటాయి. కూర అయిపోగానే చాలా మంది వస్తుంటారు. లేదని చెప్పగానే నిరాశతో వెళ్తుంటారు. డబ్బులు సంపాదించడానికి వండటం లేదు. ఉన్నంతలోనే మంచి రుచితో అందిస్తున్నాను. రాజకీయ నాయకుడు అద్దంకి దయాకర్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, మరో సింగర్ బిట్టు, లేడీ సింగర్ లక్ష్మీతో పాటు చాలా మంది వస్తుంటారు. బాగుంది అని చెబుతుంటే ఆనందంగా ఉంటుంది. నాతో పాటు నా కూతురు, కొడుకు, కోడలు, మనవడు, మనవరాళ్లు ఏడు చోట్ల మెస్‌లు నిర్వహిస్తున్నారు. అన్ని చోట్లకు నేను వండిన బోటి కూర వెళ్తుంది. – లక్ష్మమ్మ

చెప్పకోదగ్గ సంఖ్యలో సభ్యులు

నగరంలో ఫుల్ టైమ్ ట్రెండ్



టేస్ట్ బ్లాగుంది..

హాబీగా ఫుడ్ బ్లాగింగ్

నగరంలో ఫుడ్ బ్లాగింగ్ హాబీ మారుతోంది.. చెప్పకోదగ్గ సంఖ్యలో సభ్యులు పూర్తిస్థాయి ప్రొఫెషన్స్‌గా స్థిరపడుతున్నారు. చారిత్రక నేపథ్యం, ఆధునిక వైవిధ్యం.. కలగలిసిన మన నగరం వైవిధ్యమైన అభిరుచులను కలిసి ఆస్వాదించడానికి బ్లాగర్లకు అనేక అవకాశాలను అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుని నగరవ్యాప్తంగా విభిన్న రుచుల విశిష్టతలను వెలుగులోకి తెస్తున్న బ్లాగర్స్..పెద్ద సంఖ్యలో ఫాలోవర్స్‌ను దక్కించుకుంటూ అటు భోజన ప్రియులకు, ఇటు ఆహార ఉత్పత్తుల విక్రయదారులకు ఆప్తులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో ఫుడ్ బ్లాగర్స్‌కు సంబంధించి నగరంలో చోటు చేసుకుంటున్న పరిణామాల గురించి తెలుసుకుందాం.

–సాక్షి, సిటీబ్యూరో

నిన్న మొన్నటి వరకూ ఫుడ్ బ్లాగింగ్ అంటే ఏంటో ఎవరికీ తెలీదు. కానీ కొంతకాలంగా నగరంలో ఫుడ్ బ్లాగింగ్ సంప్రదాయంగా మారుతోంది. ప్రస్తుతం ఫుల్-టైమ్ ఫుడ్ బ్లాగర్స్ చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఈ విషయంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నయ్‌లు మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి.

పురస్కారాల వంట...

సిటీ ఫుడ్ బ్లాగర్స్ లక్షల సంఖ్యలో ఫాలోవర్స్‌కు, మిలియన్ల సంఖ్యలో వీక్షకులకు చేరువవుతున్నారు. అంతే కాదు చెప్పకోదగ్గ సంఖ్యలో పురస్కారాలను కూడా అందుకుంటున్నారు. మెట్రో నగరాల్లోని ఫుడ్ బ్లాగర్స్‌కు ధీటుగా బ్రాండ్స్‌కు ప్రచారం చేస్తూ తగినంత రెమ్యునరేషన్ అందుకుంటున్నారు. ఓ చేత్తో సంపాదిస్తూనే.. మరో చేత్తో అవార్డులను కూడా సొంతం చేసుకుంటున్నారు.



ఆ నగరాల స్థాయిలోనే మన నగరం నుంచీ బ్లాగర్లు పెరుగుతున్నారు. నిజామ్‌ల నగరంలో ఫుడ్ బ్లాగింగ్ కల్చర్‌తో మమేకమౌతున్నారు.

బ్లాగర్స్ మీట్స్..

నగరంలోని ఫుడ్ బ్లాగర్స్ సోషల్ మీడియా వేదికల వారీగా వేర్వేరు టీమ్స్‌గా ఏర్పడుతున్నారు. ఇటీవల వార్షిక ఇన్‌స్టాగ్రామ్ ఫుడ్ బ్లాగర్ల సమావేశం జూబ్లీ హిల్స్‌లోని ఫ్రోత్ ఆన్ టాప్‌లో జరిగింది. దీంట్లో 70 మందికి పైగా ఫుడ్ బ్లాగర్లు ఒకే చోట సమావేశమయ్యారు. సరదా సంగీతం, ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. 'ఈ ఈవెంట్ ద్వారా, ఇన్‌ఫ్లుయెన్సర్లు, బ్లాగర్లు ఒకరినొకరు కలుసుకోవడానికీ, పలకరించుకోవడానికీ, కొత్త స్నేహితులను ఏర్పర్చుకోవడానికి వేదిక నిలుస్తుందని' నిర్వాహకులు గత ఏడేళ్లుగా ఫుడ్ బ్లాగర్‌గా పేరొందిన కిరణ్ సాహూ తెలిపారు.





బ్లాగర్లు వ్లాగర్లుగా, ఆ తర్వాత ఇన్‌స్టా రీల్స్ ద్వారా కంటెంట్ డెవలపర్స్‌గా.. ఇటీవల కాలంలో ఇన్‌ఫ్లుయెన్సర్లుగా రూపాంతరం చెందుతున్నారు. ప్రస్తుతం పలు ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచారం, ప్రమోషన్లను అందించడానికి వీరు ఖరీదైన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

ఫుడీ నుంచి ఇన్‌ఫ్లుయన్సర్‌గా...

వ్యక్తిగతంగా ఫుడ్ లవర్ అయిన కిరణ్ సాహూ.. సిటీలో దినదిన ప్రవర్ధమానమవుతున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లకు కేరాఫ్‌లా మారారు. గత ఏడేళ్లగా నగరంలో రుచుల జర్నీ సాగించిన ఆమె.. ఇప్పుడు రోజూ కనీసం ఒకటి నుంచి మూడు వరకూ బ్రాండ్ ప్రచార కార్యక్రమాలతో బిజీ బిజీగా ఉంటారు. 'మేం బ్లాగింగ్ లోకి ప్రవేశించినప్పుడు మొత్తం లెక్కేస్తే 10మంది బ్లాగర్లు కూడా లేరు. ఇప్పుడు అన్ని స్థాయిల్లో కలిపి 1000 నుంచి 2000 మంది ఉంటారు' అని సాక్షితో అన్నారు. ఓ వైపు కార్పొరేట్ ఉద్యోగం.. మరోవైపు చిన్న బిజినెస్ నిర్వహిస్తూనే ఫుడ్ బ్లాగర్‌గా రాణిస్తున్న ఈ మాదాపూర్ నివాసి... ఇష్టమైన వ్యాపకాలు ఎన్ని చేసినా కష్టం అనిపించవు అంటూ స్పష్టం చేస్తున్నారు.

బిర్యానీ ఒక్కటే కాదు...

వంటగది నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించి నగరంలో అత్యంత ప్రముఖ ఫుడ్ ఇన్‌ఫ్లుయన్సర్స్‌లో ఒకరిగా మారారు హోటల్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్, ఫుడ్ ఇన్‌ఫ్లుయన్సర్, మార్కెటర్ మొహమ్మద్ జుబైర్ అలీ. సమగ్ర రుచుల సమీక్షల నుంచి ఆకట్టుకునే ఫొటోగ్రఫీ వరకూ ఆయన నిర్వహించే 'హైదరాబాద్ ఫుడ్ డైరీస్' పేజీ అనేక ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తోంది. రెస్టారెంట్లు లాంజ్‌ల నుంచి ఆకట్టుకునే వీధి తినుబండారాల వరకూ పసిగట్టి.. వాటికి బ్లాగ్‌లో పట్టం గట్టడమే జుబైర్ పని. హైదరాబాద్ అంటే కేవలం బిర్యానీలకు మాత్రమే కాదని, అరుదైన రుచులను అందించే వంటకాలను కలిగిన గొప్ప నగరం అంటారాయన. గత దశాబ్ద కాలంగా జుబైర్, అర డజను అవార్డులను తన బ్యాగ్‌లో ఉంచుకుని, జుబైర్ అనేక ప్రసిద్ధ బ్రాండ్లకు ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాడు.



పరిమళం.. పరవశం..

- ఆకట్టుకున్న క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్
- వెరైటీ కాఫీ పరిమళాలను ఆస్వాదించిన సిటిజనులు

ఒక సిప్ గొంతులోకి వెళ్తే ఎంత ఆస్వాదిస్తామో.. పొగలు కక్కే కప్పులోంచి ఆ పరిమళం నాసికకు సోకినా అంతే గొప్పగా ఆఘ్రాణిస్తామంటారు కాఫీ ప్రియులు. అలాంటి కాఫీ ప్రియుల నాసికలకు పరీక్ష పెట్టిన కప్పా సెషన్ ఆకట్టుకుంది. ఓ వైపు కాఫీల ఘుమఘుమలు.. మరోవైపు కాఫీ గింజల ఉత్పత్తి దారులతో చర్చలు.. వెరసి నిర్వహించిన క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్ ఈవెంట్ నవాబుల నగరంలో పెరుగుతున్న కాఫీ సంస్కృతికి అద్దం పట్టింది.

– సాక్షి, సిటీబ్యూరో



కాఫీ ప్రియులు, కాఫీ గింజల పెంపకందారులు, కేఫ్ యజమానులు స్పెషాలిటీ కాఫీ కమ్యూనిటీకి చెందిన నిపుణులను ఒకేచోట చేర్చి నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. నగరానికి చెందిన ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లో ఉన్న కోరమ్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ ఈవెంట్‌లో రత్నగిరి ఎస్టేట్ నుంచి తీసుకువచ్చిన సరికొత్త స్పెషాలిటీ కాఫీలను ప్రదర్శించారు.

ఆకట్టుకున్న పరిమళాల గుర్తింపు..

ఈ ఈవెంట్లో భాగంగా కప్పా సెషన్ పేరిట కాఫీ ఫ్లేవర్లను గుర్తించేందుకు కాఫీ ప్రియులకు అవకాశం ఇచ్చారు. విభిన్న రకాల కాఫీలను కప్పులలో అందజేసి వాటిని నాసిక ద్వారా ఆఘ్రానించడం ద్వారా ఫ్లేవర్లను గుర్తించడం, రేటింగ్ ఇవ్వడం వంటివి చేయడంలో కాఫీ లవర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా రత్నగిరి ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్టనర్ అశోక్ పాత్రే, ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ నిర్వాహకురాలు ఎస్ఆర్‌కె చాందినీలతో ఆహుతులకు ముఖాముఖి సెషన్ నిర్వహించారు.



మార్కెట్లోకి కొత్త మోడల్ ఫోన్..



సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని సెల్ బే స్టోర్ వేదికగా గురువారం ప్రముఖ యాంకర్, సినీ తార వర్షిణి సౌందరాజన్ నూతన షావోమీ 14 సీవీ మోడల్‌ను ఆవిష్కరించనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు నిర్వహించే ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సినీతార వర్షిణి సౌందరాజన్‌తో పాటు పలువురు ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొంటారని స్టోర్ నిర్వాహకులు పేర్కొన్నారు.

ఎంగేజ్ విత్ సిటీ...

లామకాన్‌లో సంగీత దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని పాశ్చాత్య సంగీత ప్రియుల కోసం అశ్రిత డిసోజా ఆధ్వర్యంలో పాప్, జాజ్, డిస్నీ సాంగ్స్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని లామకాన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సాయంత్రం 5 నుంచి 2 గంటల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చిన్నారుల కోసం మ్యాక్స్ కిడ్స్ ఫెస్టివల్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిభావంతులైన చిన్నారుల కోసం ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ మ్యాక్స్ కిడ్స్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. చిన్నారుల ఊహలకు డ్రాయింగ్, కలరింగ్స్‌తో ఊపిరిపోసే విధంగా వారిలోని ఊహాశక్తిని, సృజనను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని, తమ మ్యాక్స్ స్టోర్ అందించే రీసైక్లింగ్ పేపర్‌తో తయారు చేసిన షాపింగ్ బ్యాగ్‌పై 'భూమిని కాపాడే సూపర్‌హీరో' అనే నేపథ్యంతో చిత్రాలను గీయాల్సి ఉంటుందని వివరించారు. తుది ఏడుగురు విజేతలకు పూర్తిస్థాయి ఖర్చులతో కుటుంబంతో సహా కశ్మీర్ పర్యటనను గెలుచుకుంటారని తెలియజేశారు. వివరాలకు దగ్గర్లోని మ్యాక్స్ స్టోర్‌లో సంప్రదించాలన్నారు.

ఐస్‌క్రీమ్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు? చిన్న పిల్లల నుంచి పండు ముసలి దాకా ఎగిరి గంతేస్తారు.. అనారోగ్య కారణాల రీత్యా, కృత్రిమ రంగుల వినియోగం వల్ల కొందరు దీనికి దూరంగా ఉంటున్నారు. ఆరోగ్యం, ఆహారంపై కరోనా నేర్పిన గుణపాఠాన్ని నగరవాసులు బాగానే ఒంటబట్టించుకున్నారు. దీన్ని గ్రహించిన అమ్మకం దారులను నయా ట్రెండ్‌లో తమ వ్యాపారాలను అందిపుచ్చుకుంటున్నారు. ఆహార ప్రియుల మనసును గెలుచుకునేందుకు కొత్త తరహాలో సహజమైన పళ్ల రసాల నుంచి ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారు. వీటిని ఆరగించిన ఆహార ప్రియులు ఐస్ ఐపోతున్నారంటే నమ్మండి.. కొత్త తరహాలో మార్కెట్‌ను ఆక్రమించికుంటున్న ఆ ఆర్టిసానల్ ఉత్పత్తులపైనే ఈ కథనం...



ఐసైపోతారు

సాక్షి, సిటీబ్యూరో

- సహజ రుచులకు ఆహారప్రియులు ఫిదా
- ఆరోగ్యకరమైన ఉత్పత్తులకే ఓటు
- నగరవాసుల్లో పెరిగిన అవగాహన
- ట్రెండ్ మారుస్తున్న అమ్మకందారులు

మనకు గతంలో ఇంపల్స్ ఐస్ క్రీమ్, టేక్-హోమ్ ఐస్ క్రీం అనే రెండు రకాలు అందుబాటులో ఉండేవి. వీటిలో టేక్-హోమ్ ఐస్ క్రీం మెజారిటీని మార్కెట్ వాటా కలిగి ఉండేది. అయితే ఈ మధ్యకాలంలో పుట్టుకొచ్చిన ఆర్టిసానల్ ఐస్ క్రీమ్‌లు శరవేగంగా పుంజుకుంటున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం కరోనా అనంతరం చలా కాలం తర్వాత గత వేసవిలో ఆర్టిసానల్ ఐస్‌క్రీమ్స్ తమ మార్కెట్‌ని భారీగా ఆక్రమించాయి. అదే ఊపు ఈ వేసవిలోనూ కొనసాగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఆర్టిసానల్ అదుర్స్...

ఆర్టిసానల్ ఉత్పత్తులు కొన్నేళ్ల క్రితమే నగరవాసులకు అందుబాటులకి వచ్చాయి. ఇందులో పాలు, క్రీమ్, చక్కెర వంటి నాణ్యమైన, సహజమైన ఉత్పత్తులను ఉపయోగిస్తారు. వివిధ ఫ్లేవర్లు, కలర్ల కోసం పప్పులు, పండ్లను మాత్రమే ఉపయోగిస్తారు. ఉదాహరణకు స్ట్రాబెర్రీ అయితే స్ట్రాబెర్రీ పండ్లను, స్వీట్ పాన్ ఐస్‌క్రీమ్ అయితే స్వీట్‌పాన్‌ను, మ్యాంగో ఐస్‌క్రీమ్‌లో మామిడి పండ్లను వినియోగిస్తారు. అయితే ఫ్లేవర్డ్ ఉత్పత్తుల్లా ఇవి 6–24 నెలల వరకూ నిల్వ ఉండవు. కేవలం 5–10 వారాలు మాత్రమే ఉంటాయి. ఈ ఐస్‌క్రీమ్‌లలో ఎలాంటి రసాయనాలూ లేవని నిర్ధారించడానికి వీలుగా అధిక-గ్రేడ్ ప్యాకేజింగ్‌లో వస్తాయి. గడ్డకట్టే ముందు, ఐస్‌క్రీం మిశ్రమాన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద ఉంచడం వల్ల ఇవి సురక్షితంగా బ్యాక్టీరియా రహితంగా మారతాయి.

విస్తృత శ్రేణి రుచులు..

ఎటువంటి భయాలు లేకుండా వినియోగదారులు తమ ఉత్పత్తులనే ఎంచుకోవాలనే లక్ష్యంతో పలు ఐస్‌క్రీమ్ బ్రాండ్స్ ఇప్పుడు ఇదే బాట పట్టాయి. దీంతో ఇవి 1–2 రుచులకు మాత్రమే పరిమితం కాకుండా విస్తృతశ్రేణిలో లభ్యమవుతున్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా ఐస్ క్రీం తయారీదారులు డైరీ-ఫ్రీ నుంచి షుగర్-ఫ్రీ వరకూ ఆరోగ్యకరమైన ఉత్పత్తులపై దృష్టి సారిస్తున్నారు. ఆరోగ్య స్పృహ కలిగిన యువత, మంచి రుచిని ఆస్వాదించాలనే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని, తక్కువ కేలరీల ఐస్‌క్రీమ్ బార్‌లను కూడా పలు బ్రాండ్స్ అందిస్తున్నాయి.

ఆర్టిసానల్‌కే ఆదరణ..



రుచితోపాటు ఆరోగ్యానికీ ప్రాధాన్యత ఇస్తున్నారు ఆహారప్రియులు. ఖరీదులో భారీ వ్యత్యాసం ఉన్నప్పటికీ ఆర్టిసనాల్ ఐస్‌క్రీమ్‌లనే ఇష్టపడుతున్నారు. ఒబెసిటీ సహా మరే ఇతర సమస్యలకూ దోహదం చేసే అవకాశం లేకపోవడం, పైగా పండ్లు, నట్స్ (పప్పులు) వంటివి వీటిలో విరివిగా వాడడం ఆరోగ్యానికి లాభదాయకం.

–ఎ.ప్రవీణ్‌కుమార్, సి గుస్తా ఐస్‌క్రీమ్ పార్లర్

అలాంటి ఉత్పత్తుల్లో ప్రతి సర్వింగ్‌కు కేవలం 89–99 కేలరీలు మాత్రమే ఉంటాయి. ఇతర సాధారణ ఐస్‌క్రీమ్‌లతో పోలిస్తే వీటిలో కొవ్వు 60% తక్కువగా ఉంటుంది.

రకరకాల థీమ్‌లతో...



నాంపల్లిలో రద్దీగా ఉండే ముజంజాహీ మార్కెట్ ప్రాంతంలో హ్యాండ్‌మేడ్ ఐస్‌క్రీమ్స్ లభిస్తున్నాయి. విశేషమేమిటంటే ఇక్కడ నాలుగు తరాల నుంచి నడుస్తున్న ఐస్ క్రీమ్ పార్లర్‌లు ఉన్నాయి. అంతేగాకుండా ఇక్కడ సీటింగ్ యూరప్ దేశాలను గుర్తుకుతెస్తోంది. అదే విధంగా జూబ్లీహిల్స్‌లోని డా.ఐస్ క్రీం పార్లర్, దాని పేరుకు తగ్గట్టుగా డాక్టర్ థీమ్‌తో ఉండే ఈ పార్లర్‌లో ఇక్కడ కొన్ని టాపింగ్స్ సిరంజిలను ఉపయోగించి మరీ అందిస్తారు. వనిల్లా, చాక్లెట్ తదితర రుచుల నుంచి బిర్యానీ ఫ్లేవర్ వరకూ వెరైటీ రుచులకు ఇది ప్రసిద్ధి. అలాగే జూబ్లీహిల్స్‌లోనే ఉన్న మిలానో ఐస్‌క్రీమ్, అబిడ్స్‌లోని సాఫ్ట్ డెన్, రోస్ట్, సిగుస్తా, ఆల్మండ్ హౌస్.. వంటివి హెల్దీ ఐస్‌క్రీమ్స్‌కి చిరునామాగా ఉన్నాయి. యూరోపియన్ శైలిలో అందిస్తే వీటినే ఇటాలియన్ నామం జిలాటోగా పేర్కొంటారు.


వీటితో ప్రమాదం...

సాధారణంగా మనకు పరిచయమున్న ఐస్‌క్రీమ్స్ ఒబెసిటీ తదితర జీవనశైలి వ్యాధులతో పాటు మరిన్ని ఆరోగ్య సమస్యలను తెచ్చిపెట్టే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతోపాటు ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి వీటికి రకరకాల రసాయనాలను మేళవించాల్సి ఉంటుంది. అలాగే ఐస్ స్ఫటికాలు ఏర్పడకుండా ఉండేందుకు ఐస్ క్రీములకు కారాజెనన్, ఎల్‌బిజి, గ్వార్, అకేసియా వంటివి కలుపుతారు. కొన్నిసార్లు మోనో-డిగ్లిజరైడ్స్‌ను కూడా కలుపుతారు.

జీవనాడిపై దాడి!

పోలవరం ఉసురు తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కిన చంద్రబాబు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు మన రాష్ట్రానికి జీవనాడి. గరిష్ఠంగా 194.6 టీఎంసీల సామర్థ్యంతో గోదావరిపై నిర్మిస్తున్న అతి పెద్ద జలాశయం ఇదే. కుడి, ఎడమ కాలువ ద్వారా 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతో గోదావరి, కృష్ణా డెల్టాల్లో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. విశాఖ నగరం పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చవచ్చు. ప్రాజెక్టులో నిర్మించే జలవిద్యుత్కేంద్రంలో 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చు. పోలవరం పూర్తయితే రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారిపోవడం ఖాయం. దేశంలో ఈ స్థాయిలో సాగునీరు, తాగునీరు, విద్యుత్తు అవసరాలను తీర్చే బహుళార్థ సాధక ప్రాజెక్టు మరొకటి లేదు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో ప్రారంభించిన పోలవరాన్ని విభజన నేపథ్యంలో 2014లో కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. తామే వంద శాతం ఖర్చుతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రానికి ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి మరీ 2016 సెప్టెంబరు 7న అధికారంలో ఉండగా చంద్రబాబు దక్కించుకున్నారు. 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని నమ్మబలికి కేంద్రానికి హామీ ఇచ్చారు. 2014 ఏప్రిల్ 1 వరకూ ఖర్చు చేసిన రూ.4,730.71 కోట్లు పోనూ మిగతా రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం తెగేసి చెబితే దానికీ చంద్రబాబు తలూపారు. సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఖరారు చేసిన ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను కమీషన్ల దాహంతో తుంగలో తొక్కి పనులు చేపట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించారు. చివరకు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు. ఈ నిర్వాకాల కారణంగా 2019 జూన్ తర్వాత గోదావరిలో పోటెత్తిన భారీ వరద కాఫర్ డ్యామ్‌ల ఖాళీల మీదుగా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఇదే పోలవరం పనులను అత్యంత సంక్లిష్టంగా మార్చింది. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల పనులను చంద్రబాబు గాలికొదిలేసి డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించడమే ఈ క్లిష్ట పరిస్థితికి మూల కారణం.

అక్రమాలు అరికట్టి కీలక పనులు పూర్తి..

2019 మే 30న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టీడీపీ సర్కార్ చేసిన చారిత్రక తప్పిదాలను సరిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టారు. పీపీఏ, సీడబ్ల్యూసీ అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ రూ.2,917 కోట్ల విలువైన పనులను నవయుగకు నాడు చంద్రబాబు సర్కార్ నామినేషన్‌పై కట్టబెట్టింది. వీటితో పాటు జలవిద్యుత్కేంద్రం పనుల కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించడం ద్వారా రూ.783 కోట్లను ఖజానాకు వైఎస్ జగన్ ఆదా చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానించే కనెక్టివిటీస్‌ను పూర్తి చేశారు. ఎడమ కాలువలో వరాహ నదిపై అత్యంత పొడవైన అక్విడెక్టుతోసహా కీలకమైన పనులను విజయవంతంగా పూర్తి చేశారు. జలవిద్యుత్కేంద్రం పనులను సైతం కొలిక్కి తెచ్చారు. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు.

జలవిద్యుత్ కేంద్రం

పోలవరం ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు ఎడమ వైపున 960 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్కేంద్రాన్ని నిర్మించాలి. ఎడమ వైపు ఉన్న కొండను తొలిచి 12 ప్రెజర్ టన్నెల్స్ తవ్వి టర్బైన్లను అమర్చి విద్యుత్కేంద్రాన్ని పూర్తి చేయాలి.

2014–19: టీడీపీ హయాంలో

జలవిద్యుత్కేంద్రం నిర్మాణ పనుల్లో కొండను తొలిచే పనుల్లో కేవలం 25 శాతం మాత్రమే చేసి టీడీపీ సర్కార్ చేతులు దులుపుకొంది.

2019–24: వైఎస్సార్ సీపీ పాలనలో

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవిద్యుత్కేంద్రం పనులు శరవేగంగా సాగాయి. కొండను తొలిచే పనులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేసి 12 ప్రెజర్ టన్నెల్స్‌ను పూర్తి చేసింది. టర్బైన్లను అమర్చడానికి అవసరమైన అన్ని పనులు పూర్తి చేసింది. టర్బైన్ల తయారీ బాధ్యతను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. జలవిద్యుత్కేంద్రం పనులను దాదాపుగా కొలిక్కి తెచ్చింది. పోలవరం జలాశయం పనులు పూర్తయ్యేలోగా విద్యుదుత్పత్తి ప్రారంభించే విధంగా జలవిద్యుత్కేంద్రం పనులను వేగవంతం చేసింది.



ఇక డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని తేల్చితే 18 నెలల్లోగా ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. అయితే అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సహకారం తీసుకుని డిజైన్లు ఖరారు చేసి పనులు చేపట్టేలా సీడబ్ల్యూసీ ప్రణాళిక రచించింది. 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం వ్యయమే రూ.33,168.23 కోట్లని, అందువల్ల 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని ప్రధాని మోదీకి నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్ అనేక సార్లు విన్నవించారు. ఈ క్రమంలో తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం పూర్తికి సహకరించాలన్న వైఎస్ జగన్ వినతిపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు పోలవరం తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అయితే అప్పటికే బీజేపీతో టీడీపీ–జనసేనకు పొత్తు కుదిరింది. ఈ నేపథ్యంలో పోలవరానికి నిధులు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే అది ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారుతుందని, అందువల్ల దాన్ని ఆపేయాలని బీజేపీ అధిష్టానంపై చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. ఇలా అడ్డుపుల్ల వేయడంతో నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది.


2019 మే 29 నాటికి పునాది స్థాయి కూడా దాటని పోలవరం స్పిల్ వే


వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఏరియల్ వ్యూ

స్పిల్ వే:



గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా స్పిల్‌వేను నిర్మించాలి. ప్రాజెక్టు పనుల్లో తొలుత పూర్తి చేయాల్సింది స్పిల్ వేనే. 1,118 మీటర్ల పొడవు, 53.32 మీటర్ల ఎత్తుతో నిర్మించే స్పిల్ వేకు 25.72 మీటర్ల నుంచి 45.72 మీటర్ల వరకూ 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో గేట్లు అమర్చాలి. వరద వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా అత్యాధునిక హైడ్రాలిక్ హాయిస్ట్‌లను గేట్లకు అమర్చాలి. ప్రపంచంలో గరిష్ఠంగా వరద జలాలను దిగువకు విడుదల చేసే అతి పెద్ద స్పిల్ వే పోలవరంలోనే ఉంది.


2014–19: టీడీపీ హయాంలో

2014 జూన్ 8న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు 2016 డిసెంబర్ 30న స్పిల్ వే పనులను ప్రారంభించారు. టీడీపీ అధికారం కోల్పోయే నాటికి అంటే 2019 మే 29 నాటికి స్పిల్ వే పనులు పునాది స్థాయిని కూడా దాటలేదు. స్పిల్ వేలో కేవలం రెండు (39, 40) పియర్స్‌ను 30 మీటర్ల వరకూ చేసి వాటి మధ్య ఒక ఇనుప రేకు పెట్టి గేట్ అమర్చినట్లు 2018 డిసెంబర్ 24న చంద్రబాబు ఘనంగా ప్రకటించుకున్నారు.

2019–2024: వైఎస్సార్‌సీపీ పాలనలో

2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. అదే ఏడాది జూన్‌లో ప్రారంభమైన వరద ప్రవాహం నవంబర్ వరకూ కొనసాగింది. 2020 మార్చి నుంచి 2021 వరకూ కరోనా మహమ్మారి విరుచుకు పడింది. అయితే గోదావరి వరదలు, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్ రికార్డు సమయంలో స్పిల్ వేను పూర్తి చేశారు. లాక్‌డౌన్‌లోనూ జర్మనీ, జపాన్ నుంచి హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లను దిగుమతి చేసుకుని స్పిల్ వేకు 48 గేట్లను బిగించారు. 2021 జూన్ 11న గోదావరి వరదను స్పిల్ వే మీదుగా విజయవంతంగా మళ్లించారు.

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు





నదికి అడ్డంగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మించడానికి వీలుగా.. గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించేందుకు ఈసీఆర్ఎఫ్‌కు ఎగువన 2,840 మీటర్ల పొడవు, 43 మీటర్ల ఎత్తుతో ఒక కాఫర్ డ్యామ్‌ను, దిగువన 1,655 మీటర్ల పొడవు, 31.5 మీటర్ల ఎత్తుతో మరో కాఫర్ డ్యామ్‌ను నిర్మించాలి.

2014–19: టీడీపీ హయాంలో

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించకముందే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్‌ను 1,396 మీటర్ల పొడవున పూర్తి చేసిన చంద్రబాబు 2018 జూన్ 11న జాతికి అంకితం చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మించాలంటే 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే 54 గ్రామాల్లోని 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఈమేరకు సీడబ్ల్యూసీ, పీపీఏకు హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్ 2018 నవంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు ప్రారంభించింది. అయితే రూ.484 కోట్లు ఖర్చు చేసి కేవలం 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మిగతా నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాన్ని వదిలేసిన చంద్రబాబు సర్కార్ ఆ పనులను పూర్తి చేయలేక చేతులెత్తేసింది. 2019 జూన్‌లో ప్రారంభమైన గోదావరి వరద ప్రవాహానికి ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారింది. దాంతో కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో సగటున 26 మీటర్ల నుంచి 36.5 మీటర్ల లోతు వరకు భారీ అగాధాలు ఏర్పడ్డాయి.

2019–24: వైఎస్సార్ సీపీ పాలనలో

ఎగువ కాఫర్ డ్యామ్ ప్రభావం వల్ల ముంపునకు గురయ్యే 8,446 కుటుంబాలకు రూ.1,670 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఆ తర్వాత ఎగువ కాఫర్ డ్యామ్‌ను 43 మీటర్ల ఎత్తుతో, దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు 31.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లతోపాటు 2.1 కి.మీ. పొడవున అప్రోచ్ ఛానల్, 2.92 కి.మీ. పొడవున స్పిల్ ఛానల్, వెయ్యి మీటర్ల పొడవున పైలట్ ఛానల్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని మళ్లించింది.

జీవం తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

తాజాగా పోలవరాన్ని సందర్శించిన చంద్రబాబు జీవనాడి లాంటి ప్రాజెక్టును జగన్ విధ్వంసం చేశారంటూ బుకాయించారు. కమీషన్లకు ఆశపడి పోలవరం జీవం తీసిన చంద్రబాబు దీన్ని కప్పిపుచ్చి జీవం పోసిన జగన్‌పై బురద జల్లే యత్నం చేయడాన్ని నిపుణులు తప్పుబడుతున్నారు.

ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు



సాక్షి, అమరావతి: ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గా సీహెచ్ ద్వారకా తిరుమలరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 1989 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన తిరుమలరావు ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా ఉన్నారు.

బీజేపీతో ఎందుకు జతకట్టారు?

బాబు, పవన్‌లను నిలదీసిన గాలి వినోద్‌కుమార్



లాలాపేట (హైదరాబాద్): దక్షిణాదికి కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ఏం చేశారని, వయనాడు నుంచి ప్రియాంకా గాంధీని ఎందుకు గెలిపించాలో చెప్పాలని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. బుధవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత పదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ ఏం చేసిందని, అయినా చంద్రబాబు, పవన్ కల్యాణ్ బీజేపీతో ఎందుకు జతకట్టారని నిలదీశారు. దక్షిణాదికి హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా చేయాలనీ అంబేడ్కర్ 1955లో ప్రతిపాదించారని, 60 ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్, పదిహేనేళ్లుగా పాలిస్తున్న బీజేపీ ఎందుకు పట్టించుకోలేదన్నారు. దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు, దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి, ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరానికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాళేశ్వరానికి జాతీయ హోదా, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఇలా రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ పరిష్కరించలేదని విమర్శించారు.

22న పీవోడబ్ల్యూ అర్ధ శతాబ్ది ఉత్సవాలు

పంజగుట్ట (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీలో 1974లో పురుడు పోసుకుని దేశంలోని ఎన్నో ఉద్యమాలకు కేంద్ర బిందువుగా ఉన్న ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) అర్ధ శతాబ్ది వార్షికోత్సవం ఈనెల 22న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్లు పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు వి.సంధ్య తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, జి.ఝాన్సీ, స్వరూప, పద్మలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘం వరకట్న వేధింపులకు వ్యతిరేకంగా, మహిళా సమస్యలు, మహిళలకు చట్టసభల్లో స్థానం, సారా వ్యతిరేక ఉద్యమం, మద్య నిషేధం లాంటి ఉద్యమాల్లో ముందంజలో ఉందని గుర్తుచేశారు. 22న లిబర్టీ నుంచి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వరకు ర్యాలీ అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు.

ఆశించినన్ని సీట్లు రాలేదెందుకు?

- పార్టీ పేలవ ప్రదర్శనపై కాంగ్రెస్ అధిష్టానం అంతర్గత సమీక్ష
- తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో పరిశీలన కోసం నిజ నిర్ధారణ కమిటీలు ఏర్పాటు
- సార్వత్రిక ఎన్నికల ఓటమిపై సమీక్షించాలని ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఆశించిన మేర ఎంపీ సీట్లు రాకపోవడంపై కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీక్ష చేపట్టింది. ఎక్కువ స్థానాలు గెలుస్తామనుకున్న రాష్ట్రాల్లో పేలవ ప్రదర్శన కారణంగా అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయామని అభిప్రాయానికి వచ్చింది. తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో పార్టీ వైఫల్యానికి గల కారణాలను తెలుసుకొనేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిజ నిర్ధారణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు ఆయా రాష్ట్రాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహిస్తాయి. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంపై గట్టి ఆశలే పెట్టుకుని..

అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణపై కాంగ్రెస్ అధిష్టానం ఎక్కువ ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో కనీసం 12 స్థానాలను కచ్చితంగా గెలుస్తామని రాష్ట్ర నాయకత్వం గట్టిగా చెప్పింది. కానీ అనూహ్యంగా బీజేపీ 8 ఎంపీ సీట్లను కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ 8 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ఈ పేలవ ప్రదర్శనపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా తీసింది. ఇప్పుడు నిజ నిర్ధారణ కమిటీ రాష్ట్రంలో పర్యటించి అధిష్టానానికి నివేదిక సమర్పించనుంది.

నిజనిర్ధారణ కమిటీలు ఇవీ..

తెలంగాణ నిజ నిర్ధారణ కమిటీలో పీజే కురియన్, రకిబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్ ఉన్నారు. మధ్యప్రదేశ్ కమిటీలో పృథ్వీరాజ్ చవాన్, సప్తగిరి ఉలాక, జిగ్నేష్ మేవానీ.. ఛత్తీస్‌గఢ్ కమిటీలో వీరప్ప మొయిలీ, హరీశ్ చౌదరి.. ఒడిశా కమిటీలో అజయ్ మాకెన్, తారిక్ అన్వర్.. కర్ణాటక కమిటీలో మధుసూదన్ మిస్త్రీ, గౌరవ్ గొగోయ్, హిబి ఎడెన్ ఉన్నారు. ఇక ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లు మూడింటికి కలిపి ఏర్పాటు చేసిన కమిటీలో పీఎల్ పునియా, రజని పాటిల్‌లకు స్థానం కల్పించారు.

రాహుల్ గాంధీ మాటలకు విలువ లేదా?

- బీసీలను విస్మరిస్తే ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతాం
- వచ్చేవారం నుంచి జిల్లాల వారీగా సభలు
- జూలైలో బీసీల బస్సు యాత్ర
- బీసీల రిజర్వేషన్లు పెంచాలని అఖిలపక్ష సంఘాల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సమగ్ర కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పదేపదే చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బుధవారం 'కులగణనకు సవాళ్లు– డెడికేషన్ కమిషన్ ఏర్పాటు– స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు' అనే అంశంపై బీసీ మేధావుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగియగానే స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి కులగణన చేపడతామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అయితే కోడ్ ముగిసి పక్షం రోజులు దాటినా ఇంకా మౌనంగా ఉండటంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాహుల్ గాంధీ మాటకు విలువ లేదా అని నిలదీశారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంటే వచ్చేవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. జూలై మొదటి వారంలో అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు, బాసర నుంచి భాగ్యనగరం వరకు బీసీల బస్సు యాత్ర చేపట్టనున్నామన్నారు. ఆగస్టు మొదటి వారంలో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బిహార్ తరహాలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తూనే ఉన్నాయన్నారు. ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ ప్రభుత్వం బీసీల మంచితనాన్ని బలహీనంగా చూస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ చైర్మన్ బీఎస్ రాములు, బీసీ సంఘాల నేతలు నారగోని, కుందారం గణేష్ చారి, దాసు సురేశ్‌తో పాటు వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, రిటైర్డ్ ఎస్పీలు, డాక్టర్లు, న్యాయవాదులు, అఖిలపక్ష బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రీలాంచ్ పేరిట మరో భారీ మోసం

- దాదాపు రూ.100 కోట్లు వసూలు చేసిన జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా గ్రూప్

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): నగరంలో మరో రియల్ ఎస్టేట్ సంస్థ భారీ మోసానికి పాల్పడింది. ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ బాధితుల నుంచి రూ.వంద కోట్లకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయం ముందు బాధితులు నిరసన చేపట్టారు. కొల్లూరు, మోకిలా, అబ్దుల్లాపూర్‌మెట్, యాదాద్రి ప్రాంతాలలో భారీ వెంచర్లు ఉన్నాయంటూ ప్రచారం చేసి, మధ్యతరగతి ప్రజలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి పెట్టుబడుల పేరుతో సంస్థ ఎండీ శ్రీనివాసరావు కోట్ల రూపాయలు వసూలు చేశారని బాధితులు తెలిపారు. 2020 సంవత్సరం నుంచి సంస్థ డబ్బులు వసూలు చేసిందని, మూడు సంవత్సరాలు పూర్తయినా ప్రాజెక్టు పూర్తి చేయకుండా ఎండీ శ్రీనివాసరావు తప్పించుకొని తిరుగుతున్నాడని వారు చెప్పారు. వందలాదిమంది బాధితుల నుంచి సుమారు రూ.100 కోట్ల వరకు శ్రీనివాసరావు వసూలు చేశారని పేర్కొన్నారు. గత మూడు నెలల నుంచి తిరిగి డబ్బులు చెల్లిస్తానంటూ కస్టమర్లకు చెప్పిన శ్రీనివాస్‌రావు, రెండు నెలల నుంచి కనబడకుండా పోవడంతో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇప్పటికే జీఎస్ఆర్ ఇన్ ఫ్రా సంస్థపై సీసీఎస్ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉంటే ఎండీ శ్రీనివాసరావు హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడని తెలిసింది.

'నా కోసం-సమాజం కోసం యోగా' వ్యాస రచన పోటీలు

భారీ ఎత్తున పాల్గొన్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు 'నా కోసం–సమాజం కోసం యోగా' అనే అంశంపై బుధవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) హైదరాబాద్ విభాగం, గాంధీ జ్ఞాన మందిర్ యోగా కేంద్రం, కోఠి సంయుక్తంగా వ్యాస రచన పోటీలు నిర్వహించాయి. ఈ పోటీలో విద్యార్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలిచిన వారికి గాంధీ జ్ఞాన మందిరం యోగా కేంద్రంలో ఈనెల 21న ఉదయం 6.30 గంటలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేస్తామని సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ హరిబాబు తెలిపారు. ప్రపంచంలో ప్రజలందరూ ఆరోగ్యంగా, శాంతి, సామరస్యంతో మెలగాలనే లక్ష్యంతో 2014లో ప్రధాని మోదీ ఏటా జూన్ 21న యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితిలో ప్రతిపాదించగా.. అన్ని సభ్య దేశాలు మద్దతు తెలిపాయి.

నా కొడకల్లారా.. నరుకుతా..

రవాణా శాఖ అధికారులపై బూతులతో చెలరేగిన జేసీ ప్రభాకరరెడ్డి



అనంతపురం క్రైం: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జేసీ ప్రభాకరరెడ్డి అధికారులపై విరుచుకుపడ్డారు. 'నా కొడకల్లారా.. ఒక్కొక్కరినీ నరుకుతా' అంటూ బుధవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోనే బండబూతులతో చెలరేగిపోయారు. రవాణా శాఖ అధికారులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు తాడిపత్రి మునిసిపల్ అధికారులకు, పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నేతలకు బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ప్రధానంగా గతంలో రవాణా శాఖ కమిషనర్‌గా చేసిన ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులుతో పాటు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డీటీసీ శివరాం ప్రసాద్, మహిళా అధికారిణి అత్తికానాజ్‌లను దుర్భాషలాడారు. 'మీరెక్కడ దాక్కున్నా వదలను. గత ప్రభుత్వ హయాంలో నా బస్సులు, లారీలను అన్యాయంగా సీజ్ చేశారు. మమ్మల్ని దొంగలుగా చిత్రీకరించారు. నన్ను, నా కొడుకును జైలుకు పంపారు. నిబంధనల మేరకే మేము బీఎస్–4 వాహనాలు కొన్నాం. బీఎస్–4 వాహనాలు అమ్మిన వాళ్లదే తప్పు అని సుప్రీంకోర్టు చెప్పింది. పంజాబ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అమ్మిన వాహనాలను సరెండర్ చేశారు. అక్కడ రిజిస్ట్రేషన్ చేసిన అధికారుల ఉద్యోగాలు పోయాయి. ఏపీలో మాత్రం వాహనాలు కొన్న మాపై కేసులు పెట్టారు. జైళ్లకు కూడా పంపారు. అందరిపై ప్రతీకారం తీర్చుకుంటా. సీజ్ చేసిన మా బస్సులు, లారీలన్నీ తుప్పు పట్టిపోయాయి. వాటిని మీరే (అధికారులే) రిపేరు చేయించి తిరిగి రోడ్డుపైకి తేవాలి. ఇందుకు పది రోజులు గడువిస్తున్నా. లేదంటే భార్య, పిల్లలతో కలసి డీటీసీ, ఎస్పీ కార్యాలయాల ముందు నిరాహార దీక్ష చేస్తా. తాడిపత్రి మునిసిపల్ ఆఫీసులో కూడా చాలా ఇబ్బంది పెట్టారు. రేయ్.. కమిషనర్లా మిమ్మల్ని వదలను. 'నా కొడకల్లారా నరికేస్తా. ఏమవుతుంది మీతో' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. అధికారులను దుర్భాషలాడారు. 'నా ఫ్యామిలీకి 620 ఏళ్ల చరిత్ర ఉంది. నా గడ్డం ఎందుకు వదిలాననుకుంటున్నారు? చంద్రబాబు సీఎం కావాలని వదల్లేదు. ఒక్కో వెంట్రుకకు ఒక్కో కథ ఉంది. అత్తికానాజ్ ఆడదంట.. ఏమ్మా అన్నా వినలేదు. ఇంట్లో తను ఎలా ఉంటుందో తెలుసా?' అంటూ రాయలేని భాషలో దూషించారు. వైఎస్సార్‌సీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నానీలను కూడా దూషించారు. బస్సులు, లారీల వ్యవహారం పూర్తిగా తన వ్యక్తిగత సమస్య అని, చంద్రబాబుకు, ఈ ప్రభుత్వానికి సంబంధం లేదని అన్నారు. తాను సొంతంగానే పరిష్కరించుకుంటానన్నారు. అవసరమైతే పార్టీకి కూడా రాజీనామా చేస్తానని చెప్పారు. తాను ఊ అంటే చాలు తనకున్న జనం మరెవరికీ లేరని అన్నారు.

'మనూ'లో ఇక 'లా' కోర్సులు

రాయదుర్గం (హైదరాబాద్): మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'లా' కోర్సులను ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే విశ్వవిద్యాలయంలో 'లా' కోర్సులను ప్రారంభించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదముద్ర లభించింది. ప్రతిపాదనకు ఆమోదముద్ర వేస్తూ ఈనెల 17వ తేదీన లేఖ అందిందని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'మనూ'లో నిర్వహించే 'లా' కోర్సులు ఇవే..

ఉన్నత విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే వర్సిటీలో లా కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయిదేళ్ల లా డిగ్రీ బీఏఎల్ఎల్‌బీ (ఆనర్స్), మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఒక ఏడాది ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ(లా)ను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉర్దూ మాధ్యమం ద్వారా బోధించడానికి ఏర్పాట్లు చేశారు.


'సుప్రీం' కేసులపై తొలిసారి ప్రత్యేక లోక్ అదాలత్

- జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్య కార్యదర్శి పంచాక్షరి, ఏవో కళార్చన

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో తొలిసారి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను బుధవారం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మీడియాకు వెల్లడించారు. 'రాష్ట్రంలో మధ్యవర్తిత్వానికి అనుకూలంగా 295 కేసులు ఉన్నట్లు సుప్రీం గుర్తించింది. వీటిలో లేబర్, మెయింటెనెన్స్, సర్వీస్, కుటుంబ, చెక్‌బౌన్స్, ఎన్ఐ యాక్ట్ కేసులతో పాటు కొన్ని క్రిమినల్ కేసులున్నాయి. ఆ వివరాల మేరకు ఈ కేసుల్లో కక్షిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేయడం దాదాపు పూర్తయింది. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి కక్షిదారులు ముందుకు వస్తే.. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించవచ్చు. సుప్రీం సూచించిన ఫార్మాట్‌పై ఇరుపక్షాల సంతకాలు తీసుకుని పంపిస్తాం. ఈ ఒప్పందం మేరకు సుప్రీంకోర్టు అవార్డు ఇస్తుంది. వ్యయప్రయాసలకోర్చి కక్షిదారులు అంత దూరం వెళ్లకూడదని భావించి ఈ నిర్ణయం తీసుకుంది.



ఓ విజేత ప్రస్థానం

రజనీ బెక్టార్

రజనీ బెక్టార్... సమైక్య భారతంలోని కరాచీ నగరంలో 1940లో పుట్టారామె. తండ్రి అకౌంటెంట్ జనరల్. తండ్రి ఉద్యోగరీత్యా కొంతకాలం లాహోర్‌లో పెరిగారు. ఆమెకు ఏడేళ్లు నిండేలోపే దేశవిభజన జరిగింది. రజని కుటుంబం భారత దేశానికి వచ్చింది. ఇండియాకి వచ్చిన తర్వాత ఢిల్లీలోని మిరిండా హౌస్‌లో చదువుకుందామె. కాలేజ్ చదువు పూర్తయ్యేలోపే లూథియానాలోని ఒక వ్యాపార కుటుంబంలోకి కోడలిగా అడుగుపెట్టింది. ఆమె జీవితంలో కీలకమైన ఘట్టాలు జరిగాయి. గానీ అప్పటికి ఆమె వయసు పదిహేడే. చదువు పూర్తికాకముందే పెళ్లికి తలవంచాల్సి రావడంతో కలిగిన ఆ అసంతృప్తే ఆమెను ఇప్పుడు విజేతగా నిలిపింది. లూథియానాలో అడుగుపెట్టినప్పటి నుంచి పద్మశ్రీ అవార్డు అందుకునే వరకు సాగిన ఆమె విజయయాత్రను సంతోషంగా గుర్తు చేసుకుంటున్నారామె.

ఓ కొత్త ప్రపంచం

''నేను లూథియానాకి వచ్చేనాటికి అది చాలా చిన్న పట్టణం. ఢిల్లీ నుంచి వచ్చిన నాకు లూథియానాను పట్టణం అనడానికి కూడా మనసొప్పేది కాదు. పట్టణం మొత్తానికి నాలుగు కార్లుండేవి అంతే. మా అత్తగారింటివాళ్లు ఛాందసులు. మా పుట్టింట్లో అమ్మ వైపు, నాన్న వైపు వాళ్లందరూ ఉన్నత విద్యావంతులు, విశాల దృక్పథం కలిగిన వాళ్లు. అత్తగారిల్లు- పుట్టిల్లు ఒకదానికొకటి పూర్తిగా భిన్నం. దాంతో నేను కొత్త మనుషుల మధ్యకు మాత్రమే కాదు, ఏకంగా కొత్త ప్రపంచంలోకి వచ్చి పడ్డాననే చెప్పాలి.

వంటతో స్నేహం

నాకు రకరకాలు వండడం, కొత్త వంటలను ప్రయత్నించడం హాబీ. ఆ హాబీయే నాకు పెద్ద ఆలంబన అయింది. స్నేహితులను, బంధువులను ఇంటికి ఆహ్వానించడం వారికి చేసి పెట్టడం, వారు ప్రశంసిస్తుంటే పొంగిపోవడమే జీవితంగా మారిపోయాను. హీరో మోటార్ కార్పొరేషన్‌కు చెందిన బ్రిజ్‌మోహన్ ముంజాల్, ఎవన్ సైకిల్స్ కంపెనీకి చెందిన పహ్వాస్‌లు 'లూథియానా ప్రజలకు మంచి వంటలను రుచి చూపిస్తున్నావ్' అన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఒకరు తన మనుమరాలి పెళ్లికి కేటరింగ్ చేసి పెట్టమని అడిగారు. ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. స్థాణువులా ఉండిపోయాను. ఎలాగో ధైర్యం చేసి అంగీకారంగా తలూపాను. ఇద్దరు అసిస్టెంట్‌ల సాయంతో రెండు వేల మందికి వంటలు చేయించాను. ఆ తర్వాత స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఏ వేడుక జరిగినా నాకు కబురు వచ్చేది. అయితే అవేవీ కమర్షియల్ సర్వీస్‌లు కాదు, స్నేహపూర్వక సర్వీస్‌లే. కొంతకాలానికి ఇంట్లోనే కుకరీ క్లాసులు మొదలు పెట్టాను. అప్పుడు మా అత్తగారు తీవ్రంగా వ్యతిరేకించారు. 'ఇంట్లో మగవాళ్లు వ్యాపారంలో బాగా సంపాదిస్తున్నారు, నువ్వు క్లాసులు చెప్పి సంపాదించాల్సిన అవసరం ఏమొచ్చింది' అని కోప్పడ్డారు. మా వారు నాకు మద్దతుగా నిలవడంతో ఆ పెనుతుఫాను సమసిపోయింది. పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జైన్ మా ఫ్యామిలీ ఫ్రెండ్. ఆయన సలహాతో అందులో ఫుడ్ డైరీ ప్రొడక్ట్స్, బేకరీ కోర్సులో చేరాను. పిల్లలు కొంచెం పెద్దయి బోర్డింగ్ స్కూల్‌కెళ్లిన తర్వాత నేను కాలేజ్‌లో చేరడంతో ఇంట్లో నాకు ఎటువంటి ఇబ్బందీ రాలేదు. యూనివర్సిటీలో అడుగు పెట్టగానే నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. పెళ్లి కారణంగా చదువాపేసినప్పటి నుంచి మనసులో దాగి ఉన్న దిగులు ఒక్కసారిగా ఎగిరిపోయింది. కోర్సు పూర్తి కాగానే మా వారిచ్చిన ఇరవై వేలతో 1978లో క్రిమికా ఐస్‌క్రీమ్ యూనిట్ ప్రారంభించాను. 'క్రీమ్ కా' అనే అర్థంలో పెట్టానా పేరు. లూథియానాలో క్వాలిటీ ఐస్‌క్రీమ్ స్టాల్ పక్కన నేను స్టాల్ తెరిచాను కాని క్వాలిటీ ఐస్‌క్రీమ్‌ను కాదని మా యూనిట్‌కి ఎవరైనా వస్తారా అనే భయం చాలా రోజులు వెంటాడింది. అయితే నేను స్టాల్‌లో కూర్చోవడం లూథియానాలో మహిళలకు స్ఫూర్తినిచ్చింది. ఇంట్లో మగ్గిపోకుండా బయటకు వచ్చి ఏదైనా సాధించాలనే తపన ఉన్న వాళ్లందరూ తమ ఇంట్లో వాళ్లను ఒప్పించడానికి నన్ను మోడల్‌గా చూపించేవారు. నా ఐస్‌క్రీమ్‌కి కూడా ఆదరణ పెరగసాగింది.

ఐస్‌క్రీమ్‌తో మొదలు బిస్కట్ వరకు

క్వాలిటీని కాదని మా స్టాల్‌కి రావాలంటే వాళ్ల కంటే ఎక్కువగా చేయాలి. ఐస్‌క్రీమ్‌తోపాటు బ్రెడ్, బిస్కట్ వంటి బేకరీ ఫుడ్ చేయడం మొదలు పెట్టాను. మా స్టాల్‌ను విస్తరించి జీటీ రోడ్‌లోకి మార్చాం. అంతా గాడిలో పడిందనుకునే సమయంలో ఆపరేషన్ బ్లూ స్టార్ మొదలైంది. పంజాబ్ అట్టుడికిపోయింది. అనంతరం దేశం మొత్తాన్ని కుదిపేసిన దుర్ఘటన ఇందిరా గాంధీ హత్య జరిగింది. అప్పటికి వందేళ్ల నుంచి మా కుటుంబం చేస్తున్న ధాన్యం, ఎరువుల వ్యాపారం స్తంభించిపోయింది. రైతులతో సంబంధాలు తెగిపోయాయి. బెదిరింపులు ఎక్కువయ్యాయి. మా పెద్దబ్బాయి మీద అపహరణ ప్రయత్నం కూడా జరిగింది. ఈ పరిస్థితుల్లో ఆ వ్యాపారాన్ని మూసివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అంటే.. 1990 నుంచి నా ఫుడ్ బిజినెస్సే ఇంట్లో అందరికీ ఫుడ్ పెట్టింది. ఇంట్లో అందరమూ క్రిమికా కోసమే పని చేయడం మొదలుపెట్టాం.

పదహారు గంటల పని

ఇప్పుడు క్రిమికాకు సంబంధించిన రోజువారీ బాధ్యతలేవీ లేవు. కానీ కీలకమైన సమయాల్లో రోజుకు పదహారు గంటలు పనిచేశాను. ఆహారం మీద నాకున్న ప్రత్యేకమైన అభిరుచే నన్ను ఈ రంగంలోకి తీసుకొచ్చింది. విజేతగా నిలబెట్టింది. నేను నా టేస్ట్‌బడ్స్‌కి థ్యాంక్స్ చెప్పాలి. క్వాలిటీ చెక్‌లో భాగంగా ప్రతిదీ రుచి చూడాలి. కేవలం రుచి మాత్రమే చూడాలి. కడుపు నిండా తినకూడదు. కడుపు నిండితే రుచిని గ్రహించే శక్తిని కోల్పోతాం. ఆ నియమం పాటిస్తేనే విజయం మనదవుతుంది. ఈ దేశంలో జీవించాలని వచ్చాం. ఇక్కడే సవాళ్లనెదుర్కొన్నాం. జీవితాన్ని వెతుక్కున్నాం. మూడేళ్ల కిందట పద్మశ్రీ పురస్కారం అందుకున్నాను. ఈ దేశం నాకు చాలా ఇచ్చింది'' అన్నారు రజనీ బెక్టార్.





మెక్‌డీ బర్గర్‌లో మా బన్ను

మెక్ డొనాల్డ్ ఫుడ్ చైన్ మనదేశంలో అడుగుపెట్టింది. వాళ్లకు అవసరమైన బన్ కోసం బేకరీలన్నింటినీ సందర్శించారు. మా బేకరీని ఎంపిక చేసుకున్నారు. అయితే వారికి కావల్సిన నియమాలు, పరిమితులకు లోబడి తయారు చేసి ఇవ్వడానికి ఒక ఏడాదిపాటు ఎక్సర్‌సైజ్ చేశాం. మధ్యప్రదేశ్‌లో పండే నాణ్యమైన గోధుమల పిండితో చేసిన బన్ వారి ఆమోదం పొందింది. మొదట్లో కొంత నష్టం వచ్చినప్పటికీ క్వాలిటీ కంట్రోల్ నుంచి ఆమోదం వచ్చిన తర్వాత ఇక మాకు వెనక్కి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఆ తర్వాత మెక్‌డీకి అవసరమైన సాస్ ప్లాంట్ కూడా పెట్టాం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతోపాటు విదేశాల్లో కూడా వేగంగా విస్తరించగలిగాం. టర్నోవర్ ఏడు వేల కోట్లకు చేరింది. మా ముగ్గురబ్బాయిలు బాధ్యతలు పంచుకుని వ్యాపారాన్ని కొనసాగించారు. ఇప్పుడు మూడవ తరం అడుగుపెట్టింది. మా మనుమడు ఢిల్లీ మార్కెట్ మీద దృష్టి పెట్టాడు.

బ్యూటిప్స్





పండులాంటి ప్యాక్

అరటితొక్కతో సహా పండుని ముక్కలుగా తరిగి పేస్టు చేయాలి. ఈ పేస్టుకు రెండు టీస్పూన్ల పచ్చి పాలు పోసి మరోసారి గ్రైండ్ చేసి పదిహేను నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా అప్లై చేసి ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. అరటి పండులో ఉన్న విటమిన్ బి6, బి12, ప్రోటీన్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియంలు చర్మానికి పోషణ అందించి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవడం వల్ల ముఖచర్మం నిగారింపుని సంతరించుకుంటుంది. క్రమం తప్పకుండా వాడితే ఫలితం త్వరగా కనిపిస్తుంది.

కిచెన్ టిప్స్



- మినరల్ వాటర్ క్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల రాళ్ల ఉప్పు, టీస్పూను బేకింగ్ సోడా, ఒక నిమ్మకాయ రసం, కొద్ది గోరువెచ్చని నీళ్లు పోసి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరువాత క్యాన్‌ను పైకీ కిందకు బాగా గిలకొట్టాలి. పది నిమిషాలపాటు ఇలా గిలకొట్టి రెండుమూడుసార్లు నీటితో కడగాలి. తరువాత డిష్ వాష్ లిక్విడ్‌తో వాటర్ క్యాన్ బయటవైపు తోముకుంటే క్యాన్ మురికి వదిలి కొత్తదానిలా మెరుస్తుంది.



- బట్టల మీద పడిన ఇంక్ మరకలు పోవాలంటే.. ఇంక్ మరకలపై కొద్దిగా నీళ్లు చల్లాలి. ఇప్పుడు టూత్ పేస్టును అప్లై చేసి బ్రష్‌తో రుద్ది నీటితో వాష్ చేస్తే ఇంక్ మరకలు ఇట్టే పోతాయి.



- స్ప్రే బాటిల్‌లో టేబుల్ స్పూను బేకింగ్ సోడా, టేబుల్ స్పూను వెనిగర్, టీ స్పూను డిష్ వాష్ లిక్విడ్, రెండు గ్లాసులు నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కిచెన్ ప్లాట్‌ఫాం, స్టవ్ మీద చల్లుకుని తుడుచుకుంటే ఎటువంటి క్రిములూ దరిచేరవు. దీనిలో ఎటువంటి రసాయనాలు లేవు కాబట్టి ఆరోగ్యానికి కూడా మంచిదే.

కలలు కనడమే కాదు.. వాటి సాకారానికి కృషి చేయాలనే ఆలోచన ఓ ముగ్గురు గృహిణులలో కలిగింది. ఫలితంగా వాహనాలను రిపేర్ చేయడంలో శిక్షణ తీసుకున్నారు. అంతటితో ఆగిపోకుండా'సిగ్నోరా' పేరుతో వెంచర్‌ను కూడా ఏర్పాటు చేశారు. మేరీ, బిన్సీ, బింటు అనే ఈ ముగ్గురు మహిళలు కేరళలోని కాసర్‌గోడ్‌కు చెందినవారు. 'ఫస్ట్ ఆల్ ఉమెన్ టు ఆటోమొబైల్ వెంచర్‌గా మా సంస్థకు గుర్తింపు రావడం గర్వంగా ఉంది' అని చెబుతున్న ఈ మహిళల లక్ష్యం ఎంతోమందికి స్ఫూర్తి కలిగిస్తోంది.



మేరీ, బిన్సీ, బింటు

సిగ్నోరా @ సర్వీస్ సెంటర్


మేరీ, బిన్సీ, బింటు

పనిముట్లను అందుకున్న మేరీ అరగంట కృషితో రిపేర్‌లో ఉన్న కారును డ్రైవింగ్‌కు అనుకూలంగా మార్చేసింది. మేరీ, బిన్సీ, బింటు ముగ్గురూ ఆ తర్వాత మరో వాహనాన్ని రిపేర్ చేయడంలో మునిగిపోయారు. సాధారణంగా మహిళలు వెనకడుగు వేసే ఆటోమొబైల్ రిపేరింగ్ రంగంలో ఈ ముగ్గురూ సక్సెస్‌ను చూపుతున్నారు.

శిక్షణతో ముందడుగు

మహిళలు ఒంటరిగా లేదా బృందంగా వ్యాపారం ప్రారంభించేందుకు శిక్షణ ఇవ్వడానికి పరప్ప బ్లాక్ పంచాయితీ ఆలోచన చేసింది. ఆ సమయానికి బిన్సీ, బింటు, మేరీలు ఎవరి కాపురాలు వారు చేసుకుంటూ కుటుంబ జీవనం గడుపుతున్నారు. అయితే తాము కుటుంబ బాధ్యతలకు అతీతంగా సమాజం ముందు సగర్వంగా నిలబడాలని కలలు కన్నారు. అంతటితో ఆగిపోలేదు.. వాటిని సాకారం చేసుకోవాలనుకున్నారు. అదే సమయంలో పరప్ప బ్లాక్ పంచాయితీ ద్విచక్ర వాహనాల మరమ్మతులో వృత్తి శిక్షణ కోర్సును ప్లాన్ చేసింది. ఆ శిక్షణా కార్యక్రమమే ముగ్గురు మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది.

గ్రూప్‌గా ఏర్పాటు..

పద్దెనిమిది నుండి నలభై ఐదు సంవత్సరాల మధ్య వయసు గల ఇరవై మంది మహిళలను కోర్సుకు ఆహ్వానించింది. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు ఏడు పంచాయతీలను ఎంపిక చేశారు. మొత్తం 23 మంది మహిళలు శిక్షణకు ముందుకు వచ్చారు. వీరికి నెల రోజుల పాటు నిపుణులు శిక్షణ ఇచ్చారు. బిన్సీ మాట్లాడుతూ 'కోర్సు పూర్తవగానే వెంచర్ ప్రారంభించాలనుకునేవారికి సహాయం అందిస్తామన్నారు. అప్పుడే మేం ఒక గ్రూప్‌గా ఏర్పడి సరైన ప్లాన్‌తో ముందుకు రావాలనుకున్నాం. ఒకే ప్రాంతంలో ఎంటర్‌ప్రైజ్ ప్రారంభించాలనుకున్నాను. సిగ్నోరా అంటే లాటిన్ భాషలో 'పెళ్లయిన స్త్రీ' అని అర్థం. కుటుంబ సభ్యులు కూడా మాకు మద్దతునిచ్చారు. ఆటో సర్వీసింగ్ రంగం మహిళలకు అంత సులువైన పనికాదనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. దీనిని అధిగమించాలనే పట్టుదలతోనే మేం వర్క్‌షాప్‌ను ప్రారంభించాం. భీమానది-కలికడవ్ మార్గంలో మా వెంచర్‌ను ఏర్పాటు చేశాం. తొలినాళ్లలో 'ఆడవాళ్లు రిపేర్లు చేస్తే ఇక ఆ వాహనం ముందుకు నడిచినట్టే..' లాంటి వ్యంగ్యపు మాటలు వినవచ్చేవి. అలాంటి ఆలోచనతో చాలా మంది మా వెంచర్‌కు వచ్చేవారు కాదు. అయితే, ఆ తర్వాత మెల్లగా మా వెంచర్‌కు వచ్చిన వాహనాలకు తగిన రిపేర్ చేయడంతో మంచి గుర్తింపు రావడం మొదలైంది. ఎలాంటి వాహన సమస్యనైనా మేం పరిష్కరించగలం.

ప్రతిరోజూ కొత్త విషయాలు..

'విజయాన్ని త్వరగా సొంతం చేసుకోగల వృత్తి ఇది కాదని మేం నమ్ముతున్నాం. దీనివల్ల లాభాలు గడిస్తాం అని కూడా అనుకోవడం లేదు. ప్రస్తుతం వచ్చే ఆదాయం అద్దెకు, రుణం చెల్లించడానికి సరిపోతుంది. సర్వీస్ సెంటర్‌లో అధునాతన పరికరాలు కొనుగోలు చేయడానికి డబ్బు కావాలి. ప్రతి రోజూ ఒక్కో వాహనం గురించి కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. మా ముగ్గురికీ ఆర్థిక సహకారం అందించేలా సంస్థ క్రమంగా ఎదుగుతుందని ఆశిస్తున్నాం' అంటున్నారు ఈ మహిళలు. మొదట్లో ఆటోమొబైల్ సర్వీస్ ట్రెయినింగ్‌కు విముఖత చూపిన పలువురు స్థానిక మహిళలు ఇప్పుడు ఆసక్తిగా ఈ పారిశ్రామికవేత్తలను సంప్రదిస్తున్నారు. తమ వెంచర్ విజయవంతమైతే ద్విచక్రవాహనాల రిపేరింగ్‌లో అమ్మాయిలకు శిక్షణ ఇవ్వాలనుకుంటున్నామ'ని మేరీ చెబుతోంది.

'ఈ వెంచర్‌ను ప్రారంభించి ఆరు నెలలు కావస్తోంది. యూనిఫామ్ ధరించి పని చేస్తున్నప్పుడు మాపై మాకు నమ్మకంగానూ, గర్వంగానూ అనిపిస్తుంది. టెక్నాలజీ రోజు రోజుకూ మారుతున్న కొద్దీ ఇంకా కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉండాలి. చాలామంది అమ్మాయిలు, మహిళలు ఇప్పుడు మమ్మల్ని ఈ పని నేర్పించమని అడుగుతున్నారు. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ అందించాలనుకుంటున్నాం. మా వెంచర్‌ను పెద్ద సంస్థగా తీర్చిదిద్దాలనేది మా లక్ష్యం' అంటున్నారు ఈ ఉమెన్ మెకానిక్స్.

ఫస్ట్ టైమ్


డిజిటల్ దివా జరా శతవరి

దివ్య వెలుగుల డిజిటల్ సుందరి

'కృత్రిమ నవ్వు' అని వెక్కిరిస్తాం.
'వారి మాటల్లో అంతా కృత్రిమత్వమే' అని విమర్శిస్తాం.
'కృత్రిమత్వం' 'సహజత్వం' భిన్న ధ్రువాలు అనే వాస్తవాన్ని కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తిరగ రాసింది.
కృత్రిమ మేధస్సు నుంచి పుట్టిన అందాల యువతులు నవ్వితే ఆ నవ్వులో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు.
మాట్లాడితే... మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుందేగానీ ఎక్కడా కృత్రిమ ఛాయ కనిపించదు.
మానవులతో పోటీ పడుతూ 'ఎక్కడా తగ్గేదేలే' అంటున్న డిజిటల్ సొగసరులకు ఏఐ సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్ 'ఫ్యాన్ వ్యూ' అందాల పోటీ నిర్వహించింది.
'మిస్ ఏఐ' పోటీ జరగడం చరిత్రలో ఇదే తొలిసారి.
'మిస్ ఏఐ' పోటీలో ప్రపంచవ్యాప్తంగా పదిహేను వందల ఏఐ మోడల్స్, డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు పోటీ పడ్డారు. 'టాప్ -10' ఫైనలిస్ట్ జాబితాలో మన దేశం నుంచి డిజిటల్ దివా జరా శతవరి చోటు సాధించింది.





కృత్రిమ మేధస్సు మంచి చెడుల గురించి చర్చ జరుగుతున్న సమయంలో 'శతవరి' పనితీరును ఎలా చూడాలి? ' అనే ప్రశ్నకు 'వందశాతం పాజిటివ్'గానే అనే సమాధానం వినిపిస్తుంది

బ్యూటీ, టెక్ స్కిల్స్, సోషల్ మీడియాలో వీరి ప్రభావం ఎంత... మొదలైన అంశాలు 'మిస్ ఏఐ' ఎంపిక ప్రక్రియలో ఉంటాయి.

న్యాయ నిర్ణేతలలో ఇద్దరు ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఉండడం విశేషం.

'మిస్ ఏఐ విజేత' ఎవరవుతారో అనే ఆసక్తికంటే 'ఎవరీ జరా శతవరి?' అనే ఆరా ఎక్కువ అయింది. అందానికి అక్షరాలా నిర్వచనంలా ఉన్న ఈ శతవరి ఎవరో తెలుసుకుందాం..

ఒక మొబైల్ కంపెనీ యాడ్ ఏజెన్సీకి కో-ఫౌండర్ అయిన రాహుల్ చౌదరి శతవరి సృష్టికర్త.

శతవరిని 'డిజిటల్ మీడియా మేధావి'గా అభివర్ణించాడు రాహుల్.

'మిస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'లో శతవరికి 'టాప్-10' చోటు దక్కిన సందర్భంగా తన లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో సంతోషాన్ని వ్యక్తం చేశాడు రాహుల్.

'ఈ గుర్తింపు ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్ కమ్యూనిటీకి జరా శతవరి చేసిన విశేష కృషిని తెలియజేస్తుంది. ప్రపంచ వేదికపై భారత్, ఆసియాకు ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తాను. శతవరి భారత్ నుంచి ఏకైక ఫైనలిస్ట్, ఆసియా నుంచి ఇద్దరిలో ఒకరు' అని పోస్ట్‌లో స్పందించాడు రాహుల్.

కృత్రిమ మేధస్సు మంచి చెడుల గురించి చర్చ జరుగుతున్న సమయంలో 'శతవరి'ని ఎలా చూడాలి?' అనే ప్రశ్నకు 'వందశాతం పాజిటివ్'గానే అనే సమాధానం వినిపిస్తోంది.

అందం, సోషల్ మీడియాలోని అభిమాన గణం మాత్రమే శతవరి విలువకు ప్రాతిపదిక కాదు. హార్మోన్ సమస్యల నుంచి కుంగుబాటు వరకు ఎన్నో అంశాలపై మహిళలకు అవగాహన కలిగిస్తుంది. కృత్రిమ మేధస్సులోని సానుకూల కోణానికి సంపూర్ణంగా అద్దం పడుతుంది.

'ఏ.ఐ. సామర్థ్యం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం ఆమె లక్ష్యం' అంటున్నాడు జరా శతవరి సృష్టికర్త రాహుల్.

శతవరి శక్తి ఇది...

* ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఏఐ-పవర్డ్ సోషల్ మీడియా స్ట్రాటజీ, ఎనాలటిక్స్ నేర్చుకుంది.
* 2023 నుంచి పీఎంహెచ్ బయోకేర్‌కు 'బ్రాండ్ అంబాసిడర్'గా ఉంది.
* 'ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్ టాలెంట్ మేనేజర్'గా తన టాలెంట్‌ను చూపించింది.
* సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా 'వావ్' అనిపించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 8000 మంది ఫాలోవర్‌లు ఉన్నారు.
* స్ట్రాటిజిక్ ప్లానింగ్, కంటెంట్ డెవలప్‌మెంట్, డేటా ఎనాలసిస్, బ్రాండ్ ఎవేర్‌నెస్, బ్రాండ్ అడ్వకసీ, ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్, క్రియేటివ్ ఐడియేషన్, ట్రెండ్-సావి, హెల్త్ అండ్ వెల్‌నెస్ కన్సల్టింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, ఫ్యాషన్ స్టైలింగ్, కెరీర్ డెవలప్‌మెంట్ లాంటి విభాగాలలో ప్రతిభ చాటుతోంది.





కెప్టెన్సీకి విలియమ్సన్ గుడ్‌బై

క్రైస్ట్‌చర్చ్: ఐసీసీ ఈవెంట్లలో ప్రతీ సారి నిలకడైన ప్రదర్శన కనబర్చే న్యూజిలాండ్ జట్టు ఈ సారి టి20 వరల్డ్ కప్‌లో పేలవ ఆటతో కనీసం సూపర్–8కు కూడా చేరకుండా నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో జట్టు కెప్టెన్‌గా ఉన్న కేన్ విలియమ్సన్ తాను నాయకుడిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. దీంతో పాటు వన్డే కెప్టెన్సీకి కూడా అతను రాజీనామా చేశాడు. టి20 వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్, వెస్టిండీస్ చేతుల్లో ఓడిన కివీస్ జట్టు ఉగాండా, పపువా న్యూగినీలపై మాత్రమే గెలుపొందింది. తాజా పరిణామాలతో న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌నుంచి కూడా కేన్ తప్పుకున్నాడు. అయితే ఆటగాడిగా మాత్రం కొనసాగుతానని అతను వెల్లడించాడు. ఏడాది క్రితమే విలియమ్సన్ టెస్టు కెప్టెన్ హోదాను కూడా స్వచ్ఛందంగా వదులుకున్నాడు. విలియమ్సన్ కెప్టెన్సీలో 2019 వన్డే వరల్డ్ కప్, 2021 టి20 వరల్డ్ కప్‌లలో ఫైనల్ చేరిన న్యూజిలాండ్...2021 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. మొత్తం 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టి20ల్లో అతను కివీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు.



హర్మన్

అటు హర్మన్...ఇటు స్మృతి

- శతకాలతో చెలరేగిన భారత ద్వయం
- 4 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- వోల్‌వార్ట్, కాప్ సెంచరీలు

బెంగళూరు: భారత్, దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ సమరంలో రికార్డులు హోరెత్తాయి. చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద పారి హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో చివరకు భారత్‌దే పైచేయి అయింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 4 పరుగుల స్వల్ప తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు సాధించింది. వన్డేల్లో భారత్‌కు ఇది మూడో అత్యధిక స్కోరు. కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 103 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు సెంచరీ సాధించగా, స్మృతి మంధాన (120 బంతుల్లో 136; 18 ఫోర్లు, 2 సిక్స్‌లు) వరుసగా రెండో వన్డేలోనూ శతకంతో చెలరేగింది.అనంతరం సఫారీ టీమ్ చివరి వరకు పోరాడి ఓడింది. 50 ఓవర్లలో దక్షిణాఫ్రికా 6 వికెట్లకు 321 పరుగులు సాధించింది. కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (135 బంతుల్లో 135 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), మరిజాన్ కాప్ (94 బంతుల్లో 114; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. పూజ వస్త్రకర్ వేసిన ఆఖరి ఓవర్లో దక్షిణాఫ్రికా విజయానికి 11 పరుగులు అవసరం కాగా, తొలి 2 బంతుల్లో 5 పరుగులు వచ్చాయి. అయితే తర్వాతి 2 బంతులకు 2 వికెట్లు పడ్డాయి. ఆఖరి 2 బంతుల్లో 1 బై మాత్రమే వచ్చింది. సిరీస్‌ను 2–0తో భారత్ సొంతం చేసుకోగా, మూడో వన్డే ఆదివారం జరుగుతుంది.

4 మహిళల వన్డేలో నలుగురు బ్యాటర్లు సెంచరీలు సాధించడం ఇదే తొలిసారి.

646 ఇరు జట్లు కలిపి చేసిన పరుగులు. ఇది రెండో అత్యధికం. గతంలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్‌లో 678 పరుగులు నమోదయ్యాయి

7 వన్డేల్లో ఏడో సెంచరీ సాధించిన స్మృతి...భారత్ తరఫున మిథాలీ రాజ్ (7)ని సమం చేసింది.

★ హైదరాబాద్‌కు చెందిన పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసింది. భారత్ తరఫున ఆమె ఇప్పటికే 26 టి20లు ఆడింది.



స్మృతి

'ఎయిట్'లో సమరానికి సై!

- నేడు సూపర్–8లో భారత్ తొలి మ్యాచ్
- అఫ్గానిస్తాన్‌తో కీలక సమరం
- జోరు మీదున్న రోహిత్ సేన
- రా.గం.8.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

ఎలాంటి విధ్వంసక బ్యాటింగ్ ప్రదర్శనలు లేవు...ఎలాంటి అసాధారణ బౌలింగ్ గణాంకాలు లేవు...ఐర్లాండ్, అమెరికాలపై సులువుగా గెలిస్తే పాక్ పోటీనిచ్చినా ఫలితం మన వైపే నిలిచింది. పెద్దగా ప్రతిఘటన లేకుండా ముందంజ వేసిన భారత జట్టు ఇప్పుడు దానిని కొనసాగించాలని పట్టుదలగా ఉంది. అప్పుడప్పుడు సంచలనాలతో అలరించే అఫ్గానిస్తాన్ ఎదురుగా నిలిచింది.



రషీద్



రోహిత్

బ్రిడ్జ్‌టౌన్: టి20 వరల్డ్ కప్‌లో లీగ్ దశతో పోలిస్తే కాస్త బలమైన ప్రత్యర్థులతో తలపడే అవకాశం ఉన్న సూపర్–8లో భారత జట్టు తమ తొలి మ్యాచ్ కోసం సన్నద్ధమైంది. నేడు జరిగే పోరులో అఫ్గానిస్తాన్‌తో టీమిండియా తలపడుతుంది. లీగ్ దశలో ఓటమి లేకుండా సాగిన భారత జట్టే ఇక్కడా ఫేవరెట్‌గా కనిపిస్తుండగా...అఫ్గాన్ తమ బౌలింగ్ బలాన్నే నమ్ముకుంది. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 8 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరగ్గా...భారత్ 7 గెలిచింది. మరో మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

అదే జట్టుతో...

సూపర్–8లో పిచ్‌లు స్పిన్‌ను అనుకూలించే పరిస్థితి ఉంది కాబట్టి భారత్ కుల్దీప్‌ను తీసుకోవచ్చనే చర్చ జరిగింది. అయితే అక్షర్ అటు స్పిన్‌తో పాటు ఇటు బ్యాటింగ్‌తో కూడా కీలక పరుగులు సాధిస్తుండటంతో మేనేజ్‌మెంట్ ఆ సాహసం చేయకపోవచ్చు. రోహిత్, కోహ్లి ఓపెనర్లుగా చెలరేగితే జట్టుకు తిరుగుండదు. కోహ్లి అన్ని మ్యాచ్‌లలో విఫలమైనా...ఒక్క సరైన ఇన్నింగ్స్ అతని స్థాయిని చూపించగలదు. పంత్ మూడో స్థానంలో చక్కగా నిలదొక్కుకున్నాడు. అఫ్గాన్ స్పిన్నర్లపై ఎదురుదాడికి మిడిలార్డర్‌లో సూర్యకుమార్, దూబే సరైనవాళ్లు కాగలరు. ఆ తర్వాత కూడా పాండ్యా, జడేజా, అక్షర్ రూపంలో బ్యాటింగ్ బలగం ఉంది కాబట్టి సమస్య లేదు. బుమ్రా అద్భుత బౌలింగ్‌ను అఫ్గాన్ ఏమాత్రం ఎదుర్కోగలదనేది చూడాలి.

స్పిన్నర్లు రాణిస్తే...

గత మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో చిత్తుగా ఓడినా...అఫ్గానిస్తాన్ టీమ్‌లో ఆత్మస్థైర్యానికి లోటు లేదు. జట్టు ప్రధానంగా బౌలింగ్‌పైనే ఆధారపడుతోంది. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన ఫజల్ హక్ తన పదునైన పేస్, స్వింగ్‌తో ప్రత్యర్థులను ఇబ్బంది పెడుతున్నాడు. మధ్య ఓవర్లలో కెప్టెన్ రషీద్ ఖాన్ బౌలింగ్‌పైనే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. గతంలో 2 సార్లే భారత్‌తో ఆడిన రషీద్ ఒక్క వికెట్ తీయకపోయినా...అతడిని తక్కువగా అంచనా వేయడానికి లేదు. చైనామన్ స్పిన్నర్ నూర్ అతడికి అండగా నిలుస్తాడు. ఐపీఎల్ అనుభవంతో చెలరేగుతున్న గుర్బాజ్, మరో ఓపెనర్ ఇబ్రహీమ్ జట్టుకు మంచి ఆరంభాలు అందించారు. ఈ ఏడాది జనవరిలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌ను 212 పరుగుల స్కోరుతో అఫ్గాన్ 'టై' చేసిన విషయం మరచిపోవద్దు.

పిచ్, వాతావరణం

న్యూయార్క్‌లో పరుగులే రావడం గగనమైన పిచ్‌తో పోలిస్తే ఇది బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. టోర్నీలో ఒక సారి 200కు పైగా స్కోరూ నమోదైంది. వర్షసూచన లేదు.

పోర్చుగల్ విజయం



రొనాల్డో

లీప్‌జిగ్ (జర్మనీ): ప్రతిష్టాత్మక యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లలో ఒకటైన పోర్చుగల్ శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎఫ్'లో భాగంగా జరిగిన తమ తొలి పోరులో పోర్చుగల్ 2–1 గోల్స్ తేడాతో చెక్ రిపబ్లిక్‌పై విజయం సాధించింది. పటిష్ట పోర్చుగల్‌ను చివరి వరకు నిలువరించి మ్యాచ్‌ను చెక్ జట్టు డ్రా దిశగా తీసుకెళ్లినా...అదనపు సమయంలో గోల్ ఇచ్చి మ్యాచ్‌ను చేజార్చుకుంది. ల్యూకాస్ ప్రొవోడ్ (62వ నిమిషం) గోల్‌తో చెక్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. దురదృష్టవశాత్తూ చెక్ ఆటగాడు రాబిన్ రానక్ (69వ నిమిషం) సెల్ఫ్ గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత ఆధిపత్యం కోసం ఇరు జట్లూ పోరాడాయి. చివరకు ఫ్రాన్సిస్కో కాన్సికావో (90+2వ ని.) గోల్ కొట్టడంతో పోర్చుగల్ గెలుపు ఖాయమైంది. స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో గోల్ చేయకపోయినా...జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రికార్డు స్థాయిలో అతను ఆరో సారి 'యూరో' బరిలో దిగడం విశేషం.

మరో మ్యాచ్‌లో ఆతిథ్య జర్మనీ 2–0తో హంగేరీని ఓడించి ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది.

సఫారీ సూపర్ విక్టరీ

18 పరుగులతో అమెరికాపై గెలుపు

- గెలిపించిన డికాక్, రబాడ
- ఆండ్రియెస్ గూస్ పోరాటం వృథా



డికాక్

నార్త్‌సౌండ్: ప్రపంచ కప్ లీగ్ దశలో పెద్ద జట్లలో కనిపించిన అలసత్వం, చిన్న స్కోరుకే పడిన ఆపసోపాలు సూపర్–8కు వచ్చేసరికి దూరమైనట్లున్నాయి. బోర్ కొట్టించిన స్కోర్ల స్థానంలో ఆసక్తికర ధనాధన్ సమరం టి20 మజాను పంచింది. దీంతో ఆడుతున్న తొలి టి20 ప్రపంచకప్‌లోనే ముందంజ వేసిన అమెరికా ఆటలు ఈ దశ (సూపర్–8)లో సాగలేదు. పటిష్టమైన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్‌దెబ్బకు ఆతిథ్య అమెరికా ఓడింది. బుధవారం జరిగిన తొలి సూపర్–8 పోరులో సఫారీ టీమ్ 18 పరుగుల తేడాతో అమెరికా జట్టుపై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్వింటన్ డికాక్ (40 బంతుల్లో 74; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ షో చేశాడు. మరో ఓపెనర్ రిజా హెండ్రిక్స్ (11) విఫలమైనా...వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ మార్క్‌రమ్ (32 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్) అండతో రెండో వికెట్‌కు చకచకా 110 పరుగులు జోడించాడు. తర్వాత 126 పరుగుల స్కోరు వద్ద డికాక్, మిల్లర్ (0) అవుటయ్యారు. అయితే హెన్రిచ్ క్లాసెన్ (22 బంతుల్లో 36 నాటౌట్; 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (16 బంతుల్లో 20 నాటౌట్) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసింది. అనంతరం అమెరికా కొంత పోరాడినా లక్ష్యానికి దూరంగా ఉండిపోయింది. ఆ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ ఆండ్రియెస్ గూస్ (47 బంతుల్లో 80 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జోడీగా దిగిన స్టీవెన్ టేలర్ (14 బంతుల్లో 24; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా వేగంగా పరుగులు సాధించడంతో 3.2 ఓవర్లలోనే అమెరికా 33 పరుగులు చేసింది. కానీ మరుసటి బంతికి టేలర్ అవుటయ్యాక జట్టు నిలబడలేకపోయింది. నితీశ్ కుమార్ (8), కెప్టెన్ ఆరోన్ జోన్స్ (0), కోరీ అండర్సన్ (12), జహంగీర్ (3) ఇలా వచ్చి అలా వెళ్లి పోయారు. హర్మీత్ దేశాయ్ (22 బంతుల్లో 38)తో గూస్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఇద్దరు కాసేపు భారీ షాట్లతో వణికించారు. అయితే హర్మీత్‌ను రబాడ (3/18) అవుట్ చేయడంతో ఆశలు ఆవిరయ్యాయి.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X ఇంగ్లండ్
వేదిక: గ్రాస్ ఐలెట్; ఉ.గం.6.00 నుంచి
భారత్ X అఫ్గానిస్తాన్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

కల్కిలాంటి సినిమా నేనిప్పటివరకూ చేయలేదు – అమితాబ్



● అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, ప్రభాస్

''కల్కి 2898 ఏడీ' సెట్స్‌లో తొలిసారి అమితాబ్ బచ్చన్‌గారిని కలిసినప్పుడు ఆయన కాళ్లను తాకాలనుకున్నాను. అమితాబ్‌గారు వద్దన్నారు. నువ్వు చేస్తే నేనూ చేయాల్సి ఉంటుందన్నారు. సార్... ప్లీజ్ అన్నాను. అప్పట్లో ఎవరైనా టాల్‌గా ఉంటే అమితాబ్ అనేవారు. అమితాబ్ బచ్చన్‌గారి హెయిర్ స్టయిల్ బాగా ఫేమస్. ఇక 'సాగర సంగమం' చూసి ఆ సినిమాలో కమల్‌గారిలా డ్రెస్ కావాలని మా అమ్మతో అన్నాను. 'ఇంద్రుడు చంద్రుడు'లో ఆయన నటన చూసి ఎగ్జైట్ అయ్యాను. ఈ స్టార్స్, దీపికా పదుకోన్‌తో కలిసి యాక్ట్ చేయడం నాకో మంచి ఎక్స్‌పీరియన్స్'' అని ప్రభాస్ అన్నారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన 'కల్కి 2898 ఏడీ' ప్రీ రిలీజ్ వేడుకకు హీరో రానా హోస్ట్‌గా వ్యవహరించారు. ఈ సినిమా తొలి టికెట్‌ను అమితాబ్ బచ్చన్‌కు అశ్వినీదత్ అందించగా, ఆయన నగదు చెల్లించి తీసుకున్నారు. ఈ టికెట్‌ను ఇవ్వాలనుకుంటే ఎవరికి ఇస్తారు? అని అమితాబ్‌ను రానా అడగ్గా, మై బ్రదర్ కమల్‌హాసన్‌కి అని చెప్పారు. ఆ తర్వాత ఈ టికెట్‌ను అమితాబ్ నుంచి కమల్ అందుకుని, 'షోలే' సినిమా 'ఫస్ట్ డే ఫస్ట్ షో' టికెట్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇంకా ఈ వేడుకలో అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ– ''కల్కి 2898 ఏడీ'లో భాగం కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నేనిప్పటివరకూ ఇలాంటి సినిమా చేయలేదు. నాగ్ అశ్విన్ కథ చెప్పినప్పుడు అతను ఏం తాగితే ఇలాంటి ఐడియా వచ్చిందా అనిపించింది. తన విజన్ అద్భుతం. అశ్వినీదత్‌గారు సింపుల్‌గా ఉంటారు. సెట్స్‌లో నాకు కోపరేటివ్‌గా ఉన్నారు'' అన్నారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''కల్కి 2898 ఏడీ' సినిమా స్టార్ట్ చేసేప్పుడు ఆసక్తిగా అనిపించింది. సెట్స్‌లో పాల్గొన్న తర్వాత సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. ఇప్పుడు అద్భుతంగా అనిపిస్తోంది. సాధారణంగా కనిపించేవారు అసాధారణ పనులు చేస్తుంటారు. నాగ్ అశ్విన్ విషయంలో నాకు అదే అనిపించింది. బ్యాట్‌మేన్‌లాంటి కథలు చేయాలని నాకు ఉండేది. ఈ సినిమాలో చేశాను. ఈ సినిమాలో నేనొక పాత్ర చేయాలనుకున్నా.. ఈ పాత్రను అమిత్‌జీ చేస్తున్నారన్నారు. మరో పాత్ర ఎంచుకున్నా.. అది ప్రభాస్ చేస్తున్నారన్నారు. ఫైనల్‌గా సుప్రీమ్ యాస్కిన్ అనే పాత్ర చేశాను'' అన్నారు. ''కరోనా టైమ్‌లో జూమ్‌లో నాగ్ అశ్విన్ కథ చెప్పారు. తన విజన్ క్లియర్‌గా ఉంటుంది. ఇందులో తల్లి పాత్ర చేశాను. ఈ సినిమా సెట్స్‌లో ప్రభాస్ ఈ రోజు ఎవరికి ఏం ఫుడ్ పెట్టారు అన్నదే హైలైట్ డిస్కషన్‌గా ఉండేది (సరదాగా)'' అన్నారు దీపికా పదుకోన్. దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ వేడుకకు హాజరు కాలేదు. కానీ 'కల్కి 2898 ఏడీ' గురించి నాగ్ అశ్విన్ మాట్లాడిన వీడియో బైట్‌ను ప్లే చేశారు. కాశీ, కాంప్లెక్స్, శంబాల అనే మూడు ప్రపంచాల నేపథ్యంలో ఈ కథ ఉంటుందని చెప్పి, ఈ ప్రపంచాల నేపథ్యాలను వివరించారు నాగ్ అశ్విన్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు స్వప్నాదత్, ప్రియాంకా దత్, అనిల్ తడానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రెగ్నెంట్‌గా ఉన్న దీపికా పదుకోన్ స్టేజ్ నుంచి దిగేటప్పుడు ప్రభాస్, స్టేజ్ ఎక్కేటప్పుడు అమితాబ్ హెల్ప్ చేయడం ఈవెంట్‌లో హైలైట్‌గా నిలిచింది.

ఆర్కిటెక్ట్ నిత్య ఆన్ సెట్



● సాక్షీ వైద్య

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శర్వా 37' (వర్కింగ్ టైటిల్). 'సామజవరగమన' వంటి హిట్ మూవీ తర్వాత రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇందులో హీరోయిన్‌గా సాక్షీ వైద్యని ఖరారు చేసినట్లు ప్రకటించారు మేకర్స్. 'ఏజెంట్, గాండీవధారి అర్జున' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సాక్షీ వైద్య సుపరిచితురాలే. తాజాగా శర్వానంద్‌కి జోడీగా నటిస్తున్నారామె. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా బుధవారం (జూన్ 19) సాక్షీ వైద్య పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ సెట్‌లోకి స్వాగతించింది యూనిట్. 'శర్వా 37'లో ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షీ వైద్య నటిస్తున్నారు. ''పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: జ్ఞానశేఖర్ వీఎస్.

కోపాలు చాలండి శ్రీమతిగారు



● మీనాక్షీ చౌదరి, దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' ఫేమ్ దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తెలుగు చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి కథానాయిక. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతదర్శకుడు. ఈ మూవీ నుంచి 'శ్రీమతి గారు..' అంటూ సాగే మొదటి పాటని విడుదల చేసింది చిత్ర బృందం. 'కోపాలు చాలండి శ్రీమతిగారు.. కొంచెం కూల్ అవ్వండి మేడంగారు..' అంటూ ఈ మెలోడీ సాంగ్ సాగుతుంది. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్ ఆలపించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

ఇక డైరెక్షన్‌పైనే ఫోకస్

– రాజేష్ జగన్నాథం



''మలయాళ సినిమాలు చూసి ఇలాంటి చిత్రాలు మన వద్దకు ఎందుకు రావడం లేదని తెలుగు ప్రేక్షకులు అనుకుంటారు. కానీ, మా 'నింద' చూశాక 'బాగా తీశారు.. మన వద్ద కూడా మంచి కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయి' అనుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'నింద' అందరికీ నచ్చే చిత్రం అవుతుంది'' అని చిత్ర దర్శక–నిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'నింద'. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజేశ్ జగన్నాథం మాట్లాడుతూ– ''మాది నర్సాపురం. నెల్లూరు, చెన్నై, యూఎస్‌లో చదువుకుని, అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఉండిపోయాను. ఫిల్మ్ మేకింగ్‌లో కోర్సులు చేసి, అక్కడే షార్ట్ ఫిలింస్ చేశాను. వాస్తవ ఘటనలు, కల్పిత సన్నివేశాలతో 'నింద' స్క్రిప్ట్ రాశాను. ఈ కథ వరుణ్ సందేశ్‌కి మంచి కమ్ బ్యాక్‌లా ఉంటుందని భావించి ముందుకెళ్లాం. కథపై ఉన్న నమ్మకంతోనే నేనే నిర్మించాను. ఈ మూవీలో వరుణ్ సందేశ్ చాలా కొత్తగా కనిపిస్తాడు. 'నింద' తర్వాత ఎక్కువగా దర్శకత్వం మీదే ఫోకస్ పెడతాను'' అన్నారు.


మంచి కామెడీ దెయ్యం



● నందితా శ్వేత, అబినికా, నవమి, అనూప్ రూబెన్స్

నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, నవమీ గాయక్, 'షకలక' శంకర్, రజత్ రాఘవ్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'ఓఎమ్‌జీ (ఓ మంచి ఘోస్ట్)'. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో డా.అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నందితా శ్వేత మాట్లాడుతూ–''శంకర్‌గారు స్టోరీ నరేట్ చేస్తుంటే నవ్వుతూనే ఉన్నాను. హారర్, కామెడీ జానర్స్ మిళితమై వస్తున్న ఈ సినిమాను కుటుంబసమేతంగా చూడొచ్చు'' అన్నారు. ''ఈ సినిమా ప్రారంభం కావడానికి కారణమైన సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, మూవీ స్క్రిప్ట్, డైలాగ్స్‌లో సాయం చేసిన దర్శకుడు రితేష్ రానా, మాపై నమ్మకం ఉంచిన అబినికా, ఈ సినిమాను రిలీజ్ చేస్తున్న ఏషియన్ ఫిల్మ్స్, బాలాజీ ఫిల్మ్స్‌లకు ధన్యవాదాలు'' అన్నారు శంకర్ మార్తాండ్. ''కథను ఎంత బాగా చెప్పారో, అంత బాగా సినిమా తీశారు శంకర్'' అన్నారు అబినికా ఇనాబతుని.

థ్రిల్లింగ్ లెవన్



● నవీన్ చంద్ర, రేయా హరి

''ఇటీవల 'మహారాజ' సినిమా చూశాను... అందులోని ఇంటెన్స్ చూశాక రెండు రోజులు నిద్రపట్టలేదు. ఆ మూవీలోని ట్విస్టులు, మలుపులు, స్క్రీన్ ప్లే గురించి ప్రతి ఒక్కరూ చాలా బాగా చెప్పారు. అదే తరహాలో మా 'లెవన్' మూవీలోనూ కథ, స్క్రీన్ ప్లే, యాక్షన్, యాక్టింగ్.. అన్నీ అద్భుతంగా ఉంటాయి. నా కెరీర్‌లో 'లెవన్' బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది'' అని నవీన్ చంద్ర అన్నారు. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో నవీన్ చంద్ర, రేయా హరి జంటగా నటించిన చిత్రం 'లెవన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో నిఖిల్ విడుదల చేశారు. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'లెవన్'. ఇందులోని యూనిక్ పాయింట్ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది'' అన్నారు లోకేశ్ అజ్ల్స్. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు అజ్మల్.

కళాశాలలో...



● ప్రణవ్, షాజ్ఞ

ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా శ్రీనాథ్ పులకురం మాట్లాడుతూ– 'మా ఊరు పుంగనూరు పేరుతో సినిమా తీయడం గర్వంగా ఉంది. ఈ సినిమా చూశాక అందరూ తమ పేరెంట్స్‌ని గుర్తుకు తెచ్చుకుంటారు'' అన్నారు. ''శ్రీనాథ్‌గారికి సినిమాపై ఉన్న ప్యాషన్ వల్లే నిర్మాతగా మారాను'' అన్నారు భువన్ రెడ్డి. ''పుంగనూరులో ఈ మూవీ షూటింగ్ చేయడం ఆహ్లాదంగా అనిపించింది'' అన్నారు ప్రణవ్.

నా నిద్రను తిరిగిచ్చేయ్..!



● శ్రద్ధా కపూర్

పడ్డానండీ ప్రేమలో మరి అని బాహాటంగానే చెప్పేశారు శ్రద్ధా కపూర్. హిందీలో 'ప్యార్ కా పంచనామా 2, సోనూ కే టిట్టూ కీ స్వీటీ, తు ఝూటీ మైన్ మక్కర్' వంటి సినిమాలకు రచయితగా చేసిన రాహుల్ మోదీతో శ్రద్ధా కపూర్ ప్రేమలో ఉన్నారని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తరచూ వీరు ముంబై వీధుల్లో, రెస్టారెంట్స్‌లో జంటగా కనిపించడం కూడా వీరి ప్రేమను కన్ఫార్మ్ చేసినట్లయింది. తాజాగా 'దిల్ రఖ్ లే.. నీంద్‌తో వాపస్ దే దే యార్' (నా మనసును నీ దగ్గర ఉంచుకో... కానీ నా నిద్రను తిరిగిచ్చేయ్') అని తన ఇన్‌స్టా స్టేటస్‌లో పోస్ట్ చేసి, రాహుల్ ఇన్‌స్టా హ్యాండిల్‌ను ట్యాగ్ చేసి, అతనితో ఉన్న ఫోటోను శ్రద్ధా షేర్ చేశారు. దీంతో రాహుల్, శ్రద్ధా ప్రేమలో ఉన్నారని అంటున్నారు ఆమె అభిమానులు. ఇదిలా ఉంటే.. రణ్‌బీర్ కపూర్, శ్రద్ధా కపూర్ జంటగా లవ్ రంజన్ దర్శకత్వంలో 2019లో ప్రకటించిన 'తు ఝూటీ మైన్ మక్కర్' సినిమాకు రచయితగా చేశారు రాహుల్. ఈ సినిమా అప్పుడే వీరు ప్రేమలో పడ్డారని టాక్.



● రాహుల్ మోదీతో...

సాక్షి బిజినెస్
గురువారం
20-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▼
36	42
77,338	23,516

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,860	▲	3
డోజోన్స్	38,835	▲	57
ఎఫ్‌టీఎస్ఈ 100	8,205	▲	14
డాక్స్	18,068	▼	64
షాంఘై	3,018	▼	12
నికాయ్	38,571	▲	89

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
71,704	▲	419
బంగారం (99.5 స్వచ్ఛత)		
71,417	▲	417
వెండి (కిలో)		
88,195	▲	642

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతదేశం	81.63	85.31
£	బ్రిటన్ పౌండ్	భారతదేశం	103.84	108.75
€	యూరో	భారతదేశం	87.50	91.98
¥	జపాన్ ఎన్ (100)	భారతదేశం	42.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతదేశం	53.34	58.06
S$	సింగపూర్ డాలర్	భారతదేశం	59.48	64.17
SAR	సౌదీ రియాల్	భారతదేశం	21.39	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	భారతదేశం	21.84	23.62
¥	చైనా యువాన్	భారతదేశం	10.80	12.45

జ్యూరిక్ చేతికి కొటక్ ఇన్సూరెన్స్

70 శాతం వాటా కొనుగోలు ● డీల్ విలువ రూ. 5,560 కోట్లు



న్యూఢిల్లీ: కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో 70 శాతం వాటాను జ్యూరిక్ ఇన్సూరెన్స్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ. 5,560 కోట్లుగా కొటక్ మహీంద్రా బ్యాంక్ పేర్కొంది. సంబంధిత నియంత్రణ సంస్థల అనుమతుల తదుపరి జ్యూరిక్ 70 శాతం వాటా కొనుగోలును పూర్తి చేసినట్లు తెలియజేసింది. దీంతో విదేశీ యాజమాన్య వాటాను 74 శాతం వరకూ అనుమతించిన తర్వాత దేశీయంగా జనరల్ ఇన్సూరెన్స్‌లో ప్రవేశించిన తొలి విదేశీ కంపెనీగా జ్యూరిక్ నిలిచినట్లు పేర్కొంది. 49 శాతం నుంచి 74 శాతానికి పెంచుతూ 2021లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) నిబంధనలను సవరించిన సంగతి తెలిసిందే.

30 శాతం బ్యాంక్ చేతిలో

కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో మిగిలిన 30% వాటాను ప్రస్తుతం కొటక్ మహీంద్రా బ్యాంక్ కలిగి ఉంది. మరోపక్క మెజారిటీ వాటా కొనుగోలుతో సంస్థ పేరు జ్యూరిక్ కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌గా మారినట్లు జ్యూరిక్ ఇన్సూరెన్స్ పేర్కొంది.

ఆతిథ్య రంగంలో కొలువుల మేళా!

డిమాండ్–సరఫరా మధ్య అంతరం ● 10 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు



ముంబై: ఆతిథ్య రంగం నిపుణుల కొరతను ఎదుర్కొంటోందని, దీంతో వచ్చే కొన్నేళ్లలో 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కరోనా అనంతరం ఆతిథ్య పరిశ్రమలో డిమాండ్‌కు అనుగుణంగా కొత్త సామర్థ్యాలు పెద్ద ఎత్తున ఏర్పాటు కావడం నిపుణుల కొరతకు కారణంగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం పరిశ్రమవ్యాప్తంగా డిమాండ్–సరఫరా మధ్య అంతరాయం 55–60 శాతంగా ఉంటుందని ర్యాండ్‌స్టాడ్ ఇండియా డైరెక్టర్ సంజయ్ శెట్టి తెలిపారు. కరోనా విపత్తు తర్వాత పరిశ్రమలో బూమ్ (అధిక డిమాండ్) నెలకొందని, వచ్చే కొన్నేళ్ల పాటు ఇదే ధోరణి కొనసాగుతుందన్నారు. కరోనా తర్వాత ఆతిథ్య పరిశ్రమలో నియామకాలు 4 రెట్లు పెరిగిన ట్టు చెబుతున్నారు. ముఖ్యంగా ఆరంభ స్థాయి ఉద్యోగాలకు ఎక్కువ డిమాండ్ ఉన్నట్టు చెప్పారు. నిపుణుల అంతరాన్ని అధిగమించేందుకు ఆతిథ్య కంపెనీలు తమ సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నట్టు నిపుణులు వెల్లడించారు. పోటీతో కూడిన వేతనాలు ఆఫర్ చేస్తూ ఉన్న సిబ్బందిని కాపాడుకోవడంతోపాటు కొత్త వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ''2023లో పర్యాటకం, ఆతిథ్య రంగం 11.1 మిలియన్ల మందికి ఉపాధి కల్పించింది. 2024 చివరికి 11.8 మిలియన్ల ఉద్యోగుల అవసరం ఏర్పడుతుంది. ఈ డిమాండ్ 2028 నాటికి 14.8 మిలియన్లకు పెరగొచ్చు. ఏటా 16.5 శాతం వృద్ధికి ఇది సమానం''అని టీమ్‌లీజ్ బిజినెస్ హెడ్ ధృతి ప్రసన్న మహంత వివరించారు. ప్రస్తుత సిబ్బంది, భవిష్యత్ మానవ వనరుల అవసరాల మధ్య ఎంతో అంతరం కనిపిస్తున్నట్టు టీమ్‌లీజ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్, స్టాఫింగ్ బిజినెస్ హెడ్ ఎ.బాలసుబ్రమణియన్ సైతం తెలిపారు. నిపుణుల కొరతను అధిగమించేందుకు హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అప్రెంటిస్‌షిప్‌ల ద్వారా నిపుణుల కొరతను తీర్చుకునేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ కృషి చేస్తోంది.

రికార్డు స్థాయిల్లో లాభాల స్వీకరణ

- నాలుగో రోజూ సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై
- నష్టాలతో ముగిసిన నిఫ్టీ



ముంబై: జీవితకాల గరిష్టాల వద్ద స్టాక్ సూచీలను ముందుకు నడిపించే కీలక కాంశాలేవీ లేకపోవడంతో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ స్వల్ప లాభాల్లో, నిఫ్టీ నష్టాల్లో మిశ్రమంగా ముగిశాయి. ప్రథమార్ధంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 551 పాయింట్లు పెరిగి 77,852 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు బలపడి 23,664 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. లాభాల స్వీకరణతో చివరికి సెన్సెక్స్ 36 పాయింట్లు లాభంతో 77,338 వద్ద, నిఫ్టీ 42 పాయింట్ల నష్టపోయి 23,516 వద్ద నిలిచాయి. గ్లాండ్ ఫార్మాలో ప్రమోటర్ సంస్థ ఫోసన్ ఫార్మా 6 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. ఈ బల్క్ డీల్ విలువ రూ. 1,754 కోట్లు. దీంతో గ్లాండ్‌లో ఫోసన్ వాటా 57.86% నుంచి 51.86 శాతానికి తగ్గింది.

ఇన్‌క్యుబేషన్ సెంటర్ల ఏర్పాటులో రామ్‌ఇన్ఫో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే లిస్టెడ్ సంస్థ రామ్‌ఇన్ఫో వచ్చే మూడేళ్లలో టాప్ 5 మధ్య స్థాయి టెక్ కంపెనీల్లో ఒకటిగా ఎదగాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా అమెరికాలో కూడా కార్యకలాపాలు విస్తరిస్తోంది. అంకుర సంస్థలకోసం అమెరికాలో రెండు, భారత్‌లో ఒకటి చొప్పున ఇన్‌క్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ఎండీ ఎల్ శ్రీనాథ్‌రెడ్డి బుధవారమిక్కడ తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా 1994లో ఏర్పాటైన రామ్‌ఇన్ఫో .. ఈసేవ, మీసేవ, సువిధా వంటి సొల్యూషన్స్‌తో అటు ప్రభుత్వాలు, ఇటు కంపెనీలకు ఐటీ, డిజిటల్ పరివర్తన సేవలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 9 రాష్ట్రాల్లో సాగిస్తున్న కార్యకలాపాలను 2024–25లో 15 రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు శ్రీనాథ్‌రెడ్డి వివరించారు. 135 మిలియన్ డాలర్ల ఆదాయం నిర్దేశించుకున్నట్లు చెప్పారు.

అదానీ 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: హరిత ఇంధన ఉత్పత్తికి అవసరమయ్యే కీలక భాగాల తయారీ సామర్థ్యాలను పెంచుకోవడంపై, ఇంధన పరివర్తన ప్రాజెక్టులపై వచ్చే దశాబ్ద కాలంలో అదానీ గ్రూప్ 100 బిలియన్ డాలర్లపైగా ఇన్వెస్ట్ చేయనుంది. సోలార్ పార్కులను నిర్మించడం నుంచి హరిత హైడ్రోజన్, పవన విద్యుత్ టర్బైన్లు మొదలైన వాటి కోసం ఎలక్ట్రోలైజర్లను తయారు చేయడం వరకు భారీ ప్లాంట్లను గ్రూప్ ఏర్పాటు చేస్తోంది. రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ విషయాలు తెలిపారు. ఇంధన పరివర్తన, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనలో లక్షల కోట్ల (ట్రిలియన్ల) డాలర్లకు వ్యాపార అవకాశాలు ఉన్నాయని, ఇవి భారత్ రూపురేఖలను దేశీయంగానూ, అంతర్జాతీయంగాను మార్చేయగలవన్నారు. అంతర్జాతీయంగా ఇంధన పరివర్తన మార్కెట్ 2023లో 3 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా ఇది 2030 నాటికి 6 ట్రిలియన్ డాలర్లకు చేరగలదని, అటుపైన 2050 వరకు ప్రతి పదేళ్లకు రెట్టింపు కానుందని అదానీ చెప్పారు. భారత్ నిర్దేశించుకున్నట్లుగా 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాలు సాధించాలంటే ఏటా 150 బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు అవసరమన్నారు.

ఒమేగా హాస్పిటల్స్‌లో మోర్గాన్ స్టాన్లీ పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఒమేగా హాస్పిటల్స్ పేరుతో వైద్య సేవల రంగంలో ఉన్న హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో మోర్గాన్ స్టాన్లీ పీఈ ఆసియా ఫండ్ రూ.500 కోట్లు పెట్టుబడి చేసింది. డాక్టర్ మోహన వంశీ నేతృత్వంలో 2010లో ప్రారంభం అయిన ఒమేగా హాస్పిటల్స్ క్యాన్సర్ చికిత్సలో దేశంలో పేరెన్నికగలది. సంస్థకు 10కిపైగా ఆసుపత్రులు ఉన్నాయి. మొత్తం పడకల సామర్థ్యం 1,400. దేశవ్యాప్త విస్తరణ లక్ష్యానికి ఈ నిధులు దోహదం చేయగలవని ఒమేగా కృతనిశ్చయంతో ఉంది. రాబోయే సంవత్సరాల్లో క్యాన్సర్ చికిత్సలో భారత్‌లో అగ్రశ్రేణి సంస్థగా నిలుపుతామని ఒమేగా ఎండీ మోహన వంశీ ఈ సందర్భంగా తెలిపారు.

వడ్డీ ఆదాయంపై పన్ను ఊరటనివ్వాలి: దినేశ్ ఖారా



న్యూఢిల్లీ: రాబోయే పూర్తి స్థాయి బడ్జెట్‌లో వడ్డీ ఆదాయంపై పన్నుపరంగా ఊరటనివ్వాలని కేంద్రానికి ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా చర్య తీసుకుంటే డిపాజిటర్లకు ప్రోత్సాహకంగా ఉండి పొదుపు పెరుగుతుందని, అలా వచ్చే నిధులను దీర్ఘకాలిక మౌలిక రంగ ప్రాజెక్టుల కోసం ఉపయోగించుకునేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక ఏడాదిలో ఒక వ్యక్తికి సంబంధించి అన్ని శాఖల్లో ఉన్న డిపాజిట్లపై వడ్డీ ఆదాయం రూ. 40,000 దాటితే బ్యాంకులు ట్యాక్స్‌ను డిడక్ట్ చేయాల్సి ఉంటోంది. అదే, సేవింగ్స్ అకౌంట్లయితే రూ. 10,000 వరకు వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంటోంది.

వొడాఫోన్‌కు 15,300 కోట్లు

ఇండస్‌లో 18% వాటా సేల్

న్యూఢిల్లీ: బ్రిటిష్ టెలికం దిగ్గజం వొడాఫోన్ రూ. 15,300 కోట్లు సమకూర్చుకుంది. ఇందుకు టెలికం టవర్ల కంపెనీ ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాను విక్రయించింది. దేశీయంగా వొడాఫోన్ ఆస్తులపై తీసుకున్న 1.8 బిలియన్ యూరోల బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లించేందుకు నిధులను వినియోగించనుంది. వొడాఫోన్ గ్రూప్ పీఎల్‌సీ తాజాగా ఇండస్ టవర్స్‌లో 48.47 కోట్ల షేర్లను విక్రయించింది. తద్వారా రూ. 15,300 కోట్లు(1.7 బిలియన్ యూరోలు) సమీకరించింది. ఈ లావాదేవీ తర్వాత ఇండస్ టవర్స్‌లో వొడాఫోన్ వాటా 3.1%కి పరిమితమైంది. కాగా.. ఇండస్ టవర్స్‌లో భారతీ ఎయిర్‌టెల్ వాటా 1% పెరిగి 48.95 శాతానికి బలపడింది. ఇందుకు 862 కోట్లకు పైగా వెచ్చించింది.

టెలికం యూజర్లు @120 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య ఏప్రిల్‌లో 120 కోట్లు దాటింది. ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 120.12 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది మార్చిలో ఇది 119.92 కోట్లుగా ఉంది. చివరిసారిగా 2017 జూలైలో 121 కోట్ల రికార్డు స్థాయిని తాకింది. తాజాగా, వైర్‌లెస్ విభాగంలో రిలయన్స్ జియోకి ఏప్రిల్‌లో 26.8 లక్షల మంది కొత్త యూజర్లు జత వడంతో మొత్తం యూజర్ల సంఖ్య 47.24 కోట్లకు చేరింది. 7.52 లక్షల కొత్త కస్టమర్లు, మొత్తం 26.75 కోట్ల యూజర్లతో ఎయిర్‌టెల్ తర్వాత స్థానంలో ఉంది. బీఎస్ఎన్ఎల్ యూజర్ల సంఖ్య 12.3 లక్షలు, వొడాఫోన్ ఐడియా యూజర్లు 7.35 లక్షల మేర తగ్గారు.

టాటా వాణిజ్య వాహనాలు ప్రియం



న్యూఢిల్లీ: వాణిజ్య వాహనాల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్టు టాటా మోటార్స్ బుధవారం ప్రకటించింది. జూలై 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి వస్తాయని వెల్లడించింది. అన్ని రకాల వాణిజ్య వాహనాలకు కొత్త ధరలు వర్తిస్తాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సైతం 2 శాతం వరకు వాహనాల ధరలను కంపెనీ పెంచింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505–00
వరంగల్	507–00
రిటైల్ ధర	5.65

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐకార్-ఐఐఓఆర్, రాజేంద్రనగర్‌లో 12 జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్(ఐఐఓఆర్).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలోలు–07, యంగ్ ప్రొఫెషనల్–1: 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణుల వ్వాలి. నెట్/గేట్ స్కోరు, పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.37,000, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.30,000.
» **వయసు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు మహిళలకు 40 ఏళ్లు, పురుషులకు 35 ఏళ్లు మించకూడదు, యంగ్ ప్రొఫెషనల్‌కు వయసు 21–45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 08.07.2024.
» **వెబ్‌సైట్:** https://icariior.org.in

ఐకార్-ఐఐఆర్ఆర్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** సీనియర్ రీసెర్చ్ ఫెలో–01, యంగ్ ప్రొఫెషనల్ –01, టెక్నికల్ అసిస్టెంట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.35,000, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.30,000, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15,000.
» **వయసు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు. ఇతర పోస్టులకు 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** victornpet@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 26.06.2024.
» **వెబ్‌సైట్:** https://www.icariirr.org/

అగ్రి కోర్సులు.. ఎవర్‌గ్రీన్ కెరీర్

» ఏపీ, తెలంగాణలో అగ్రి డిప్లొమా, డిగ్రీ కోర్సులు
» డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
» బ్యాచిలర్ కోర్సులకు ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం
» కోర్సులు పూర్తి చేసుకుంటే.. విస్తృత అవకాశాలు

అగ్రికల్చర్ కోర్సులతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. అందుకే వ్యవసాయ కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు తమ అర్హతలకు తగ్గ కోర్సుల్లో చేరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో.. అగ్రికల్చల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. బ్యాచిలర్ స్థాయి కోర్సులకు కూడా త్వరలోనే ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో.. ఏపీ, తెలంగాణలో.. అగ్రికల్చరల్ డిప్లొమా, డిగ్రీ కోర్సులు.. ప్రవేశ విధానాలు.. భవిష్యత్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



పదో తరగతి తర్వాత విద్యార్థుల ముంగిట ఎన్నో కోర్సులు. అధిక శాతం మంది ఇంజనీరింగ్, మెడిసిన్ లక్ష్యంగా ఎంపీసీ, బైపీసీ గ్రూప్స్‌తో ఇంటర్‌లో చేరుతున్నారు. అదేవిధంగా సత్వర ఉపాధి కోసం కొంతమంది డిప్లొమా కోర్సులను ఎంచుకుంటున్నారు.అలాంటి వారికి అందుబాటులో ఉన్న మరో ప్రత్యామ్నాయం అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు.

పదో తరగతితో అగ్రి డిప్లొమా

పదో తరగతి ఉత్తీర్ణతతోనే అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో చేరొచ్చు. వ్యవసాయ రంగానికి సంబంధించి క్షేత్ర నైపుణ్యాలు అందించే కోర్సులు ఇవి. వీటికోసం ప్రత్యేకంగా పాలిటెక్నిక్స్‌ను సైతం నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, అదే విధంగా తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను నిర్వహిస్తున్నారు.

పలు విభాగాలు

- అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులకు సంబంధించి ప్రస్తుతం పలు విభాగాల్లో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు వ్యవధి మూడేళ్లు. మిగతా కోర్సుల కాల వ్యవధి రెండేళ్లు.

భారీ సంఖ్యలో సీట్లు

అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సులకు సంబంధించి తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో 260 సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌లో 540 సీట్లు ఉన్నాయి. అదేవిధంగా ఏపీలో ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో 688 సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌లో 2,530 సీట్లు ఉన్నాయి.

ప్రవేశ ప్రక్రియ ప్రారంభం

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వ్యవసాయ పాలిటెక్నిక్స్‌లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.

ఎంపిక ఇలా

అగ్రి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ, తెలంగాణలో వేర్వేరు నిబంధనలు అమలవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో.. విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు టీఎస్ పాలిసెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. దాని ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. ఏపీలో పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి సీట్లు కేటాయిస్తారు.

పల్లె విద్యార్థులకు వెయిటేజీ

సీట్ల కేటాయింపులో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేకంగా వెయిటేజీ కల్పిస్తున్నారు. తెలంగాణలో.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 60 శాతం సీట్లను కేటాయిస్తారు. ఏపీలో నిబంధనల ప్రకారం –పదో తరగతిలోపు కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివిన వారికి మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను, పట్టణ ప్రాంతాల్లో చదివిన వారికి 25 శాతం సీట్లను కేటయిస్తారు.

ఇంగ్లిష్ మీడియం బోధన

అగ్రికల్చర్ డిప్లొమాలను ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తారు. ఆయా రంగాల్లోని వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో అవగాహన చేసుకోవడంతో పాటు, డిప్లొమా తర్వాత జాబ్ మార్కెట్, ఉన్నత విద్యావకాశాలు అందిపుచ్చుకోవడంలో ఇంగ్లిష్ భాష దోహదపడుతుందని ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

కెరీర్ అవకాశాలు

- అగ్రికల్చర్, డెయిరీ, హార్టికల్చర్(ఉద్యాన) విభాగాలకు డిమాండ్ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా ఈ రంగంలో కెరీర్ అవకాశాలు మెరుగవుతున్నాయి.
- పదో తరగతి అర్హతతోనే ఈ విభాగాల్లో నైపుణ్యం సాధించేందుకు,ఆ తర్వాత ఉద్యోగం, స్వయం ఉపాధి పొందేందుకు డిప్లొమా కోర్సులు దోహద పడుతున్నాయి.
- ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, న్యూట్రియంట్ పరిశ్రమల్లో ప్లాంట్ అసిస్టెంట్, టెక్నీషియన్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రారంభంలోనే నెలకు రూ.15 వేల వరకు వేతనం అందుకోవచ్చు.
- ఉన్నత విద్య పరంగా బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీలు పూర్తి చేసుకుంటే.. విత్తన ఉత్పత్తి కేంద్రాలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఉన్నత స్థాయి కొలువులు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్రభుత్వ విభాగాల్లో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల్లోనూ అవకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్యలోనూ ప్రాధాన్యం

అగ్రికల్చర్, అనుబంధ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి బ్యాచిలర్ డిగ్రీ ప్రవేశాల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. ఇందుకోసం వీరికి ప్రత్యేకంగా కొన్ని సీట్లు కేటాయిస్తారు. అదే విధంగా అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తి చేసుకున్న వారు బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు. ఇందుకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్ష(అగ్రిసెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఈఏపీ సెట్‌తో బ్యాచిలర్ కోర్సులు

- అగ్రికల్చర్ విభాగంలో.. ఇంటర్మీడియెట్ అర్హతతో బ్యాచిలర్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్), బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీఎస్సీ ఆనర్స్–కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులు ఈఏపీ–సెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్, కమ్యూనిటీ సైన్స్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ ఆనర్స్–హార్టికల్చర్ కోర్సుల సీట్లను ఈఏపీ–సెట్ బైపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్లను ఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. దీంతోపాటు.. బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ సీట్లను ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు.
- ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా వ్యవసాయ విశ్వ విద్యాలయాలు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తాయి. అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ కోర్సుల్లో ప్రవేశానికి త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది.

ఉన్నత ఉద్యోగాలు

- అగ్రికల్చర్ అనుబంధ విభాగాల్లో బ్యాచిలర్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి భవిష్యత్తులో ఉజ్వల కెరీర్ అవకాశాలు స్వాగతం పలుకుతాయనడంలో సందేహం లేదు.
- అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసుకున్న వారికి ప్రైవేటు రంగంలో విత్తన తయారీ సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ విభాగాల్లో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు. బ్యాంకుల్లో సైతం రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ విభాగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.
- బీటెక్–ఫుడ్ టెక్నాలజీ సర్టిఫికెట్‌తో.. ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు. అదే విధంగా.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ పొడక్షన్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.
- బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకుంటే.. అగ్రి ఎక్విప్‌మెంట్ సంస్థలు, క్రాప్ పొడక్షన్ కంపెనీలలో సాంకేతిక విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.
- బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ పూర్తి చేసుకుంటే.. హాస్పిటల్స్, చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్స్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్, ఎన్‌జీఓలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అగ్రికల్చర్ కోర్సులు.. ముఖ్యాంశాలు

- అగ్రికల్చర్ డిప్లొమా, డిగ్రీ కోర్సులతో ఉన్నత విద్య, ఉపాధి మార్గాలు.
- సీడ్స్, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలు.
- ప్రభుత్వ విభాగంలోనూ వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఉద్యోగాలు.
- నెలకు రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు వేతనం అందుకోవచ్చు.
- బ్యాచిలర్ కోర్సులకు ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు.
- డిప్లొమా కోర్సులకు తెలంగాణలో పాలిసెట్ ర్యాంకు; ఏపీలో పదో తరగతి మెరిట్ ఆధారంగా ఎంపిక.

ఏపీలో అగ్రికల్చరల్ డిప్లొమా.. ముఖ్య సమాచారం

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 31 నాటికి 15–22 ఏళ్లు ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024,జూన్ 20
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://angrau.ac.in

తెలంగాణలో అగ్రికల్చరల్ డిప్లొమా.. ముఖ్య సమాచారం

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత, టీఎస్ పాలిసెట్ (అగ్రికల్చర్ స్ట్రీమ్) అర్హత.
- **వయసు:** డిసెంబర్ 31, 2024 నాటికి 15–22 ఏళ్లు ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూన్ 25
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, జూన్ 27
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://diploma.pjtsau.ac.in

జూన్‌లో లోటు వర్షపాతమే!

- తాజా పరిస్థితుల మేరకు ఐఎండీ అంచనా
- ప్రస్తుతానికి సాధారణం కంటే 9% ఎక్కువగానే నమోదు
- నెలాఖరులో భారీ వర్షాలు కురుస్తాయంటున్న వాతావరణ శాఖ
- అయినా చాలాచోట్ల లోటు ఉంటుందంటున్న ఐఎండీ

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల గమనం మందగించింది. జూన్ నెల మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి ఆ తర్వాత అత్యంత చురుకుగా కదిలి ఈనెల 14వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. కానీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ముఖ్యంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో మాత్రం ప్రస్తుతం రుతుపవనాల కదలికలు మందగమనంలోనే ఉన్నాయి. దీంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ నెలకు సంబంధించిన అంచనాలను ఐఎండీ తాజాగా విడుదల చేసింది. ఈ నెలలో రాష్ట్రంలోని చాలాచోట్ల లోటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులే కనిపిస్తున్నట్లు తెలిపింది. నెలాఖరులో వర్షాలు కురుస్తాయని, సాధారణ వర్షపాతానికి దగ్గరగా గణాంకాలు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ మొత్తం మీదా చాలాచోట్ల లోటు ఉంటుందని ప్రకటించింది.



8 జిల్లాల్లో సాధారణం..11 జిల్లాల్లో లోటు

జూన్ నెలలో ఇప్పటివరకు 7.85 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. బుధవారం ఉదయానికి 8.53 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 9 శాతం అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈనెల చివరి వారంలో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు నమోదు కావొచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, తూర్పు ప్రాంత జిల్లాల్లోనే ఇందుకు ఎక్కువగా అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలోని 8 జిల్లాల్లో సాధారణ వర్షపాతం, 7 జిల్లాల్లో అధిక వర్షపాతం, 6 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఇక 11 జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. మంచిర్యాలలో లోటు ఎక్కువగా నమోదైంది.

జూన్‌లో సాధారణ వర్షపాతం : 12.94 సెంటీమీటర్లు
బుధవారం నాటికి కురవాల్సిన వర్షం : 7.85 సెంటీమీటర్లు
నమోదైన వర్షపాతం : 8.53 సెంటీమీటర్లు
సాధారణం కంటే 9 శాతం అధికంగా నమోదు

రానున్న రెండ్రోజుల్లో వర్షసూచన

ప్రస్తుతం కోస్తాంధ్రను ఆనుకుని తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఇది సముద్రమట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉందని, దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

జూన్‌లో ఇప్పటివరకు జిల్లాల వారీగా వర్షపాతం..

- **తీవ్ర లోటు (-60% నుంచి -99%):** మంచిర్యాల
- **లోటు(-20% నుంచి -59%):** ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి
- **సాధారణం(+19% నుంచి -19%):** వరంగల్, హనుమకొండ, కరీంనగర్, మెదక్, సిద్దిపేట, జనగామ, రంగారెడ్డి, ఖమ్మం
- **అధికం(+20% నుంచి +59%):** మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నారాయణపేట
- **అత్యధికం(+60% పైబడి):** హైదరాబాద్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ

ఎస్‌ఐ భవాని సేన్‌పై వేటు


- సీఎం ఆదేశాల మేరకు సర్వీస్ నుంచి తొలగింపు
- మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడి ఘటనపై సర్కార్ సీరియస్

భూపాలపల్లి/కాళేశ్వరం: ప్రజలకు భద్రత కల్పించాల్సిన ఓ పోలీసు అధికారి తన కిందిస్థాయి సిబ్బందిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకోగా 'ఖాకీచకుడు'పేరిట బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి కీచక ఎస్‌ఐని సర్వీస్ నుంచి తొలగించాలని ఆదేశించారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎస్‌ఐ భవాని సేన్ అదే ఠాణాలో పనిచేస్తున్న ఓ మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై కన్నేశాడు. ఆమె కాళేశ్వరం పాత పోలీస్‌స్టేషన్ బిల్డింగ్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నివాసం ఉంటుండగా, ఎస్‌ఐ రెండో అంతస్తులో ఉంటున్నాడు. 20 రోజుల క్రితం తాను జారి పడ్డానని, కాలికి గాయమైందని, తన గదికి రావాలని ఎస్‌ఐ అభ్యర్థించగా బాధిత మహిళ వెళ్లింది. అదే సమయంలో ఆమెను లొంగదీసుకునేందుకు యత్నించగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. తర్వాత ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఎస్‌ఐ గుట్టుచప్పుడు కాకుండా కిటికీ ద్వారా ఆమె ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి యత్నించాడు. బాధితురాలు ప్రతిఘటించేందుకు ప్రయత్నించగా తన సర్వీస్ రివాల్వర్‌తో బెదిరించి, ఆమెను గాయపరిచి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించి వెళ్లిపోయాడు. బుధవారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవాని సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రివాల్వర్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించారు.

సర్వీస్ నుంచి తొలగింపు

ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. హెడ్‌కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడిన భవాని సేన్‌ను రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 ప్రకారం సర్వీస్ నుంచి తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మల్టీజోన్-1 ఐజీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. భవాని సేన్ 2022 జూలైలో లైంగిక వేధింపులకు పాల్పడటంతో ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సదరు ఎస్సై తన హోదా అడ్డుపెట్టుకొని మరో ముగ్గురు మహిళా కానిస్టేబుళ్లపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు.

జూపార్క్ తరలింపు అవాస్తవం



సాక్షి, హైదరాబాద్: నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను షాద్‌నగర్‌కు తరలిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ మోహన్ పర్గెయిన్ స్పష్టం చేశారు. జూపార్క్ తరలింపు ప్రక్రియ అంత సులువుగా జరగదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన నూతన స్థల ప్రతిపాదనల అనుమతులు, నిర్ణయాలు ఢిల్లీలోని సెంట్రల్ జూ అథారిటీ నుంచి తీసుకోవలసి ఉంటుందని తెలిపారు. 1963లో స్థాపించిన ఈ జూపార్క్ ఇటీవలే 60 ఏళ్ల పూర్తి చేసుకున్నదని తెలియజేశారు. ఇప్పటివరకు లక్షల మంది సందర్శకులకు ఆహ్లాదం పంచిన ఈ పార్క్ ప్రస్తుతమున్న చోటునుంచి మరే ఇతర ప్రదేశానికి తరలించాలనే ప్రతిపాదన కూడా తమ వద్ద లేదని వెల్లడించారు.

టీజీ పీఈసెట్‌లో 1,645 మంది పాస్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి బుధవారం విడుదల చేశారు. బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 1,198 మంది పరీక్ష రాస్తే, 1,156 (96.49 %) ఉత్తీర్ణులయ్యారు. డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 507 మంది పరీక్ష రాస్తే, 498 మంది (96.45 %) ఉత్తీర్ణులయ్యారు. బీపీఈడీలో 648 మంది బాలురు, 508 మంది బాలికలు, డీపీఈడీలో 294 మంది బాలురు, 195 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.